బుధవారం
4-6-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 253
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ప్రశాంత్ కిషోర్‌పై పరువు నష్టం దావా

పాట్నా: జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్‌పై బీహార్ మంత్రి, జేడీయూ సీనియర్ నాయకుడు అశోక్ చౌధరి పరువునష్టం దావా వేశారు. తనపై అసత్యపు ఆరోపణలు చేసి, తన పరువు తీసినందుకు దావా వేశానని చెప్పారు. ప్రశాంత్ కిషోర్ తనపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకుని క్షమాపణలైనా చెప్పాలి లేదంటే తనపై చేసిన ఆరోపణలు నిజమేనని రుజువైనా చేయాలని డిమాండ్ చేశారు. అశోక్ చౌధరి గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తన కుమార్తె శాంభవికి ఎంపీ టికెట్ కోసం లోక్‌జన శక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు లంచం ఇచ్చారని ప్రశాంత్ కిషోర్ ఇటీవల ఆరోపించారు. శాంభవి ప్రస్తుతం సమస్తిపూర్ నియోజకవర్గం నుంచి లోక్‌జన శక్తి పార్టీ ఎంపీగా ఉన్నారు.

తుని కేసుపై ప్రభుత్వం వెనక్కి..

విశాలాంధ్ర బ్యూరో‌- అమరావతి: తుని రైలు దహనం కేసుకు సంబంధించి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం యూ టర్న్ తీసుకుంది. తుని కేసు తిరగదోడే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. ఈ కేసుపై రైల్వే కోర్టు ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లే యోచన లేదని తేల్చిచెప్పింది. ఈనెల 2వ తేదీన ఇదే తుని కేసుపై అప్పీల్ చేయాలని హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ముద్రగడ పద్మనాభంతోపాటు కాపు ఉద్యమ కారులపై కేసులు కొట్టేస్తూ గతంలో తీర్పు వచ్చిన విషయం విదితమే. దీంతో గత ప్రభుత్వ హయాంలో కాపు ఉద్యమకారులందరిపైనా కేసులు కొట్టేశారు. మళ్లీ తునికి సంబంధించిన కేసులు విచారించేందుకు ప్రభుత్వం కీలక

- మిగతా 2లో

అదానీపై అమెరికా న్యాయశాఖ దృష్టి

న్యూఢిల్లీ: బిలియనీర్ గౌతం అదానీ కంపెనీలపై మళ్లీ అమెరికా ప్రాసిక్యూటర్లు దృష్టి పెట్టారు. ఇరాన్‌కు చెందిన ద్రవరూప పెట్రోలియం వాయువును గుజరాత్‌లోని ముంద్రా పోర్టు వరకు కంపెనీ తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై వాల్ స్ట్రీట్ జర్నల్ తాజా కథనం ప్రచురించింది. ఇరాన్ గల్ఫ్ నుంచి ముంద్రా పోర్టు వరకు ట్యాంకర్లు ప్రయాణించినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. అనేక ఎల్పీజీ ట్యాంకర్లను కార్గోలు వాడి అదానీ కంపెనీకి తరలించినట్లు

- మిగతా 2లో

కేంద్ర మంత్రిమండలి సమావేశం నేడు

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రిమండలి సమావేశం సుదీర్ఘకాలం తర్వాత బుధవారం జరగనుంది. సుష్మా స్వరాజ్ భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. ఎన్‌డీఏ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో కేంద్ర మంత్రిమండలి సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈనెల 9వ తేదీతో ఎన్‌డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తవుతుండటంతో పాటు ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో జరుగుతున్న కేంద్ర

- మిగతా 2లో

ఇదీ లోకం!

రేపు రండి!

వాస్తవాలు చర్చిద్దాం

- పార్లమెంటును సమావేశపర్చండి
- 'ఇండియా' డిమాండ్
- ప్రధానికి 16 పార్టీల లేఖ

న్యూఢిల్లీ: పార్లమెంటుకు ప్రభుత్వం జవాబుదారీ కాగా ప్రజలకు పార్లమెంటు జవాబుదారీగా ఉంటుందని ఇండియా ఐక్య సంఘటన నొక్కిచెప్పింది. పార్లమెంటులో ప్రజల గొంతుక వినిపించేదే ప్రతిపక్షమని వక్కాణించింది. పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్, భారత్‌-పాక్ ఉద్రిక్తతలు, కాల్పుల విరమణపై అమెరికా ప్రకటన, ఉగ్రవాద అంతానికి వ్యూహాలు తదితర కీలకాంశాలపై చర్చించడం కోసం పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపర్చాలని డిమాండ్ చేసింది. దిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో 'ఇండియా'లోని 16 పార్టీల ప్రతినిధులు మంగళవారం సమావేశమయ్యారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశం కోసం ఉమ్మడిగా డిమాండ్ చేస్తూ ప్రధాని మోదీకి లేఖ రాశారు. కాంగ్రెస్ నాయకులు జైరాం రమేశ్, దీపేందర్ సింగ్ హుడా, టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్, సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్‌గోపాల్ యాదవ్, ఆర్‌జేడీ ప్రతినిధి మనోజ్ ఝా, శివసేన యూబీటీ ఎంపీ సంజయ్ రౌత్ తదితరులు సమావేశానికి హాజరు కాగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్) గైర్హాజరయ్యాయి. ఆప్ బుధవారం వేరుగా మోదీకి లేఖ రాయనుంది. సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో

- మిగతా 2లో

భారత్‌కు అందని జీ7 ఆహ్వానం

ఇది భంగపాటే: కాంగ్రెస్

న్యూఢిల్లీ: కెనడాలోని ఆల్బెర్టాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరుగనున్న జీ7 సదస్సుకు భారత్‌కు ఆహ్వానం అందలేదు. దీంతో ఆరేళ్లలో తొలిసారి ఈ సదస్సుకు ప్రధాని మోదీ దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. భారత్‌-పాక్ మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి అమెరికాను అనుమతించిన తర్వాత ఇది మరో దౌత్యపరమైన భంగపాటేనని పేర్కొంది. కెనడాలో జరుగనున్న జీ7 సదస్సులో పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్ మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధంతో పాటు ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లపైనా చర్చించే అవకాశం ఉంది. అయితే, ఈ సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశం లేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ శిఖరాగ్ర సమావేశానికి మోదీకి ఇంకా ఆహ్వానం పంపలేదని తెలిసింది. ఒకవేళ ఆహ్వానం వచ్చినా... ప్రస్తుతం రెండు దేశాల మధ్య నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో మోదీ అక్కడికి వెళ్లకపోవచ్చనే వాదన ఉంది. ఇదే అంశంపై కాంగ్రెస్ విమర్శలు

- మిగతా 2లో

భూ భారతి
దేశానికే తలమానికం

- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- 20 వరకు ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సులు: భట్టి

విశాలాంధ్ర బ్యూరో‌- ఖమ్మం: దేశానికే తలమానికంగా భూ భారతి చట్టాన్ని రూపొందించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో మంగళవారం భూ భారతి సర్వే, రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. భట్టి మాట్లాడుతూ... భూ భారతి చట్టం ద్వారా 413 గ్రామాల ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు సర్వే చేయించి సరిహద్దులను నిర్ణయించి ఇబ్బందులు లేకుండా చేయాలని పైలెట్ ప్రాజెక్టు కింద ములుగుమాడు గ్రామాన్ని ఎంపిక చేశామని చెప్పారు. ఈ నెల 20వ తేదీవరకు ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తెలంగాణ టెనెన్సీ యాక్ట్ 1950 ద్వారా పేదలకు భూ హక్కులను కల్పించామని, 1971 ఆర్.ఓ.ఆర్. చట్టం, 1973 భూ సంస్కరణల కారణంగా రైతులకు చాలా మేలు జరిగిందని వివరించారు. 2020లో ధరణి చట్టం వల్ల అనేక సమస్యలు వచ్చాయని, భూ హక్కులను కాలరాస్తూ మరొకరి పేరు మీద భూములు ఎక్కించడం వంటి అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యాయని అన్నారు. ప్రతి సంవత్సరం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూమి అమ్మకాలు, కొనుగోలు వివరాలను అప్‌డేట్ చేస్తూ, భూ రికార్డులను పంచాయితీ కార్యాలయంలో అతికించడం జరుగుతుందని అన్నారు. భూ సంస్కరణల కారణంగా రాష్ట్రంలో దాదాపు 26 లక్షల ఎకరాలు పేదలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ధరణి లో ఇలాంటి భూములను పార్ట్ బీ లో పెట్టి ఇబ్బందులకు గురి చేశారని, అర్హులైన వారికి భూ భారతి చట్టం ద్వారా పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు. భూ సమస్యలను రెవెన్యూ అధికారుల దగ్గరే పరిష్కరించుకునేలా అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు చేశామని చెప్పారు. తుమ్మల మాట్లాడుతూ పట్టాపాస్ పుస్తకాలలో ఉన్న తప్పుల కారణంగా రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఒకే సంవత్సరంలో రూ.36 వేల కోట్లు నేరుగా అందించామని తెలిపారు. నాట్లకు ముందే రైతు భరోసా నిధులు జమ చేస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణ కోసం ప్రజలు ముందుకు రావాలని మంత్రి కోరారు. పొంగులేటి మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి ప్రజలకు భద్రత కల్పిస్తామని అన్నారు. రాష్ట్రంలోని 413 గ్రామాలలో సరైన భూ రికార్డులు, నక్షాలు లేవని, వీటిలో ఐదు గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టి

- మిగతా 2లో

టర్కీలో భారీ భూకంపం

2లో

'మిస్ వరల్డ్'కు రూ.30 కోట్లే ఖర్చు

- రూ. 200 కోట్లు ఎక్కడ ఖర్చయ్యాయో బీఆర్‌ఎస్ నేతలు చెప్పాలి
- పోటీదారులకు 30 తులాల బంగారం... పచ్చి అబద్ధం
- మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ ఆరోపణలు అవాస్తవం: మంత్రి జూపల్లి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు సుమారు రూ.30 కోట్లు ఖర్చు అయిందని, వీటి ద్వారా తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ పర్యాటక అభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించడం లక్ష్యంగా నిర్వహించిన మిస్ వరల్డ్-2025 పోటీలు విజయవంతం అయ్యాయన్నారు. పర్యాటకం, హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు మంచి ప్రచారం వచ్చిందని, సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను ప్రపంచానికి పరిచయం చేశామని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీ నిర్వహణపై అభినందించాల్సి పోయి ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. స్పాన్సర్ల ద్వారానే రూ.21 కోట్లు వచ్చాయని, ప్రభుత్వానికి అయిన ఖర్చు రూ.తొమ్మిది కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. సుమారు రూ.11 కోట్ల ఆదాయం పై ఒప్పందాలు ఉన్నాయని వివరించారు. మిస్ వరల్డ్ పోటీలకు రూ.200 కోట్లు ఖర్చు ఎక్కడ అయ్యాయో చెప్పాలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుకు సవాల్ విసిరారు. రూ.200 కోట్లు ఖర్చు అయినట్లు నిరూపించుకుంటే ముక్కు నేలకు రాయాలని మంత్రి డిమాండ్

- మిగతా 2లో

చేనేత కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- బడ్జెట్‌లో రూ.48 కోట్లు కేటాయింపు
- తెలంగాణ చేనేత వస్త్రాలకు ప్రత్యేక లేబుల్: మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - హైదరాబాద్: నేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులోభాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తెలంగాణ చేనేత అభయహస్తంలో నేతన్నకు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ. 48 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా జియో ట్యాగ్ చేయబడిన మగ్గాలపై పనిచేస్తున్న కార్మికులకు, అనుబంధ కార్మికులకు వేతన ప్రోత్సాహకం కింద గరిష్ఠంగా సంవత్సరానికి రూ. 18 వేలు, అనుబంధ కార్మికులకు రూ.ఆరువేలు అందించడం జరుగుతుందన్నారు. దీంతో 40 వేల మంది లబ్ధి పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. చేనేత వస్త్రాలకు యూనిక్ లోగో జతచేయడం జరుగుతుందన్నారు. తద్వారా చేనేత ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను, నేత కార్మికుని వివరాలను వినియోగదారులు తెలుసుకోవచ్చని తెలిపారు. దీంతో తెలంగాణ చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరిగే అవకాశాలు ఏర్పడతాయని మంత్రి వివరించారు. 18 సంవత్సరాలు నిండి జియో ట్యాగ్ చేయబడిన మరమగ్గాలపై పనిచేసే కార్మికులు, ప్రీలూమ్, ప్రిపరేటరి పనులైన డైయింగ్, టైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైండింగ్, సైజింగ్ తదితర అనుబంధ పనులు చేసే కార్మికులు, చేనేత వృత్తి ద్వారా వారి వార్షిక ఆదాయంలో కనీసం 50 శాతం పొందుతున్నవారు అర్హులు ఉన్నారన్నారు. జియో ట్యాగ్ చేయబడిన మగ్గాల ద్వారా వార్పులలో కనీసం 50 శాతం కంటే ఎక్కువ పూర్తి చేసిన నేత అనుబంధ కార్మికులకు నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి వేతన ప్రోత్సాహకం కింద సంవత్సరానికి రెండు విడతలుగా రూ. తొమ్మిది వేలు, అనుబంధ కార్మికునికి రూ. మూడువేలు జమ చేయడం జరుగుతుందని అన్నారు.

కర్నాటకలో 'థగ్ లైఫ్'కు బ్రేక్

చెన్నై/బెంగళూరు: తన 'థగ్ లైఫ్' చిత్రాన్ని కర్నాటకలో ప్రస్తుతానికి విడుదల చేయకూడదని కమల్‌హాసన్ నిర్ణయించారు. ఈ విషయాన్ని కమల్ తరఫు న్యాయవాది కర్నాటక హైకోర్టుకు తెలిపారు. 'థగ్ లైఫ్' సినిమా ఈవెంట్‌లో కన్నడ భాషపై కమల్ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగిన సంగతి తెలిసిందే. దీంతో, ఆ సినిమాను కర్నాటకలో నిషేధించాలని కోరుతూ ఆ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌ను మంగళవారం విచారించిన న్యాయస్థానం కమల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని వ్యాఖ్యానించింది. అనంతరం తన వ్యాఖ్యలను అపార్థం చేసుకున్నారంటూ 'కేఎఫ్‌సీసీ'కి కమల్

- మిగతా 2లో

విద్యార్థులకు న్యాయ సహాయం

- అమెరికా చట్టాలు... సమాజ మార్పులు అర్థం చేసుకోవాలి
- లక్ష్యసాధనలో అవరోధాలు ఎదురొడ్డి నిలబడాలి
- టెక్సాస్ వర్సిటీ విద్యార్థులతో కేటీఆర్ ముఖాముఖి

విశాలాంధ్ర - హైదరాబాద్: అమెరికాలో ఇబ్బందులు పడే భారతీయ విద్యార్థులకు అండగా నిలబడతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నో ఆశలతో ఉన్నత విద్య కోసం వచ్చిన విద్యార్థులు, అవగాహన లేక ఏమైనా తప్పు చేస్తే వారికి అవసరమైన న్యాయసహాయం అందించేందుకు బీఆర్‌ఎస్ అమెరికా విభాగం ద్వారా ప్రయత్నం చేస్తామన్నారు. విద్యార్థులు కూడా అమెరికా చట్టాలను అక్కడి సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకొని మసలుకోవాలని కేటీఆర్ సూచించారు. పరిస్థితులు లను ప్రతీ విద్యార్థి అవగాహన చేసుకోవాలన్నారు. డల్లాస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో మంగళవారం కేటీఆర్ మాట్లాడారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అమెరికా పోవాలన్నా, చదువుకు వాలన్నా ఎన్నో పోరాటాలు, ప్రయాసలకు గురయ్యే వాళ్లమన్న కేటీఆర్, ప్రపంచం వేగంగా మారి ఇప్పుడు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అమెరికా విద్య కూడా అనేక మందికి అందుబాటులోకి వచ్చిందన్నారు. కేవలం ర్యాంకుల కోసమో, గ్రేడ్ల కోసమో కాకుండా జీవితంలో సాధించాల్సిన ప్రధాన లక్ష్యాల పైన దృష్టి పెట్టాలన్నారు. స్వల్ప కాలంలోనే తమ కలలు, ఆకాంక్షలను అందిపుచ్చుకోవాలన్నారు. లక్ష్యం వైపు సాగే క్రమంలో అవరోధాలు ఎదురైనా నిబద్ధతతో ముందుకు పోవాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గొప్ప అవిష్కరణలు వస్తున్నాయని, ఇన్నోవేషన్ రంగంలో ప్రపంచ దేశాలతో ఇండియా పోటీపడి రాణించాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయ విద్యార్థులు నూతన ఆవిష్కరణల పైన దృష్టి సారించాలన్నారు. కష్టాలను ఇష్టాలుగా మలచుకున్నప్పుడే కలలు సాకారం అవుతాయని అంటూ కేసీఆర్ జీవితమే సాక్ష్యమన్నారు. నాలుగు పదుల వయసులో పదవులను త్యాగం చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం మొదలు పెట్టిన రోజు అనేకమంది ఆయనను అవహేళన చేశారని చెప్పారు. 14 సంవత్సరాల

- మిగతా 2లో

24 గంటల్లో ఐదుగురి మృతి

4 వేలు దాటిన కోవిడ్ కేసులు: కేరళలోనే అత్యధికం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్రలో కోవిడ్ కేసులు పెరిగిపోతున్నాయి. అత్యధిక ప్రభావిత రాష్ట్రంగా కేరళ ఉంది. అత్యధికంగా 1,416 కేసులు ఆ రాష్ట్రంలో నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా 4,026 కోవిడ్ కేసులు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంగళవారం వెల్లడించింది. గత 24 గంటల్లో ఐదు మరణాలు సంభవించినట్లు పేర్కొంది. జనవరి నుంచి మొత్తం 37 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. మే 22న 257 మంది రోగులు ఉంటే మే 31 తేదీకి ఆ సంఖ్య 3,395కు పెరిగింది. ప్రస్తుతం 4,026 మంది రోగులున్నారు. దేశంలోనే అత్యధికంగా 1,416 కేసులు కేరళలో నమోదు కాగా మహారాష్ట్రలో 493, గుజరాత్‌లో 397, ఢిల్లీలో 393 కేసులు ఉన్నాయి. గత 24 గంటల్లో కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఒకరు చొప్పున కోవిడ్‌తో మరణిస్తే, మహారాష్ట్రలో ఇద్దరు చనిపోయినట్లు డేటా చెబుతోంది. దేశంలో కోవిడ్ వ్యాప్తిని నిశితంగా గమనిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇన్ఫెక్షన్ తీవ్రత తక్కువగానే ఉందని, ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బెహెల్ స్పందిస్తూ ఒమిక్రాన్ సబ్ వేరియంట్లతోనే ప్రస్తుతం కేసులు పెరుగుతున్నట్లు పశ్చిమం, దక్షిణాది నుంచి సేకరించిన నమూనాల జినోమ్ సీక్వెన్సింగ్

- మిగతా 2లో

పాక్‌కు 800 మిలియన్ డాలర్ల ఏడీబీ ప్యాకేజి

ఇస్లామాబాద్: పాకిస్థాన్ కోసం 800 మిలియన్ డాలర్లను ది ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) మంజూరు చేసింది. దక్షిణాసియా దేశ ఆర్థిక పరిస్థితులను చక్కబెట్టేందుకుగాను చేయూత అందింది. 800 మిలియన్ డాలర్ల ప్యాకేజిని ఆమోదించింది. ఈ మేరకు ఏడీబీ మంగళవారం ఒక ప్రకటన చేసింది. ఇదిలావుంటే, పాకిస్థాన్ గతేడాది ఐఎంఎఫ్ నుంచి ఏడు బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్ ప్యాకేజి పొందింది. మేలో వాతావరణ నిధిగా మరో 1.4 బిలియన్ డాలర్లను కూడా పొందడం విదితమే.

నేడు ఏపీ కేబినెట్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ మంత్రి మండలి బుధవారం సమావేశం కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు వెలగపూడిలోని సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో రాజధాని అమరావతి నిర్మాణంపై చర్చించనున్నారు. అలాగే జీఏడీ టవర్ టెండర్లకు కేబినెట్ అమోదం తెలపనుంది. హెచ్‌వోడీ నాలుగు టవర్ల టెండర్లనూ అమోదించనుందని తెలుస్తుంది. మరోవైపు రాజధాని ప్రాంతంలో రెండో దశలో 44 వేల ఎకరాల భూమి సేకరించే అంశాన్ని సైతం ఈ సమావేశంలో చర్చించి.. ఆమోదించే అవకాశమున్నట్లు సమాచారం. అమరావతిలో 5 వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి కేబినెట్ అమోదం తెలపనుంది. 2,500 ఎకరాల్లో అంతర్జాతీయ స్పోర్ట్స్ కాంపెక్స్, మరో 2,500 ఎకరాల్లో స్మార్ట్ ఇండస్ట్రీ హబ్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలుస్తోంది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి అమోదం తెలపనుంది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలపైనా చర్చించే అవకాశముంది. ఈ పథకాలను ఈ నెలలోనే అమలు చేస్తామని సీఎం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఏడాది పాలనపై ప్రత్యేక చర్చ జరగనుంది. 21వ తేదీన వైజాగ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా డేపై చర్చించనున్నారు. గురువారం జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటి మొక్కలు నాటే కార్యక్రమంపైనా చర్చిస్తారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశాల మేరకు వివిధ శాఖలు తమ ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించారు.

కర్నాటకలో 'థగ్ లైఫ్'కు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

లేఖ రాశారు. అయితే, అందులోనూ ఆయన క్షమాపణ చెప్పలేదు. పిటిషన్ మరోసారి విచారణకురాగా.. ఆ లెటర్‌ను కమల్ తరపు న్యాయవాది హైకోర్టుకు సమర్పించారు. కమల్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఓకేగానీ అందులో ఒక్క వాక్యం మిస్ అయిందని జస్టిస్ నాగప్రసన్న అన్నారు. కమల్ వ్యాఖ్యల్లో ఎలాంటి దురుద్దేశం లేదని, ఒక వ్యక్తిని ఉద్దేశిస్తూ మాట్లాడారని, కన్నడ భాష గురించి కాదని కమల్ న్యాయవాది వాదించారు. అలాంటప్పుడు క్షమాపణతో దీన్ని ముగించొచ్చు కదా అని న్యాయస్థానం ప్రశ్నించింది. 'కమల్ తాను చెప్పాలనుకుంది చెప్పారు. పరిస్థితి ఇప్పటికీ అలాగే ఉంటే కర్నాటకలో తన సినిమాను విడుదల చేయరు' అని కమల్ న్యాయవాది కోర్టుకు తెలిపారు. 'కేఎఫ్‌సీసీ'తో సంప్రదింపులు జరిపేందుకుగాను వారం సమయం ఇవ్వాలని నిర్మాత తరపు న్యాయవాది కోరడంతో తదుపరి విచారణను న్యాయస్థానం ఈ నెల 10కి వాయిదా వేసింది. కమల్ హాసన్, శింబు, త్రిష ప్రధాన పాత్రల్లో దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదలకు సిద్ధమైన సంగతి తెలిసిందే.

24 గంటల్లో ఐదుగురి మృతి

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా నిర్ధారణకు వచ్చినట్లు చెప్పారు. కేసులు పెరుగుతున్నా...వైరస్ తీవ్రత ఎక్కువగా లేదని తెలిపారు. ఒమిక్రాన్ సబ్ వేరియంట్లు ఎల్ఎఫ్.7, ఎక్స్ఎఫ్‌జీ, జేఎన్.1, ఎన్‌బీ.1.8.1ను గుర్తించినట్లు డాక్టర్ రాజీవ్ అన్నారు. ఎన్‌బీ.1.8.1 వ్యాప్తి తక్కువగా ఉందని, మిగతా మూడు వేరియంట్లు ఎక్కువగా వ్యాపిస్తున్నాయని చెప్పారు. అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని, భయపడాల్సిన అవసరం లేదని డాక్టర్ రాజీవ్ వెల్లడించారు.

భారత్‌కు అందని జీ7 ఆహ్వానం

(మొదటిపేజీ తరువాయి)

గుప్పించింది. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్, ఇటలీ, కెనడాతోపాటు జర్మనీ అధినేతలు జీ7 సదస్సులో పాల్గొననున్నా రని, వీరితోపాటు బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా దేశాధినేతలకు ఆహ్వానం అందిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడించారు. 2014కు ముందు ఇది జీ8గా ఉండేదని, నాటి ప్రధాని మన్మోహన్‌కు అప్పట్లో ఆహ్వానం వచ్చేదన్నారు. 2014 తర్వాత ఈ సంప్ర దాయం కొనసాగినప్పటికీ... ఆరేళ్లలో తొలిసారి మన ప్రధానికి ఆహ్వానం అందలేదన్నారు. ఎలా చూసినా దౌత్యపరంగా ఇదో భంగపాటేనన్నారు. జీ7 దేశాల్లో భారత్ లేకున్నప్పటికీ నిర్వహణ దేశాల ఆహ్వానం మేరకు మన ప్రధాని ఆ శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొంటున్నారు. గతేడాది ఇటలీ వేదికగా జరిగిన సదస్సుకు భారత్‌తోపాటు ఆఫ్రికా, దక్షిణమెరికా, పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు పాల్గొన్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా పాల్గొని తన గళాన్ని వినిపించారు.

అదానీపై అమెరికా న్యాయశాఖ దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

నమోదైన ఆరోపణలపై అమెరికా న్యాయ శాఖ సమీక్ష చేపట్టినట్లు తెలిపింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేలో కొన్ని ఆదేశాలు జారీ చేశారు. ఇరానీ ఇంధనాన్ని లేదా పెట్రోకెమికల్ ఉత్పత్తులను ఖరీదు చేయడాన్ని ఆపేయాలన్నారు. ఒకవేళ ఎవరైనా ఆ దేశం నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేస్తే వాళ్లపై ఆంక్షలు ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు. అయితే ఆ ఆరోపణలను అదానీ గ్రూప్ కొట్టిపారేసింది. ఇరానీ ఎల్పీజీతో తమ సంస్థలకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. తమ పోర్టుల వద్దకు ఇరాన్ కానీ, ఇరాన్ సంబంధిత నౌక ద్వారా తమకు కార్గోలు రాలేదని అదానీ గ్రూపు చెప్పింది. కావాలని ఆంక్షల ఉల్లంఘన జరగలేదని... అమెరికా అధికారులు ఈ కేసులో ఎటువంటి విచారణ చేపట్టడం లేదని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

టర్కీలో భారీ భూకంపం

గ్రీస్, ఈజిప్టు, సిరియాలోనూ ప్రకంపనలు

ఇస్తాంబుల్: టర్కీలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.2గా నమోదైంది. పశ్చిమ టర్కీ ప్రభావితమైంది. ఒకరు చనిపోగా, 70 మంది గాయపడ్డారు. అర్థరాత్రి 2 గంటల సమయంలో భూ కంపం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ భూకంపం కారణంగా గ్రీస్, ఈజిప్టు, సిరియాతో పాటు మరికొన్ని దేశాలల్లోనూ ప్రకంపనలు సంభవించాయి. భూకంపం తీవ్రత 6.2గా నమోదైనట్లు యూరోపియన్ మెడిటరేనియన్ సిస్మోలాజికల్ సెంటర్ తెలిపింది. భూమికి 68 కిమీల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. అయితే సునామీ హెచ్చరికలు జారీ కాలేదు. నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడి లేచి... బయటకు పరుగులు తీశారు. భవనాలు పేకమేడల్లా ఊగడంతో భయాందోళనకు గురయ్యారు. కొన్ని చోట కిటికీల అద్దాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. భూకంపం నేపథ్యంలో రిసార్టు పట్టణం ఫతీహాలో 14 ఏళ్ల బాలుడు చనిపోయినట్లు టర్కీ అంతర్గత వ్యవహారాల మంత్రి అలీ యార్లికాయా వెల్లడించారు. నష్టాన్ని అంచనా వేసేందుకు బృందాలను పంపినట్లు మర్మారిస్ మేయర్ తెలిపారు.

పాక్‌లోనూ అలజడి... తప్పించుకున్న 216 మంది ఖైదీలు

పాకిస్థాన్, కరాచీలో భూ ప్రకంపనలు సంభవించాయి. మూడు సార్లు భూమి కంపించింది. దీంతో ఐచా జైలులోని గోడ కూలిపోయింది. మరికొన్ని గోడలు బీటలు వారాయి. ఈ పరిస్థితుల్లో దాదాపు వెయ్యి మంది ఖైదీలను వేరే చోటకు అధికారులు తరలించే క్రమంలో 216 మంది తప్పించుకున్నారు. ఇంకొందరు అధికారుల ఆయుధాలు లాక్కుని వారిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒక ఖైదీ మరణించగా, నలుగురు అధికారులు గాయపడ్డారు. పారిపోయిన ఖైదీలను పట్టుకునేందుకు అధికారులు గాలింపులు చేపట్టారు. అన్ని మార్గాలు మూసివేశారు. స్థానికుల సహకారాన్ని తీసుకున్నారు. దీంతో తప్పించుకున్న వారిలో 80 మంది తిరిగి పట్టుబడ్డారు.

మూడేళ్లలో 10 లక్షల మంది రష్యా సైనికుల మృతి

మాస్కో/కీవ్: రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చలు కొలిక్కి రాలేదు. ఏకాభిప్రాయం కుదరకుండానే టర్కీలోని ఇస్తాంబుల్‌లో నిర్వహించిన చర్చలు అసంబద్ధంగా ముగిశాయి. కాల్పుల విరమణపై జరిగిన చర్చలు ఫలించినట్లు ఏ దేశం ప్రకటించలేదు. మరోవైపు రష్యా, ఉక్రెయిన్ పరస్పరం పోరు కొనసాగిస్తుండటంతో 24 గంటల్లో 1,430 మంది ఉక్రెయిన్ సైనికులను మట్టుబెట్టినట్టు రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో డ్రోన్లు, క్షిపణులు, ఫిరంగులను ధ్వంసం

చేసినట్లు తెలిపింది. మూడేళ్లుగా కొనసాగుతున్న యుద్ధంలో 10లక్షల మందికిపైగా రష్యా సైనికులు మరణించినట్లు ఉక్రెయిన్ వెల్లడించింది. 'ఇప్పటివరకు మొత్తం 9,90,800 మంది రష్యా సైనికులు మరణించారు. అందులో 1,100 మంది సైనికులు గత 24 గంటల్లో ప్రాణాలు కోల్పోయారు' అని ఉక్రెయిన్ సాయుధ దళాల జనరల్ స్టాఫ్ ఆఫీస్ పేర్కొంది. 10,881 ట్యాంకులు, 22,671 సాయుధ పోరాట వాహనాలు, 50,607 ఇంధన ట్యాంకులు, 28,623 ఫిరంగి వ్యవస్థలు, 1,402 బహుళ ప్రయోగ రాకెట్ వ్యవస్థలు, 1,176 వైమానిక రక్షణ వ్యవస్థలు, 384 విమానాలు, 41 యుద్ధ విమానాలు, 336 హెలికాప్టర్లు, 38,748 డ్రోన్లు, 28 నౌకలు, ఒక జలాంతర్గామిని రష్యా కోల్పోయిందని వెల్లడించింది.

సెర్బియాలో రోడ్డెక్కిన విద్యార్థులు

బెల్‌గ్రేడ్ సహా 30కి పైగా నగరాల్లో నిరసనలు

బెల్‌గ్రేడ్: సెర్బియాలో విద్యార్థులు రోడ్డెక్కారు. అవినీతికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలు ఏడు నెలల మార్కునకు చేరుకోవడంతో రాజధాని బెల్‌గ్రేడ్ సహా 30కిపైగా నగరాల్లో భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సావా నదిపై ఉన్న రెండు వంతెలను దిగ్బంధించారు. రహదారులపై రాకపోకలు నిలిపివేశారు. సెర్బియా మేల్కొన్నదని, మౌనంగా ఉండేది లేదని పెద్ద పెట్టున నినాదాలు ఇచ్చారు. న్యాయం, చట్టబద్ధ పరిపాలన కోసం పోరాటానికి సంకల్పించారు. సెర్బియా రైల్వే స్టేషన్‌లో గతేడాది నవంబరులో స్లాబు కూలి 16 మంది మరణించిన అనంతరం ప్రభుత్వంలో అవినీతిపై విద్యార్థులు గర్జించారు. ఏడు నెలలుగా నిరసనలతో సెర్బియాను హోరెత్తిస్తున్నారు. ముందస్తు ఎన్నికల కోసం డిమాండ్ చేస్తున్నారు.

డీఎస్సీ పరీక్షలు ఆపలేం

- టెట్, వయోపరిమితిపై హైకోర్టులో పిటిషన్ల కొట్టివేత
- యథాతథంగా నిర్వహించుకోవచ్చన్న ధర్మాసనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

డీఎస్సీ పరీక్షలను నిలిపివేయలేమని, యథాతథంగా నిర్వహించుకోవచ్చని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. డీఎస్సీ 2025 నోటిఫికేషన్‌పై హైకోర్టులో దాఖలైన పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభంకానున్న డీఎస్సీ రాత పరీక్షలను నిలిపి వేయాలని స్టే కోరుతూ హౌజ్ మోషన్లలో దాఖలైన పిటిషన్లను హైకోర్టు ధర్మాసనం మంగళవారం విచారించింది. ఇందులో టెట్ రెండు సార్లు నిర్వహించకుండా డీఎస్సీ విడుదల, వయోపరిమితి పెంపు, బీఈడీ చివరి సంవత్సరం చదువుతున్న వారికి అవకాశం ఇవ్వకపోవడం, సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం చదివిన వారికి లాంగ్వేజీ సమస్యలపై అనుబంధ పిటిషన్లు దాఖలయ్యాయి. డీఎస్సీ పరీక్ష నిలిపివేతకు సహేతుకమైన కారణాలు సమర్పించనందున స్టే విధించలేమని కోర్టు తేల్చి చెప్పింది. పైగా డీఎస్సీ పరీక్షలను నిర్వహించే ప్రక్రియ తుది దశకు చేరుకుందని, ఈ నేపథ్యంలో స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశామని, పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రభుత్వం తరపు న్యాయవాది చెప్పడంతో... ఈ దశలో విస్తృత ప్రయోజనాల దృష్ట్యా పరీక్షలను నిలిపివేయడం సరికాదని వివరించింది. ఉద్యోగాల భర్తీ విషయంలో

విధానపరమైన నిర్ణయం తీసుకునే హక్కు పూర్తిగా ప్రభుత్వానికే ఉంటుందని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, బీఈడీ చివరి సంవత్సరం చదువుతున్న వారిని డీఎస్సీ నుంచి మినహాయించడంపైన, డీఎస్సీ పరీక్షల నిర్వహణకు 90 రోజుల గడువు ఇవ్వకపోవడం తదితర అంశాలపై పిటిషన్లు దాఖలయ్యాయి. 2011లో ప్రభుత్వం జారీచేసిన జీవో 51 ప్రకారం ఏడాదికి రెండు విడతలుగా టెట్ పరీక్ష నిర్వహించాల్సి ఉందని, నిబంధనలకు భిన్నంగా ఒక్కసారే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం టెట్ పరీక్ష నిర్వహించినట్లు పిటిషనర్లు పేర్కొన్నారు. రెండోసారి టెట్ పరీక్ష నిర్వహించకుండానే డీఎస్సీ 2025 నోటిఫికేషన్ జారీచేయడం చట్ట విరుద్ధమంటూ చిత్తూరు జిల్లాకు చెందిన పి.ప్రభాకర్‌తోపాటు మరికొందరు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. 2024 ఫిబ్రవరి 12న జారీచేసిన ఏపీ డీఎస్సీకి తాము వయసు పరంగా అర్హత సాధించామని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చేయడంతో అధిక వయసు కారణంగా ఈ ఏడాది ఏప్రిల్ 20న జారీచేసిన నోటిఫికేషన్‌కు అనర్హులమైనట్లు మరికొందరు పిటిషన్లు దాఖలు చేశారు. డీఎస్సీ 2024కు అర్హులైన వారంతా ప్రస్తుత డీఎస్సీకి అర్హులుగా ప్రకటించాలని వారు కోరారు. సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం టెన్త్‌లో ఫస్ట్ లాంగ్వేజ్ ఇంగ్లీషు, సెకండ్ లాంగ్వేజ్ తెలుగు చదివిన వారికి డీఎస్సీ 2025లో అవకాశం ఇవ్వకపో వడాన్ని సవాల్ చేస్తూ ఎమ్మిగనూరుకు చెందిన వెలికంటి సాంబశివ పిటిషన్ వేశారు. వాటికి పాఠశాల విద్యాశాఖ తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు విన్పించారు. వయో పరిమితిని పెంచాలని కోరుతున్న వారికి 2024 డీఎస్సీ నాటికే అర్హత లేదన్నారు. నిర్దిష్ట పోస్టులకు తప్ప మిగిలిన పోస్టులకు సీబీఎస్ఈలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా ఇంగ్లీషు చదివినవారు అర్హులేనన్నారు. ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశామని, పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు కూడా పూర్తి చేశామని, ఈ దశలో పరీక్షలను వాయిదా వేయడం సరికాదని, ఆ పిటిషన్లను కొట్టేయాలని కోర్టును కోరారు. ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి అనుబంధ పిటిషన్లను కొట్టేశారు. హైకోర్టు తీర్పును ఉపాధ్యాయ నిరుద్యోగులు స్వాగతిస్తున్నారు.

జస్టిస్ వర్మను విచారించాలి

సీజేఐకు బాంబే లాయర్స్ అసోసియేషన్ లేఖ

ముంబై: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు జడ్జి యశ్వంత్ వర్మపై విచారణ కోరుతూ సీజేఐ బీఆర్ గవాయ్‌కు బాంబే లాయర్స్ అసోసియేషన్ ఒక లేఖ రాసింది. దిల్లీ నివాసం నుంచి భారీగా నగదు లభించిన వివాదం నడుస్తుండగానే జస్టిస్ వర్మ అలహాబాద్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. మాజీ సీజేఐ సంజీవ్ ఖన్నా కూడా ఈ వ్యవహారంలో రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీకి లేఖ రాశారు. సర్వోన్నత న్యాయస్థానం నియమిత కమిటీ నివేదికను వారితో పంచుకున్నారు. కాగా, అవినీతి నిరోధక చట్టం-1988, బీఎన్ఎస్-2023లోని సంబంధిత నిబంధనల కింద జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు సహా క్రిమినల్ చర్యలు తీసుకునే వీలుగా ఆదేశాలు ఇవ్వాలని లాయర్ల సంఘం కోరింది. 1991 నాటి కె.వీరస్వామి కేసులో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును లేఖలో ప్రస్తావించింది. సగం కాలిన కరెన్సీ నోట్లు, ఫొటోలు, వీడియో రికార్డింగ్‌లు సహా ఆధారాలన్నీ భద్రపరిచేలా దిల్లీ పోలీస్ లేక సీబీఐ సహా సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని కోరింది.

'మిస్ వరల్డ్'కు రూ.30 కోట్లే ఖర్చు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. బీఆర్ఎస్ పాలనలో టూరిజం ప్రచారానికే రూ.115 కోట్లకు పైగా ఖర్చు చేశారని గుర్తు చేశారు. సొంత పత్రికలు, మీడియా, సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేశారని, అందగత్తెల కాళ్లు కడిగారని విష ప్రచారం చేశారని మండిపడ్డారు. ఐఏఎస్ అధికారులతో కాళ్లు మొక్కించుకున్న ఘనత కేసీఆర్ దేనని అన్నారు. పోటీదారులకు 30 తులాల బంగారం ఇచ్చారనేది పచ్చి అబద్ధం అని, చౌమహల్లా ప్యాలెస్ విందులో ఒక్కో ప్లేట్ భోజనానికి లక్ష రూపాయాలు ఖర్చు చేశారనేది అవాస్తమని , ఒక్కో ప్లేట్ కు అయిన ఖర్చు రూ.8,200 మాత్రమేనని స్పష్టం చేశారు. తనపట్ల అసభ్యంగా ప్రవర్తించారని మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలను మంత్రి జూపల్లి ఖండించారు. ఆమె ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అలా జరిగి ఉంటే మిగతా 108 మంది పోటీదారులు చివరి వరకు ఉండేవారు కాదన్నారు. వాళ్లను ఇబ్బంది పెడితే... మళ్లీ మళ్లీ తెలంగాణకు రావాలని ఉందని ఎందుకు చెబుతారని ప్రశ్నించారు. మిస్ వరల్డ్ విన్నర్ థాయిలాండ్ సుందరి ఓపల్ సుచాత... తెలంగాణ ఆతిథ్యం, ఇక్కడి పర్యాటక ప్రాంతాలు నచ్చాయని, అవకాశం వస్తే మళ్లీ ఇక్కడికి వస్తానని ఆమె చెప్పారన్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ మిస్ వరల్డ్ పోటీలను విజయవంతంగా నిర్వహించడాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ హన్మంతు జండగే, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కె.లక్ష్మి పాల్గొన్నారు.

విజయవాడ నుంచి ఓర్వకల్లుకు విమానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

విజయవాడ-కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి జులై 2వ తేదీ నుంచి విమాన సర్వీసులు నడుపుతామని, ఇందుకు కేంద్ర విమానయాన శాఖ అంగీకరించిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయంలో విజయవాడ-కర్నూలు విమాన సర్వీసుల పోస్టరును మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విజయవాడ నుంచి కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి విమాన సర్వీసులు నడిపేందుకు కేంద్ర విమాన యాన శాఖ అంగీకరించిందన్నారు. ఈ సర్వీసు విజయవాడలో మధ్యాహ్నం 3.45 గంటలకు బయలుదేరి ఓర్వకల్లుకు 4.50 గంటలకు చేరుకుంటుందని, సాయంత్రం 5.10 గంటలకు ఓర్వకల్లులో బయలుదేరి విజయవాడకు 6.15 గంటలకు వస్తుందని వివరించారు. విమాన టికెట్ ధర రూ.2,533 నుంచి మొదలవుతాయన్నారు. మొదటగా ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో ఇండిగో విమాన సర్వీసు నడుస్తుందని, రానున్న రోజుల్లో ప్రతిరోజూ విమాన సర్వీసు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. రాయలసీమను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని మంత్రి టీజీ భరత్ అన్నారు. రాయలసీమకు భారీగా పరిశ్రమలు రానున్నాయని, ఇప్పటికే వేలాది కోట్ల రూపాయల పెట్టు బడులు వచ్చాయన్నారు. లేపాక్షి నుంచి కొప్పర్తి, ఓర్వకల్లు వరకు ఇండస్ట్రియల్ కారిడార్ ఎంతో అభివృద్ధి చెందుతోందని, ఈ ప్రాంతంలో డిఫెన్స్, డ్రోన్, ఎలక్ట్రిక్, గ్రీన్ ఎనర్జీకి సంబంధించిన పరిశ్రమలు వస్తాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 2.0 పాలసీ విడుదల చేసిన వెంటనే ఈ పరిశ్రమకు సంబంధించిన పనులు ప్రారంభమవుతాయన్నారు. త్వరలోనే హైకోర్టు బెంచ్ కర్నూలులో ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. ఇండిగో విజయవాడ సేల్స్ మేనేజర్ మోహిత్ కృష్ణ, కర్నూలు సేల్స్ మేనేజర్ రవిబాబు, విమానాశ్రయ అసిస్టెంట్ మేనేజర్ సుభాని, సుజన్ పాల్గొన్నారు.

'భూ భారతి' దేశానికే తలమానికం

(మొదటిపేజీ తరువాయి)

ఐదు ప్రముఖ సంస్థల ద్వారా సర్వే చేస్తున్నామని వివరించారు. డ్రోన్, డీజీపీఎస్ వంటి ఆధునిక పద్ధతులను వినియోగించి పకడ్బందీగా నక్షా తయారు చేస్తామని అన్నారు. అసైన్డ్ భూముల్లో జరిగిన అక్రమాలను పరిశీలిస్తామన్నారు. నవీన్ మిట్టల్ మాట్లాడుతూ భూముల సర్వే నెంబర్లలో రెండు కోట్ల వరకు సబ్ డివిజన్లు ఉంటే, 40 లక్షల వరకు మాత్రమే మ్యాప్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విలేజ్ మ్యాప్ లేని 413 గ్రామాల్లో నూతనంగా సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ నెంబర్ భూమికి సంబంధించిన అన్ని వివరాలతో అందించడం జరుగు తుందని అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జేడీ ప్రసన్న లక్ష్మీ, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకుబ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఎర్రుపాలెం తహసీల్దార్ ఉషా శారద పాల్గొన్నారు.

వాస్తవాలు చర్చిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ఎంపీ దీపీందర్ సింగ్ హుడా మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని అంతం చేసే వ్యూహాలపై చర్చించడమే కాకుండా సాయుధ దళాలకు ధన్యవాదాలు తెలిపేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించడం అవసరమని అన్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ క్రమంలో సర్కారుకు ప్రతిపక్షాలు అండగా నిలిచాయని, భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా ప్రకటన చేసిన సమయంలోనే పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశ పర్చాలని డిమాండ్ చేసినట్లు హుడా తెలిపారు.

తమ అభిప్రాయాలు, వ్యూహాలను ప్రపంచానికి తెలియజేస్తున్న మోదీ ప్రభుత్వం... అదే పనిని పార్లమెంటులో ఎందుకు చేయలేదని టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ ప్రశ్నించారు. పూంచ్, యూరి, రాజౌరీ తదితర అంశాలను మోదీకి రాసిన లేఖలో ప్రస్తావించినట్లు తెలిపారు. పార్లమెంటులో ఈ అంశాలన్నింటిపై స్వేచ్ఛగా చర్చించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రధానికి లేఖ రాసిన పార్టీల్లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, శివసేన (యూబీటీ), ఆర్‌జేడీ, నేషనల్ కాన్ఫరెన్స్, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), ఐయూఎంఎల్, ఆర్ఎస్‌పీ, జేఎంఎం, వీసీకే, కేరళ కాంగ్రెస్, ఎండీఎంకే, సీపీఐ(ఎంఎల్) ఉన్నాయని చెప్పారు. ఆప్ వేరుగా ప్రధానికి లేఖ రాయనుందని డెరెక్ వెల్లడించారు. పార్లమెంటులో ప్రతిపక్ష గళానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, ప్రతిపక్షం అంటే ప్రజల గొంతకని సంజయ్ రౌత్ అన్నారు. ప్రధానికి ప్రతిపక్షం రాసినది సాధారణ లేఖ కాదన్నారు. తాజా పరిణామాలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని డిమాండ్ చేస్తున్నట్లు రౌత్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహా మేరకు కాల్పుల విరమణ జరిగిందా? ప్రతిపక్షం పదేపదే డిమాండ్ చేస్తున్నా పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఎందుకు నిర్వహించడంలేదు? ప్రత్యేక సమావేశం కోసం ట్రంప్ వద్దకు వెళ్లాలా అని ప్రభుత్వాన్ని రౌత్ ప్రశ్నించారు. శరద్ పవార్ పార్టీ గైర్హాజరీపై విలేకరులు ప్రశ్నించగా ఎన్‌సీపీ (ఎస్‌పీ) కూడా ఇండియాలో భాగమేనని చెప్పారు. సుప్రియా సూలే విదేశీ పర్యటనలో ఉన్నారని గుర్తుచేశారు. ముంబై చేరుకున్న తర్వాత శరద్ పవార్‌తో మాట్లాడతానని సంజయ్ రౌత్ వెల్లడించారు.

మాకు సమాచారం లేదు: రాజా

ఇండియా ఐక్య సంఘటన సమావేశం కాబోతోందని తమకు తెలియదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నుంచి ఎలాంటి సమాచారం అందలేదన్నారు. 'ఇండియా ఐక్య సంఘటన సమావేశం కాబోతోందని నాకు తెలియదు. ఖర్గే, రాహుల్ కూడా సమాచారం ఇవ్వలేదు. మీడియాలో మాత్రం సమావేశం జరుగుతుందని చెబుతున్నారు' అని రాజా అన్నారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశం డిమాండ్‌కు మద్దతు తెలిపారు. డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటనపై మోదీ మౌనాన్ని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్య అనేక ప్రశ్నలకు సర్కారు సమాధానం ఇవ్వాల్సి ఉందని, ఆ అంశాలపై చర్చించడం కోసమే పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని సీపీఐ డిమాండ్ చేస్తున్నదని రాజా చెప్పారు. ట్రంప్ ప్రకటనలపై మోదీ ఇప్పటి వరకు స్పందించలేదని, పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి మోదీ, ఆయన ప్రభుత్వం అంగీకరిస్తుందో లేదో చెప్పలేమని రాజా వ్యాఖ్యానించారు.

కేంద్ర మంత్రిమండలి సమావేశం నేడు

(మొదటిపేజీ తరువాయి)

కేబినెట్ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో కేబినెట్, స్వతంత్ర, సహాయ మంత్రులు సహా వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికా రులు పాల్గొననున్నారు. గత సంవత్సర కాలంలో తమ శాఖల ప్రగతి నివేదికలను కేంద్రమంత్రులు తెలియజేయనున్నారు. పరిపాలన, కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రజలకు మరింత చేరువవ్వడంపైనా మంత్రి మండలికి ప్రధాని మోదీ దిశానిర్దేశం చేసే అవకా శాలు ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత జరుగుతున్న తొలి కేంద్ర మంత్రిమండలి సమావేశం ఇది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్, కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం పదకొండేళ్ల పాలనను పూర్తి చేసుకున్న తరుణంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. కొత్తగా కేబినెట్ ఏర్పాటు చేసిన తర్వాత మొదట్లో ఒకసారి మాత్రమే నిర్వహించారు. అందరికీ పరిచయ కార్యక్రమంలా ఆ సమావేశం జరిగింది.

తుని కేసుపై ప్రభుత్వం వెనక్కి...

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయం తీసుకుందన్న ప్రచారం సాగింది. దీనిని ఎన్‌డీఏతో పాటు వివిధ పార్టీల నేతలు, కాపు సంఘాల నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. తుని కేసు తిరగదోడే ఉద్దేశం లేదని, తుని కేసును హైకోర్టులో అప్పీల్ చేయాలనే ఉత్తర్వులు తక్షణమే రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ఏ స్థాయిలో ఆమోదంతో దస్త్రం నడిచిందనే విషయంపైనా ప్రభుత్వం ఆరా తీసింది. ఈ కేసుపై ఆర్‌పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ చేసిన ప్రతిపాదనల ఆధారంగా ఉత్తర్వులు వెల్లడైనట్లు తెలిసింది. ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని ప్రభుత్వం నుంచి అధికారులకు హెచ్చరికలు జారీ అయ్యాయి. ఆ తర్వాత తుని కేసు కొట్టివేస్తూ రైల్వే కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లే ఆలోచన లేదని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తుని కేసును హైకోర్టులో అప్పీల్ చేయాలనే ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. సున్నితమైన అంశాలపై అలసత్వంతో జరిగే ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని హెచ్చరించింది.

విద్యార్థులకు న్యాయ సహాయం

(మొదటిపేజీ తరువాయి)

నిరంతర పోరాటం తర్వాత ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నప్పుడు సమాజంలోని ప్రతి ఒక్కరు ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారన్నారు. ఇండియాకి తిరిగి వచ్చి కంపెనీలు ప్రారంభించాలని విద్యార్థులను కోరారు. మేథోవలస మన దేశానికి పెను సవాలుగా మారిందని చెప్పారు. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో విదేశీ యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర -తొర్రూర్: తొర్రూర్ మున్సిపల్ పట్టణానికి అధిక నిధులను కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నూతన వాహనాలను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ తొర్రూరు పట్టణం శుభ్రంగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు మున్సిపల్ వాహనాల కొనుగోలు ఎంతో అవసరం అని ప్రభుత్వ సహకారంతో మున్సిపల్ కార్యాలయానికి అందిన ఈ వాహనాలు, జెసిబి, వాటర్ ట్యాంకర్లు, పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలను అందించేందుకు తోడ్పడతాయని అన్నారు.15వ ఆర్థిక సంఘం నిధుల నుండి రూ.89 లక్షల వ్యయంతో కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలోని పారిశుద్ధ్య పరిరక్షణ, డ్రైనేజ్ నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి అంశాల్లో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మున్సిపల్ వ్యవస్థను శక్తివంతం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శాంతి కుమార్. మున్సిపల్ ఏఈ రంజిత్, మేనేజర్ కట్ట స్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ మాజీ ప్రజా ప్రతినిధులు,సిబ్బంది, పట్టణ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం దోహదం

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన భూభారతి రెవెన్యూ చట్టం - 2025, రెవెన్యూ గ్రామసభల ద్వార భూ సమస్యల పరిష్కారానికి ఎంతో దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ మండలం సింగారం, నెల్లికుదురు మండలం, వావిలాల రెవెన్యూ గ్రామాలలో జరుగుతున్న సదస్సులనుపరిశీలించినట్లు కలెక్టర్ తెలిపారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో (2) రెవెన్యూ డివిజన్లు, (18) మండలాలు, (288) రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం నుండి జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించి, భూ సమస్యలు ఉన్న రైతుల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు . రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా దంతాలపల్లి మండలంలో ఇప్పటికే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని, రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించి ఉదయం 9 నుండి 4 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ రోజు వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను పరిశీలించి ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మ చారి, కురవి మండలం తిరుమల పురం, మొగిలిచర్ల, రెవెన్యూ గ్రామాలలో జరుగుతున్న సదస్సులను పరిశీలించారు.

కాంగ్రెస్ పార్టీతో పేదల అభివృద్ధి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర -తొర్రూరు: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి మరియు పేదల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇందిరమ్మ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది నిజమైన ఇందిరమ్మ రాజ్యమని, ఇక్కడ ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతోందని అన్నారు. ఇంటి కోసం ఎదురు చూస్తున్న పేదలకు ఈ పట్టాలు వారి కలలను సాకారం చేస్తున్నాయని తెలిపారు. ప్రతి కుటుంబం సమాజంలో గౌరవంతో బతికే అవకాశం పొందుతుందని పేర్కొన్నారు.ఇది కేవలం పట్టా కాదు, పేదల భవిష్యత్తుకి బలమైన బునియాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తలదాచుకునే ఇంటి కోసం భూమిని, నిర్మాణానికి ఆర్థికసహాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, పట్టణ నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి

విశాలాంధ్ర-మరిపెడ: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహబూబాబాద్ జిల్లా శాఖ, మరిపెడ మండల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బడిబాట ప్రచార జాతాను మంగళవారం మరిపెడ పట్టణ కేంద్రంలోని పలు ప్రధాన కూడలిలలో నిర్వహించారు. ఈ సందర్భం జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ మాట్లాడుతూ బడి మనదే - బడి బాధ్యత మనదే అనే నినాదంతో , మన ఊరు పిల్లలను మన ఊరు ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిద్దాం, నాణ్యమైన విద్యను పొందుదాం, ఫీజుల భారాన్ని తగ్గించుకుందాం, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతో బోధిస్తూ, విద్యార్థులకు రెండు జతలు యూనిఫామ్ లు, మధ్యాహ్న భోజనం, వారానికి మూడు కోడిగుడ్లు పెడుతూ పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. జిల్లా కార్యదర్శి నందిగామ జనార్ధనాచారి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు విద్యా వ్యాపారం విచ్చలవిడిగా సాగుతున్నదని, సంపాదనలో సగం పైగా పిల్లల చదువుల కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటానికి టీఎస్ యుటిఎఫ్ పక్షాన భరోసా ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, మండల ప్రధాన కార్యదర్శి ప్రభాకర్,జిల్లా ఉపాధ్యక్షులు నామ వెంకటేశ్వర్లు,కోశాధికారి కె నాగమల్లయ్య,జిల్లా కార్యదర్శి హరి నాయక్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

నిగర్వి, సింగరేణి ఆణిముత్యం ప్రజాకవి జయరాజు : సిఎండి బలరామ్

విశాలాంధ్ర - కొత్తగూడెం : నిగర్వి, సింగరేణి ఆణిముత్యం, ప్రజాకవి, సినీ గేయ రచయిత, కాళోజీ అవార్డు గ్రహీత, తెలంగాణ ఉద్యమనేత జయరాజ్ కు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు సింగరేణికే గర్వకారణమని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరామ్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం లోని సింగరేణి ప్రధాన కార్యాలయము లో జయరాజు కు ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో ఘనంగా సన్మానించారు. ఇందులో సీఎండీ బలరామ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో ఉద్యోగిగా పని చేసిన జయరాజు నిరంతరం కార్మికుల కోసం, సామాన్య ప్రజల గాథలను, ప్రకృతిని ఆరాధించే ప్రేమకుడిగా సందేశాత్మక, విప్లవత్మక పాటలు రచించడమే గాక తన గళంతొ ప్రజలను చైతన్య పరచాలని కొనియాడారు. హైదరాబాదు పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఉద్యమకారులు, కళాకారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్మానించి, కోటి రూపాయలు అందించటం అందులో జయరాజు ఉండటం సింగరేణియులందరికీ గర్వ కారణమన్నారు. జయరాజ్ సింగరేణిలో ఫిట్టర్‌గా ఉద్యోగంలో చేరి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నెలరోజులు చేసిన సమ్మెతో పాల్గొన్నాడన్నారు. ఎవరు ప్రలోభ పెట్టినా జయరాజ్ తన పంథా వీడలేదని సిఎంబి గుర్తు చేశారు. ఈ సందర్భంగా జయ రాజ్ మాట్లాడుతూ సింగరేణిసంస్థ అందించిన సహకారం, ప్రోత్సాహం వల్లే తాను కవిగా, ఉద్యమ కారుడిగా ఉన్నత స్థాయికి చేరుకోగలిగానని స్పష్టం చేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ యస్.డి.ఎం.సుభాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమములో విశిష్ఠ అతిథులుగా సింగరేణి డైరక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కే.వెంకటేశ్వర్లు, ఏఐటీయూసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి.రమణ మూర్తి, ఐఎన్‌టియూసి వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, కార్పోరేట్ ప్రెసిడెంట్ సిహెచ్.వెంకటా చారి, జిఎం జి.వి.కిరణ్ కుమార్, ఈఈ, సూపర్ బజార్ ఎండి మురళీధర్, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : క్రమశిక్షణ, నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల ద్వారానే సాధ్యమని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ప్రభుత్వ విద్యాలయాలు బలోపేతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలలో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశాలను పొందేలా బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. మంగళవారం ఐడి ఓసి, కార్యాలయంలో లైన్ డిపార్ట్మెంట్స్ అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా అందజేసే పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిజిటల్ విద్యతోపాటు ఉపకార వేతనాలు, ఇతర ప్రోత్సాహకాల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరంగా చెప్పాలన్నారు. 6 నుండి 14 ఏళ్ళ వయసు కలిగిన బడి ఈడు పిల్లలందరిని గుర్తించి సమీపంలోని బడికి వెళ్లేలాగా ప్రోత్సహించాలన్నారు. మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులతో మహిళా సమాఖ్యల ద్వారా తల్లిదండ్రులతో మాట్లాడి అర్హత కలిగిన తరగతుల్లో చేర్పించేలన్నారు. బడిబాట కార్యక్రమంలో మహిళా సహాయక సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించే విధంగా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, మెప్మా పీడీ రాజేష్, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర చారి, బిసి సంక్షేమ అధికారి ఇందిర, మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, విద్యాశాఖ కోఆర్డినేటర్లు, ఎం ఈ వోలు, ఏపీఎం లు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా సీపీఐ జెండా : పల్లా

విశాలాంధ్ర- కొండమల్లేపల్లి : ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా ప్రజలకు అండగా సీపీఐ జెండా నిలబడి పోరాడుతుందని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండ మండలం గొట్టుముక్కలలో జరిగిన సీపీఐ మండల 14వ మహాసభలో ముఖ్య అతిథిగా హాజరైన పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా, ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సీపీఐ అని, శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన పార్టీ సిపిఐ అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారుల కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరిచే విధంగా మళ్ళీ సిలిండర్ ధర పెంచడం అన్యాయమని పండించిన పంటకు గిట్టుబాటు ధర, ఎరువులు విత్తనాలు సబ్సిడీ మీద ఇవ్వాలన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు. నల్లగొండ ఎమ్మెల్సీ సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ ప్రధాన సమస్య అయిన పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేసి నియోజకవర్గానికి సాగునీరు అందించాలని కోరారు. నకిలీ విత్తనాలు అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరార. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పార్టీ అభ్యర్థులను గెలిపించుటకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ మహాసభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్, మండల కార్యదర్శి దేపా సుదర్శన్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి , ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ పల్లా సులోచన, పల్లా రంగారెడ్డి, రామిరెడ్డి, యాదయ్య, వెంకట్ రాములు, అనిత జ్యోతిబసు నగేష్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేత

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : అశ్వారావుపేట నియోజక వర్గంలోని మండల కేంద్రం చంద్రుగొండ గ్రామ పంచాయతీలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు 128 మందికి పత్రాలు అందించారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ అంకిరెడ్డి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మల పల్లి సురేష్‌లతోపాటు పంచాయితీ కార్యదర్శి రాజేందర్‌లు లబ్ధిదారులకు పత్రాలు అందించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని కృష్ణారెడ్డి సురేష్ తెలిపారు. ప్రస్తుతం మొదటి విడతలో మంజూరైన ఇళ్లకు పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతివారికి రెండో విడతలోనూ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. తమకు ఇల్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణలకు ఇళ్ల పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ వీళ్ళ కమిటీ సభ్యులు బడుగు శంకర్, చాపల మడుగు మనోహర్, యూత్ అధ్యక్షులు చిన్నంశెట్టి మహేష్, నాయకులు నున్నా వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణీ, బుంగా శ్రీను, కడియాల పుల్లయ్య, మెకానిక్ చారి, సిహెచ్ ప్రసాద్, నాగుల్ మీరా, కొండ్రు రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు నివారిద్దాం

విశాలాంధ్ర - భద్రాచలం : రోడ్డు నియమాలను పాటిస్తూ ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రవాణా శాఖ అధికారి సంఘం వెంకట పుల్లయ్య అన్నారు. భద్రాచలం రవాణాశాఖ యూనిట్ కార్యాలయంలో మంగళవారం లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, మోటార్ సైకిల్ రిజిస్ట్రేషన్, ఆటో రిజిస్ట్రేషన్స్ లతోపాటు వాహనాల ఫిట్నెస్‌పై వచ్చిన వాహన దారులకు రోడ్ సేఫ్టీ, భద్రత ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించడం, వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరిం చడం, వాహనాలను ఓవర్టేక్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చున్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి నడపడం నిషేధమ న్నారు. సీటు బెల్ట్ డ్రైవింగ్, మూల మలుపుల వద్ద నిదానంగా వెళ్లడం హారన్ కొట్టడం పక్కాగా పాటించవలసిన అంశాలన్నారు. చాలా దూరం ప్రయాణించాల్సి వచ్చినపుడు ముందురోజు విశ్రాంతి తీసుకోవడం అవసరమన్నారు. శీతాకాలం, వర్షాకాలంలో రోడ్డుపై ప్రయాణించేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు ఆయన వివరించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటిస్తామని పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు.

నిర్మాణ పనులు తనిఖీ

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : భవిత కేంద్రాల నిర్మాణ పనుల తనిఖీలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న భవిత కేంద్రం నిర్మాణం పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భవిత కేంద్రాలలో తప్పనిసరిగా ర్యాంపు, రైలింగ్, టాయిలెట్లు, తగు నీరు వంటి కనీస మౌలిక వసతులు ఉండేలా చూడాలని, ఆక్టివిటీ రూమ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిత కేంద్రాలు పూర్తిగా సద్వినియోగం అయ్యేలా నిర్మాణాలు చేపట్టాలని అసిస్టెంట్ ఇంజనీర్ రాజేష్‌కు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, డిఇఓ పాల్గొన్నారు.

భూభారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టం వల్ల ప్రజల భూ సమస్యలు త్వరగా పరిష్కారం పొందుతున్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం లక్ష్మణచందా మండలం కనకాపూర్, నిర్మల్ గ్రామీణ మండలం అక్కపూర్‌లో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల భూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసమే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చారని తెలిపారు. ఇప్పటికే తొలి విడత సదస్సులు విజయవంతంగా ముగిశాయని, నేటి నుండి జూన్ 20 వరకు రెండో విడత రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వెల్లడించారు. సదస్సుల్లో పాల్గొన్న ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులు ప్రజల దరఖాస్తులను స్వీకరించి, వెంటనే రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. సకాలంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అక్కపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి, రైతుల భూసమస్యల దరఖాస్తులపై అధికారులకు పలు సూచనలు చేసారు. అనంతరం పాఠశాలలో తరగతిగదులు, ఇంకుడు గుంత, లైటింగ్ వంటి వసతులను కలెక్టర్ పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దార్లు సరిత, సంతోష్, ఎంపీడీవో గజానన్, గిర్దావర్ సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు.

39 మందికి జరిమానా

విశాలాంధ్ర : కొత్తగూడెం క్రైమ్ : అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో కొత్తగూడెం కోర్టు 39 మందికి జరిమానా విధించారు. ఈ మేరకు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు మంగళవారం తీర్పుచెప్పారు. కొత్తగూడెం వన్ టౌన్ ఎస్.ఐ లు జి. విజయ, తుంగ రాకేష్‌ల కథనం ప్రకారం వాహనాలు నడుపుతుండగా తొమ్మిది మందిని ఆపి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించారు. వారు మద్యం తాగినట్టు రుజువు కావడంతో కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ ముందు వారు నేరం ఒప్పుకొన్నారని ఎస్సై లు తెలిపారు. అదేవిధంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్.ఐ. కె. నరేష్ పర్యవేక్షణలో వాహన తనిఖీ చేస్తుండగా 30 మంది వ్యక్తులు మద్యం త్రాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. తనిఖీ సమయంలో వారికి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా మద్యం తాగినట్లుగా రుజువైంది. దింతో వారిని కోర్టులో ప్రవేశ పెట్టగా మెజిస్ట్రేట్ విచారించారు. నేరం ఒప్పుకోవడంతో వెంటనే జరిమానాలు విధించగా వారు చెల్లించినట్లు ఎస్ ఐ నరేష్ తెలిపారు.

సీపీఐ హవేలీ ఏరియా కార్యదర్శిగా గాంధీ

విశాలాంధ్ర- ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖానాపుర హవేలీ ఏరియా కార్యదర్శిగా ఏనుగు గాంధీ ఎన్నికయ్యారు. -సహాయ కార్యదర్శులుగా నానబాల రామకృష్ణ (ఆర్కే), జాకీర్ ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. ఏనుగు గాంధీ అఖిల భారత యువజన సమాఖ్య మధిర డివిజన్ నాయకులుగా, ఖమ్మం జిల్లా కార్యదర్శిగా -పనిచేశారు. గత దశాబ్ద కాలంగా జిల్లా కౌన్సిల్ సభ్యులుగా, హవేలీ ఏరియా కార్యదర్శిగా పని చేస్తున్నారు. సహాయ కార్యదర్శిగా -ఎన్నికైన నానబాల రామకృష్ణ ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పనిచేస్తుండగా జాకీర్ ఆటో వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి జిల్లా నాయకులుగా ఉన్నారు. 22 మందితో ఖానాపురం హవేలీ ఏరియా కౌన్సిల్, తొమ్మిది మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా గాంధీ మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి -విస్తృతంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పాలకుల తీరు ఎన్నికల ముందు ఒక విధంగా ఎన్నికల తర్వాత మరో విధంగా ఉందని తెలిపారు. ప్రజలు హామీలను నమ్మి మోసపోతున్నారన్నారు. హామీల అమలు కోసం సిపిఐ నేతృత్వంలో -పోరాడతామన్నారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ఉన్న ఖానాపురం హవేలీ ఏరియాలో పలు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజల మనిషి మన కలెక్టర్ : బోజ్యా నాయక్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : మన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ నిరంతరం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోరుకునే ఉన్నత మైన వ్యక్తిత్వం కలిగిన అధికారి అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాలోత్ భోజ్యా నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ చిరు బహుమానం అందించారు. జిల్లా కలెక్టర్ హోదాలో ఉండి కూడా ఇటీవలే ఆయన తన సతీమణిని పాల్వంచలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సామాన్య స్త్రీ లాగా ప్రసవం చేయించారని భోజ్యా నాయక్ అభినందించారు. ఈ పరిణామంతో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల పేద, మధ్యతరగతి కుటుంబాల్లో నమ్మకాన్ని పెంచిందన్నారు. కలెక్టర్ దంపతులకు మగ బిడ్డ జన్మించినాడని బిడ్డతోపాటు దంపతులు క్షేమంగా, సుభిక్షంగా ఉండాలని భోజ్యా నాయక్ కోరారు. సాధారణ వ్యక్తుల్లాగా కూలీలతో కూడా కలిసి పార, పలుగు పట్టి మట్టి త్రవ్వే జితేష్ వి పాటిల్ లాంటి కలెక్టర్ ను తన రాజకీయ జీవితంలో చూడలేదని భోజ్యా నాయక్ అన్నారు.

అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: పేద ప్రజల సంక్షేమం, నగర అభివృద్ధి లక్ష్యంగా అధికారులు ,సిబ్బంది అందరూ పని చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం ఎన్ టీ పి సి మిలీనియం హాల్ లో రామగుండం నగర పాలక సంస్థతో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు),కార్పొరేషన్ కమిషనర్ జె. అరుణ శ్రీ తో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన తరువాత నగరంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతున్నదని అన్నారు. వీటన్నిటినీ ప్రజల్లోకి తీసుకువెళ్ళి వివరించాల్సిన భాద్యత క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నమున్సిపల్ వార్డు అధికారులు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో ఎసిపిలు ఎం. రమేష్,సి హెచ్ శ్రీనివాస్,నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి,ఎస్ ఇ శివానంద్, ఇఇ రామన్, ఎసిపి శ్రీ హరి, రామగుండం తహశీల్దార్ దత్తు ప్రసాద్‌తో పాటు వివిధ కంపెనీల అధికారులు పాల్గొన్నారు.

కళాశాలలో శుద్ధ జల ప్లాంట్ ప్రారంభం

విశాలాంధ్ర, కొమరం భీం : జిల్లా కేంద్రానికి సమీపంలోని అంకుశాపూర్ గ్రామంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం శుద్ధ జలాన్ని అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన శుద్ధ జల ప్లాంట్ ను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు, సిబ్బందికి ఉపయోగ కరంగా శుద్ధ జల ప్లాంట్ ను ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. అనంతరం ఇటీవల పొరుగు సేవల పద్ధతిలో ఎంపికైన వారి ధృవపత్రాలను పరిశీలించారు. వైద్య విద్యార్థులతో మాట్లాడుతూ కళాశాలలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే స్పందించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భూ సమస్యలపై భూభారతిలో దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర బ్యూరో,సంగారెడ్డి : నూతన రెవెన్యూ చట్టం భూభారతి అమలులో భాగంగా నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. మంగళవారం సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్‌పేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో టీజీఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ రైతులు ఏ చిన్న, భూ సమస్యనైనా రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. భూ భారతి చట్టం ఏప్రిల్ 14న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాడం జరిగిందన్నారు. నేటి నుంచి 20 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మిగిలిన అన్ని మండలాల్లో ప్రజల వద్దకే రెవెన్యూ నినాదం'తో సదస్సులు నిర్వహిస్తాం అని, అన్ని రెవెన్యూ గ్రామాలకు తహసీల్దార్ కూడిన బృందం వెళ్లి ప్రజల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, పరిష్కరిస్తుందన్నారు. భూ సమస్యలను అధికారులు మానవీయ కోణంలో పరిష్కరించాని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టీజీ ఐఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం రైతుల చుట్టం అని ,గతంలో ధరణి తో రైతులు ఇబ్బంది పడ్డారని ,కార్యాలయాల చుట్టూ,కోర్టు ల చుట్టూ తిరిగరన్నారు. ముఖ్య మంత్రి మాట ప్రకారం అధికారులే ప్రజల వద్దకు వస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రవీందర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి ఖాసిం బేగ్, రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

భూ భారతిలో భూ సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర గూడూరు: మండలంలో ఉన్న భూ సమస్య ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులు పాల్గొనాలని గూడూరు మండల తాసిల్దార్ నాగ భవాని తెలిపారు. మంగళవారం గూడూరు మండలం భూపతి పేట మరియు ఊట్ల గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలములోని భూభారతి అనే చట్టం ద్వారా రైతుల భూ సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందని తాసిల్దార్ అన్నారు. ఈనెల03 నుండి 18వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భూ సమస్య ఉన్న రైతులు మండలంలో ఉన్న గ్రామాలలో జరిగే రెవెన్యూ సదస్సులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. భూపతి పేట గ్రామం నుండి 129,ఊట్ల గ్రామం నుండి 24 రైతుల నుండి దరఖాస్తు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

విశాలాంధ్ర-నేరేడు చర్ల : ప్రభుత్వ బడులలోనే నాణ్యమైన విద్య అందుతుందని టిఎస్యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్ కుమార్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు. మధు, శ్రీనివాసరావులు అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నేరేడుచర్ల మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మన పిల్లల్ని మన ఊరి బడిలోనే చేర్పిద్దాం అనే నినాదంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు కొరకు ప్రచార జాతాను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు. మధు ఎల్ శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మన ఊరు- మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పనకు కృషి జరుగుతుందన్నారు. ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని, విద్యా హక్కు చట్టం కారణంగా మధ్యాహ్నం భోజనం, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పదివేలకు పైగా నూతన ఉపాధ్యాయులు నియమించడంతో ఉపాధ్యాయుల కొరత తీరిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విశాలమైన తరగతి గదులుబీ ఆట స్థలాలుబీ ఏఐ ఆధారిత బోధన, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, లేబరేటరీలతో పాటుబీ అహ్లాదకరమైన వాతావరణంలో ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధతో నిపుణులైన ఉపాధ్యాయులతో పిల్లల మానసిక, ఆరోగ్యానికి, వ్యక్తిత్వ వికాసానికి అనువుగా ప్రభుత్వ పాఠశాల రూపుదిద్దు కుంటున్నాయన్నారు. అందుకే ప్రతి ఒక్క తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలని చదివించాలని,నాణ్యమైన విద్యను పొందటంతో పాటు ఫీజుల భారం నుంచి ఉపశమనం పొందవచ్చునన్నారు. నేరేడుచర్ల శాఖ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనయ్య, అక్కయ్య బాబుబీగరిడేపల్లి శాఖ అధ్యక్ష ,కార్యదర్శులు నాగేశ్వరరావు,వెంకట్ రెడ్డి, పాలకవీడు శాఖబీ అధ్యక్షబీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, శేఖర్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్, సాంబయ్య రవీందర్ రెడ్డి సీనియర్ నాయకులు నరసింహారావు రాఘవరెడ్డి యాదగిరి వెంకట నరసయ్య వెంకటేశ్వరరావు రషీద్ ఖాన్ వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

సంపాదకీయం

సర్కారీ భాష త్రివిధ దళాధిపతి నోట

ఆపరేషన్ సిందూర్ మర్మం ఏమిటో ప్రధానమంత్రి మోదీ నుంచి ప్రభుత్వ పెద్దలు ఎవరూ నోరు విప్పరు. కానీ సైనికాధిపతుల వ్యాఖ్యానాలకు మాత్రం కొదవలేదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మొదట్లో మన రక్షణ దళాల వల్ల కొన్ని పొరపాట్లు జరిగాయని అయితే వాటిని వెంటనే సరిదిద్దామని త్రివిధ దళాల అధిపతి అనిల్ చౌహాన్ ఇటీవలే చెప్పారు. ఈ మాటలు ఆయన మన దేశంలో చెప్పకుండా సింగపూర్‌లో బ్లూంబర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. దీని మర్మం ఏమిటో తెలియదు. మళ్లీ మంగళవారం ఆయన పుణేలోని సావిత్రిబాయి పూలే విశ్వవిద్యాలయంలో ఆపరేషన్ సిందూర్ గురించి మరిన్ని వివరాలు అందించారు. ఈసారి ఆయన కొన్ని కొత్త విషయాలు వెల్లడించారు. భారత్ తీవ్రవాదం నీడలో బతకబోదని, అణ్వస్త్రాలకు బెదరదని జనరల్ అనిల్ చౌహాన్ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరికే జారీ చేశారు. "భవిష్యత్ యుద్ధాలు, యుద్ధ తంత్రం" అనే అంశం మీద ప్రత్యేక ఉపన్యాసంలో జనరల్ చౌహాన్ ఈ మాట చెప్పారు. పహల్గాం ఘటనకు కొన్ని వారాల ముందు పాకిస్థాన్ సైన్యాధిపతి అసిం మునీర్ భారత్ మీద నిప్పులు కురిపించారని కూడా చౌహాన్ తెలియజేశారు. బ్లూంబర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మన యుద్ధ విమానాలు కొన్ని కూలిన మాట వాస్తవమేనని అంగీకరించారు. అయితే ఎన్ని విమానాలు కూలాయో, అవి ఎలాంటివో, అందులో రాఫేల్ యుద్ధ విమానాలు ఉన్నాయో లేదో మాత్రం చౌహాన్ చెప్పలేదు. ఇంతకు ముందు వెలువడ్డ వార్తల ప్రకారం మన దళాలు పాకిస్థాన్‌లోని తొమ్మిది తీవ్రవాద స్థావరాలను ధ్వంసం చేశాయని చెప్పారు. ఇప్పుడు అంతకన్నా ఎక్కువ స్థావరాలపై మన దళాలు దాడి చేశాయంటున్నారు. అయితే ఈ వార్త ఇప్పటిదాకా ధ్రువ పడలేదు. జనరల్ చౌహాన్ బ్లూంబర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మనం సుదీర్ఘ యుద్ధం కొనసాగించాలని అనుకోలేదని కూడా అన్నారు. యుద్ధం మరి కొన్నాళ్లు జరిగినా పాకిస్థాన్‌పై కోలుకోలేని దెబ్బ తీయాలని, పనిలో పనిగా ఆక్రమిత కశ్మీర్‌ను కూడా స్వాధీనం చేసుకుంటే బాగుండేదని "మోదీ భక్తులు" చాలా మంది భావించారు. ఎందుకంటే "మోదీ ఉంటే ఏదైనా సాధ్యమే" అన్న భావన ఇన్నాళ్ల నుంచి భక్తుల్లో గూడు కట్టుకుని ఉంది. మరి సుదీర్ఘ యుద్ధం కొనసాగించదలచుకోలేదు అని జనరల్ చౌహాన్ అనడంలో అంతరార్థం ఏమై ఉంటుంది? పరిస్థితినిబట్టి యుద్ధం ఎన్నాళ్లు సాగాలో నిర్ణయం అవుతుంది తప్ప యుద్ధం నిలిపి వేయడానికి ముహూర్తం ఏమీ ఉండదు. పాకిస్థాన్‌పై దాడిని విరమించడానికి కారణం ఏమిటో కూడా చౌహాన్ తెలియజేశారు. మే పదో తేదీన పాకిస్థాన్ మన మీద తీవ్రమైన దాడికి పాల్పడిందట. మన నడ్డి విరచాలనుకుందట. 48 గంటల పాటు యుద్ధం చేసి పై చేయి సాధించాలనుకుందట. కానీ ఈ పోరాటాన్ని పాక్ అనుకున్నట్టు 48 గంటలు కొనసాగించకుండా ఎనిమిది గంటల్లోనే పాక్‌ను కాళ్ల బేరానికి తీసుకొచ్చామని జనరల్ చౌహాన్ చెప్తున్నారు. మన దాడికి తట్టుకోలేక పాకిస్థాన్ సైనిక వ్యవహారాల డైరెక్టర్ జనరల్ అదే హోదాగల మన సైనికాధికారికి ఫోన్ చేసి రాత్రి పోరాటం విరమిద్దాం అని అడిగారని చౌహాన్ అన్నారు. దానితో భారత్ కాల్పుల విరమణకు ఒప్పుకుందట.

జనరల్ అనిల్ చౌహాన్ చెప్పిన విషయాలేవీ బ్రహ్మ రహస్యాలేమీ కావు. ఒక్కటే తేడా. ప్రతిపక్షాలు ఎంత గుచ్చి గుచ్చి అడిగినా ఆపరేషన్ సిందూర్ గురించి కానీ, మన రక్షణ దళాలకు జరిగిన నష్టం గురించి కానీ, ఎన్ని యుద్ధ విమానాలు కోల్పోయామని గానీ, కాల్పుల విరమణలో అమెరికాపాత్ర ఏమిటని గానీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఏ సమాచారమూ ఇంతవరకు లేదు. వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ రక్షణ దళాలకు అందవలసిన సామాగ్రి సమయానికి అందడం లేదని చెప్పారు. దీనికి కూడా ప్రభుత్వం నుంచి ఏ సమాధానమూ లేదు. త్రివిధ దళాల అధిపతి చౌహాన్ కూడా ఈ ఫిర్యాదును పట్టించుకున్నట్టు లేదు. కొంత సమాచారమైనా జనరల్ చౌహాన్ నుంచి వచ్చి ఉండొచ్చు. కానీ సాధారణంగా ఇలాంటి విషయాలు సైన్యాధిపతులు మాట్లాడరు. మాట్లాడవలసిన రాజకీయ నాయకులు పెదవి విప్పడం లేదు. పహల్గాం దాడికి బాధ్యులైన వారినే కాదు, తీవ్రవాదులకు మద్దతిస్తున్న పాకిస్థాన్‌ను కూడా మట్టి కరిపిస్తామని ప్రతిజ్ఞ చేసిన నాయకులెవరూ దాడి చేసిన తీవ్రవాదులను ఇంతవరకు ఎందుకు పట్టుకోలేక పోయారో చెప్పనే లేదు. అసలు వారు సరిహద్దు దాటి ఎలా వచ్చారో కూడా ప్రభుత్వం చెప్పలేదు. ఒక వేళ దొంగచాటుగా వచ్చారనుకున్నా వారు సునాయాసంగా తిరిగి ఎలా వెళ్లారనేది అసలు ప్రశ్న. ఎందుకంటే సరిహద్దుల కాపలా కేంద్ర ప్రభుత్వ బాధ్యతే. ఆ తీవ్రవాదులకు తరతరాలు గుర్తుండే గుణపాఠం చెప్తామని బీహార్‌లో మోదీ చెప్పారు. ప్రతిపక్షాలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం తప్పించుకుంటున్న దశలో త్రివిధ దళాల అధిపతి ఎందుకు వివరాలు అందిస్తున్నారు. త్రివిధ దళాల అధిపతుల్లో చౌహాన్ రెండవ వారు మాత్రమే. అంతకు ముందు ఈ పదవే ఉండేది కాదు. మొదటి త్రివిధ దళాల అధిపతి బిపిన్ రావత్ ఎలా మరణించారో ఇప్పటికీ రహస్యమే. త్రివిధ దళాల అధిపతి సైన్యంలో పదోన్నతుల ద్వారా సంక్రమించేది కాదు. ఇది రాజకీయ నియామకం మాత్రమే. చౌహాన్ కూడా అలా త్రివిధ దళాల అధిపతి అయిన వారే. సహజంగానే రాజకీయ పదవుల్లో ఉండేవారు అధికారంలో ఉన్న రాజకీయ పక్షానికి అనుకూలంగా వ్యవహరించడం సహజం. జనరల్ చౌహాన్ అదే పని చేయడంలో ఆశ్చర్య పడవలసింది ఏమీ లేదు. పైగా ఆయనను నియమించేటప్పుడు ఆయన అందరికన్నా సీనియర్ కూడా కాదు. అనేకమంది సీనియర్లు అందుబాటులో ఉండగా చౌహాన్‌ను నియమించారు. బిపిన్ రావత్‌ను త్రివిధ దళాల అధిపతిని చేసినప్పుడు ఆయన అప్పటికి ఉన్న జనరళ్లలో సీనియర్. కానీ చౌహాన్ అలా కాదు. అయితే రావత్ కూడా బీజేపీకి అనుకూలురే. చౌహాన్‌ను ఆ స్థానంలో నియమించడానికి ప్రధాన కారణం తమకు సంపూర్ణ మద్దతుగా ఉండే వారినే నియమించాలన్న ఉద్దేశం ప్రస్ఫుటంగానే కనిపిస్తోంది. ఆపరేషన్ సిందూర్ గురించి అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల నుంచి సమాధానం రాని దశలో చౌహాన్ సమాచారం అందించారని సంతోషపడే వారూ ఉండొచ్చు. వాస్తవం ఏమిటంటే ప్రభుత్వం చెప్పదలుచుకున్న మాటలనే ఆయన చెప్తున్నారు. సత్యం వెల్లడించడానికి చౌహాన్ ఆత్మ తహతహలాడినందు వల్ల ఆయన విషయాలు బయట పెట్టారనుకోవడం భ్రమే. ప్రతిపక్షాల వాదనలను పూర్వ పక్షం చేయడానికే ప్రభుత్వం చౌహాన్‌ను ప్రయోగించింది. ఆయన సైనిక పరిభాషలో మాట్లాడి ప్రతిపక్షాల వాదనను పరాస్తం చేసే ప్రయత్నం చేశారు.

ఆయిల్ పామ్ రైతులపై సుంకం తగ్గింపు ప్రభావం

పి.జమలయ్య

కేంద్ర ప్రభుత్వం మూడు రోజుల క్రితం దిగుమతి చేసుకుంటున్న ముడి చమురుపై దిగుమతి సుంకాన్ని 27.5శాతం నుంచి 17.5 శాతానికి తగ్గించింది. దీని వల్ల రాష్ట్ర రైతాంగం రూ.570కోట్లు నష్ట పోతుంది. గతంలో 49 శాతం దిగుమతి సుంకం ఉండేది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో 5శాతానికి తగ్గించారు. రైతుల ఆందోళనతో ఇటీవల కాలంలో ఐదు శాతం నుంచి 27.5 శాతానికి పెంచారు. ప్రస్తుతం దిగుమతి సుంకం17.5శాతానికి తగ్గటం మన రాష్ట్రంలో ఆయిల్ పామ్ రైతులపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. రాష్ట్రంలో సుమారు 5లక్షల 66 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు.

ఏటా ఎకరానికి సుమారు 8 టన్నులు చొప్పున 19 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా. సుమారు లక్షా74వేల మంది రైతులు ఆయిల్ పామ్ సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. ముడి వంట ఆయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గించటం వల్ల తీవ్రంగా నష్టపోయేది ఆయిల్ పామ్ సాగు చేసే కౌలు రైతులే. ఎందుకంటే ఇటీవల కాలంలో వ్యవసాయంలో వచ్చిన మార్పులు పరిశీలిస్తే ఆయిల్ పామ్‌లో కూడా కౌలుసాగు పెరిగింది. నూటికి 50 నుంచి 60 శాతం మంది కౌలురైతులే ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని అనేక సర్వేల ద్వారా తెలుస్తోంది. ఒక ఎకరానికి ఆయిల్ పామ్ సాగు కోసం పెట్టే పెట్టుబడిలో కౌలే ఎక్కువ. ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లిలో ఎకరాకి సుమారు లక్ష రూపాయలు వరకు కౌలురేట్లు ఉన్నాయి. పెట్టుబడి మరొక రూ.60వేలు అవుతుంది.

కౌలుకు, పెట్టుబడికి ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు లేనందు వల్ల బ్యాంకులు పంట రుణాలు ఇవ్వటం లేదు. "భారతీయ రిజర్వుబ్యాంక్" నిబంధనల ప్రకారం రూ. 2 లక్షల వరకు హామీలేని పంట రుణాలు ఇవ్వాలని ఉన్నప్పటికీ రుణాలు ఇవ్వకుండా బ్యాంకులు నిబంధనలను ఉల్లంఘిస్తు న్నాయి. దీని వల్ల కౌలురైతులకు ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులే దిక్కువుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండిస్తే దిగుబడి ఎకరానికి సుమారు 8 టన్నులు మాత్రమే వస్తుంది.

టన్ను ఆయిల్ గెలలు వచ్చి మూడు రోజుల క్రితం రూ.20130 ఉంది. ప్రస్తుతం దిగుమతి సుంకాల తగ్గించటం వలన రూ.17వేలకు పడిపోయింది. అంటే 8 టన్నులు గాను రూ.1,36,000 ఆదాయం వస్తోంది. ఖర్చు వచ్చి రూ.1,60,000 అంటే ఎకరాకు సుమారు రూ.24 వేలు నష్టం జరుగుతోంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ముడి వంట ఆయిల్ దిగుమతులపై సుంకాన్ని 49శాతం వరకు పెంచాలి. టన్ను ఆయిల్ గెలలకు రూ.22 వేలు మద్దతు ధర ప్రకటించాలి. దాని ప్రకారం కంపెనీలు కొనుగోలు చేసే విధంగా చట్టబద్ధత కల్పించాలి. ఆయిల్ పామ్ సాగు చేసే కౌలురైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి హామీలేని పంట రుణాలు ఇప్పించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి.

అన్నదాత సుఖీభవ లాంటి పథకాలను కూడా వర్తింప చేయాలి. ఏటా పెరుగుతున్న కౌలు రేట్లును నియంత్రించ డానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. అప్పుడే దేశీయ ఆయిల్ పామ్ రైతులకు కనీసం పెట్టిన పెట్టుబడైనా వస్తుంది. లేకపోతే కోకో, పొగాకు, మామిడి, మిర్చి రైతులలాగానే ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోయి వీధిన పడతారు.

ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం

మోది మాయాజాలం! గోదావరి కావేరి



వి. శంకరయ్య



రాజకీయ ప్రయోజనం లేనిదే ప్రధాన మంత్రి మోదీ పాలనలో పిల్లికి కూడా భిక్షం లభించదని మరొకమారు తేలిపోయింది. తమిళనాడులో వచ్చే సంవత్సరం ఎన్నికలు జరగనున్నందున గత కొన్ని సంవత్సరాలుగా దస్త్రాలకే పరిమితమైన గోదావరి కావేరి అనుసంధానం తిరిగి తెరమీదకు తెచ్చారు. కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలో జూన్ 24 వతేదీ హైదరాబాద్ లో జరిగే సమావేశంలో గోదావరి కావేరి అనుసంధానంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు లేవనెత్తిన అభ్యంతరాలు నివృత్తి చేయనున్నారు. ఈ సమావేశంలో జాతీయ జల అభివృద్ధి సంస్థతో పాటు నదుల అనుసంధానం టాస్క్ ఫోర్స్ కమిటీ కూడా పాల్గొననున్నది. తాజాగా తెర మీదకొచ్చిన ఈ ప్రతిపాదన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గోదావరి బనకచర్ల అనుసంధానం పథకాన్ని ఒక కుదుపుకు గురి చేస్తుందేమో! ఆ ముచ్చట తర్వాత చూద్దాం! ముందుగా ప్రధాన మంత్రి మాయాజాలం లిస్ట్ తెలుసుకొందాం!

2022లో కర్నాటకలో బీజేపీ అధికారంలో వుండగా ఎన్నికల ముందు ఎగువ భద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. మరీ గమనార్హం అంశమేమంటే ఈ కథాకమామీషు మొత్తం పది రోజుల్లో పూర్తి చేశారు. వివిధ శాఖలకు చెందిన ఆరుగురు కార్యదర్శులు ఆగమేఘాల మీద సమావేశమై ఆమోదం తెలిపారు. పైగా ఆ ఏడు బడ్జెట్‌లో రూ.5300 కోట్లు కేటాయించారు. మరో వేపు చట్టబద్ధత గల పోలవరం ప్రాజెక్టుకు ఏ నాడూ కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. అంతేకాదు. 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కృష్ణా జలాలు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తిరిగి పంపిణీకి ట్రిబ్యునల్ నియామకం గురించి తీర్మానం చేశారు. ఈ సమావేశంలో అప్పట్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి తెలంగాణ అప్పటి సీఎం కేసీఆర్‌కు అడ్డుచెప్పలేక మౌనం పాటించడంతో తీర్మానం ఆమోదించి ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగాన్ని బలిపీఠం ఎక్కించారు. కాని మూడు సంవత్సరాలు ఈ తీర్మానం దస్త్రాలకే పరిమితమైనది. కేసీఆర్ అడిగినప్పుడల్లా న్యాయశాఖ వద్ద వుందని చెప్పేవారు. కాని 2023లో తెలంగాణ ఎన్నికల్లో ట్రిబ్యునల్ నియామకంచేస్తే రాజకీయ ప్రయోజనం వుంటుందని ఆశించి దస్త్రాలకు పరిమితమైన ప్రతిపాదనను దుమ్ము దులిపి ట్రిబ్యునల్ నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. 2020లో జగన్‌మోహన్ రెడ్డి బలిపీఠం ఎక్కిస్తే 2023లో ప్రధానమంత్రి మోదీ ఆంధ్రప్రదేశ్ సాగునీటి ప్రయోజనాలకు మెడ మీద కత్తి పెట్టారు. ఇంత ఘోరమైన అన్యాయం ఆంధ్రప్రదేశ్‌కు జరిగినా రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలు కమలనాథులను నిలదీయ లేకపోవడం ఆనాటి విషాదం. ఇటీవల మరో సంఘటన జరిగింది. 2004లో నియమించిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో తుది తీర్పు ఇచ్చింది. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రమైన అన్యాయం చేసిందని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేసువేసి స్టే తెచ్చింది. ఈ కేసు ఇన్నేళ్లు గడిచినా తేలలేదు. ఫలితంగా తీర్పు నోటిఫై చేయలేదు. తీర్పు నోటిఫై చేస్తే గాని కర్నాటక ఆల్మట్టి జలాశయాన్ని 525 మీటర్ల ఎత్తుకు పెంచుకొనే అవకాశంలేదు. ఇటీవల కేంద్ర జలవనరుల శాఖ మంత్రి పాటిల్ బేసిన్ లోని భాగస్వామ్య రాష్ట్రాలతో సమావేశంలో ఏర్పాటుచేసి ఏకాభిప్రాయం సాధించి తీర్పును నోటిఫై చేసేందుకు ప్రయత్నించారు. ప్రస్తుతమున్న పద్ధతిలో తీర్పు నోటిఫై జరిగితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు దక్కేది నికరంగా 39 టీఎంసీలు కాగా కర్నాటకకు 170 టీఎంసీలు లభిస్తాయి. మహారాష్ట్రకు 65 టీఎంసీలు దక్కుతాయి.

2014 ఫిబ్రవరి 20 వతేదీ రాష్ట్ర విభజన చట్టం చర్చ జరుగుతున్న సమయంలో అప్పటి ప్రధాన మంత్రి మన్‌మోహన్ సింగ్ అవశేష ఆంధ్రప్రదేశ్‌కు బుందేల్ ఖండ్ బోలంగీర్ తరహా ప్రత్యేక పథకం అమలు జరుగుతుందని, ప్రత్యేక హోదా ఇవ్వబడుతుందని హామీ ఇచ్చారు. కాని 2014 లో ప్రధాని పదవి చేపట్టిన నరేంద్ర మోదీ ప్రత్యేకహోదా ఎలా శంకరగిరి మాన్యాలు పట్టించింది అందరికీ తెలుసు. ప్రధాన మంత్రిగా చట్ట సభలో మన్‌మోహన్ సింగ్ ఇచ్చిన హామీ బుందేల్ ఖండ్ నమూనా ప్రత్యేక పథకం ఊసే లేకుండా పోయింది. కాని 2022లోనే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వ్యాపించి వున్న బుందేల్ ఖండ్‌కు భారీ సాగునీటి ప్రాజెక్టును నదుల అనుసంధానం కింద కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. యమునా నది ఉప నదులైన కెన్ - బెత్వా నదుల అనుసంధానం 44,650 కోట్లతో కేంద్ర ప్రభుత్వం అమలు జరుపుతోంది. తొలి సంవత్సరమే కేంద్ర బడ్జెట్ లో 6700 కోట్ల రూపాయల కేటాయించింది. చట్టబద్ధత గల పోలవరం ప్రాజెక్టుకు తాగునీటికి చెంది నిధులు ఎగ్గొట్టిన కేంద్ర ప్రభుత్వం కెన్- బెత్వా నదుల అనుసంధానంలో తాగునీటి వ్యయం కూడా కేంద్రమే భరిస్తోంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు వున్నందున ఈ వెసులుబాటు కల్పించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అయిన వారికి ఆకుల్లో కాని వారికి కంచాల్లో పెట్టడం మనమెరుగుదుము. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీతో కూడిన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 46 వెలికితీసి వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక పథకం కింద గోదావరి బనకచర్ల అనుసంధానానికి కేంద్ర ప్రభుత్వాన్ని నిధులు కోరితే సానుకూలంగా స్పందిస్తున్నారు. 2014-19 మధ్య కాలంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అప్పట్లో గోదావరి పెన్నా అనుసంధానం మాత్రమే ప్రతిపాదించారు. ఇప్పుడు బనకచర్ల అనుసంధానం చేర్చడమంటే వెనుకబడిన రాయలసీమ పేరు చెప్పి కేంద్రం నుంచి నిధులు సమీకరణకు కృషి చేస్తున్నట్లు తాజా సమాచారంతో వెల్లడౌతోంది. గోదావరి బనకచర్ల అనుసంధానం కేవలం బొల్లాపల్లి వరకు పరిమితంచేసి గోదావరి జలాలను డెల్టా సాగర్ కుడి కాలువ ఆయకట్టుకు సరఫరాచేసి తద్వారా మిగిలే 300 టీఎంసీలు శ్రీశైలం జలాశయం నుంచి రాయలసీమకు ఎందుకు సరఫరా చేయకూడదని రాష్ట్రంలో సాగునీటి రంగం నిపుణులు మదనపడుతున్న దశలో ఉరుములు లేకుండా పిడుగులు పడినట్లు రెండు అంశాలు వెల్లడి అయ్యాయి.

బనకచర్ల అనుసంధానం పెడితేనే ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం అయితే గియితే ఎంతో కొంత నిధులు ఇస్తుంది. బొల్లాపల్లి వరకు పరిమితం చేస్తే కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందే పరిస్థితి లేదని తేలిపోయింది. ఒక వేళ బొల్లాపల్లి బనకచర్ల అనుసంధానం చేపడితే గరిష్టంగా 335 మీటర్ల ఎత్తుతో మూడు ఎత్తిపోతలతో దాదాపు 26 కిలోమీటర్ల దూరం టన్నెల్స్ 113 కిలోమీటర్ల దూరం కాలువతో సాగే ఈ అనుసంధానం ఈ తరంలో పూర్తయ్యే అవకాశంలేదు. కొద్దిపాటి టన్నెల్స్‌తో కూడిన వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ అనుభవం దృష్ట్యా రాయలసీమ వాసులు ఈ పథకంపై వైముఖ్యంతో వున్నారు. వెనుకబడిన రాయలసీమ పేరుతో వచ్చే నిధులు సుదూర భవిష్యత్తులో తమకు ఉపయోగపడే అవకాశాలు కన్పించడంలేదని భావించే అవకాశముంది. కాగా గత సంవత్సరం కాలంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి బనకచర్ల అనుసంధానం గురించి చెబుతుంటే గత ఆరేడేళ్లుగా కేంద్రం కసరత్తు చేస్తున్న గోదావరి కావేరి అనుసంధానం గురించి సంవత్సర కాలంలో ఎట్టి ప్రయత్నాలు కేంద్రం చేయలేదు. ఇప్పుడు తమిళనాడులో బీజేపీ కొత్త ఎన్నికల పొత్తు పెట్టుకోవడం వచ్చే ఏడాది ఎన్నికలు రానున్న పూర్వ రంగంలో గోదావరి-కావేరి అనుసంధానం తిరిగి తెరమీద తెచ్చారు. అయితే ఇప్పుడు బహిర్గతమౌతున్న సమాచారం ఏమంటే ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం కూడా బొల్లాపల్లి నుంచి కావేరి అనుసంధానం చేపట్టమని కోరినట్లు తెలుస్తోంది. ఇది మరీ అన్యాయం. ఇదే జరిగితే రాయలసీమకు తీరని అన్యాయం మరొక మారు జరుగుతుంది. వాస్తవంలో గోదావరి కావేరి అనుసంధానం పోలవరం నుంచి సాధ్యంకాదని గతంలోనే తేలి పోయింది.

జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలోనే గోదావరి కావేరి అనుసంధానం పోలవరం నుంచి చేపట్టమని అనేకమార్లు కోరారు. ఈ ప్రతిపాదనపై రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. గోదావరి మిగులు జలాలను తమిళనాడుకు తరలించడంగా రాష్ట్రంలోని సాగునీటి రంగం నిపుణులు భావించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ ప్రతిపాదన బొల్లాపల్లి నుంచి చేయడమంటే ఒకింత ఆశ్చర్యంగానే వుంది. ఒకసారి తిరస్కరించిన ఈ ప్రతిపాదన ఎక్కువ శాతం ఆచరణకు వచ్చే అవకాశంలేదు. ఎందుకంటే ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు అంతర్ రాష్ట్ర పథకంగా ఏ సాగునీటి పథకం అమలు చేయాలన్నా విధిగా నికర జలాలు వుండాలి. గతంలోనే నదుల అనుసంధానం టాస్క్ ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిరె శ్రీరాం ఈ ప్రతిపాదన వీలుకాదని పోలవరం వద్ద నికరజలాలు లేవని తేల్చి చెప్పి వున్నారు. గోదావరి బేసిన్‌లో ఛత్తీస్‌గఢ్ ఉపయోగించుకొనని 148 టీఎంసీలు అదీ ఇంద్రావతి నది గోదావరిలో కలిసి తర్వాత సమ్మక్క బ్యారేజీ (తుపాకులు గూడెం) వద్ద నుంచి అనుసంధానం చేపట్టాలని డీపీఆర్ తయారు చేశారు. కొసమెరుపు ఏమంటే ఇటీవల వరకు ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం వున్నా కూడా తన వాటా నికర జలాలు ఇచ్చేందుకు తిరస్కరించింది. ఇప్పుడు ఏం మంత్రం వేస్తారో వేచిచూడాలి. ఈ పూర్వరంగంలో కేంద్రం ప్రభుత్వం చేపట్టనున్న గోదావరి కావేరి అనుసంధానం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టనున్న గోదావరి బనకచర్ల అనుసంధానం ఏ రూపు తీసు కొంటాయో వేచి చూడాల్సిందే. అయితే తెలంగాణ ప్రభుత్వం మాత్రం బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు వచ్చి నీటి కేటాయింపులు జరిగిన తర్వాతనే సాగర్‌ను ఆన్‌లైన్ రిజర్వాయర్‌గా తీసుకోవాలనే కఠిన షరతు పెట్టి వుంది. ఏదిఏమైనా ప్రధాన మంత్రి మోదీ హయాంలో ఏదో ఒక రాజకీయ ప్రయోజనం లేనిదే పూచిక పుల్లంత పని కూడా జరగదని తేలిపోయింది.

విశ్రాంత పాత్రికేయులు

బలహీనమవుతున్న మోదీ సిందూర్ రాజకీయం

డా. జ్ఞాన్ పాఠక్

పాకిస్థాన్ టెర్రరిస్టులపై భారత్ సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించి అనేక మంది టెర్రరిస్టులను హతమార్చిన తొలి రోజులలో మన ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ ఇమేజ్ దేశ, విదేశాల్లో కొంతమేర పెరిగింది. సిందూర్ రాజకీయాలపై దేశంలో బహిరంగంగానే ప్రతిఘటన ఎదురుకావడంతో ఆ ప్రయోజనం క్రమంగా బలహీనపడడం ప్రారంభమైంది. రెండు దేశాల మధ్య సాయుధ ఘర్షణ అనంతరం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తన ఆధిపత్య కథనంపై భారత్ నియంత్రణ కోల్పోయే సంకేతాలను చూపుతోంది, పాకిస్థాన్ కూడా బలమైన, తీవ్ర విమర్శలను చేయడం ప్రారంభించింది. పాకిస్థాన్ ప్రోత్సాహంతో కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో టెర్రరిస్టులు దాడులు జరిపి 26 మంది యాత్రికులను దారుణంగా చంపివేశారు. మతం ఆధారంగా దాడులు జరిపి యాత్రికులు 26 మందిని పొట్టన పెట్టుకున్నప్పటికీ దేశంలో మతాల మధ్య ఎలాంటి చిచ్చు రేగలేదు. ఘర్షణలు జరగలేదు. సాధారణంగా దేశంలో ఐక్యత కనిపించింది. రాజకీయపార్టీల మధ్య గొడవలేమీ జరగలేదు. ప్రభుత్వంలో కొన్నిలోపాలు జరిగాయి. టెర్రరిస్టుల దాడులు జరపకుండా నిరోధించలేదు. నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలమైంది. సాధారణంగా నిఘావర్గాలు కేంద్ర ప్రభుత్వానికి, దేశ రక్షణ బాధ్యులకు సమాచారం తెలియచేస్తాయి. ఇది ఎవరి వైఫల్యం? మొదట ప్రధాని మోదీకి, బీజేపీకి సానుకూలత కనిపించింది. బహుళ రాజకీయ నాయకులతో కూడిన బృందాలు విదేశాలలో పాకిస్థాన్ దుర్మార్గాలను గూర్చి వివరించేందుకు వెళ్లడానికి ప్రతిపక్షాలు పూర్తిగా మద్దతు ప్రకటించాయి. అంతేగాక ప్రధాని మోదీ ప్రతిపక్షాలు తెలిపిన సానుకూలతలకు బదులుగాఎలాంటి సమ్మతిని లేదా సంతోషాన్ని వ్యక్తం చేయలేదు. పైగా ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల మధ్య చిచ్చుపెట్టుకోగల పరిస్థితిని కలగచేసేందుకు అనుకూల నాయక బృందం ఏర్పాటుచేసి పంపారు. కాంగ్రెస్, టీఎంసీ, శివసేన(యూబీటీ) పార్టీలలో విభేదాలను సృష్టించారు. చివరకు ఇండియా బ్లాక్‌లోని ఒక పార్టీపై మరొక పార్టీ విమర్శలు చేసుకున్నాయి. శరద్‌పవార్, సంజయ్ రౌత్ పరస్పర విమర్శలకు దిగారు. కొంతమేరకు ఇలాంటి అంశాలు నరేంద్ర మోదీకి ఉపయోగపడతాయి.

ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ నాయకులు ఎన్నికలు జరగనున్న బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో సిందూర్ రాజకీయాలను ప్రారంభించారు. వీరు రోడ్‌షోలను నిర్వహిస్తున్నారు. ఈ రోడ్‌షోలలో మత రాజకీయాలను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ముస్లింలను, ప్రతిపక్ష రాజకీయ పార్టీలను తీవ్రంగా ఇష్టానుసారం మాట్లాడు తున్నారు. ప్రతిపక్షాలు ముస్లింలకు మద్దతు తెలియజేస్తున్నారని పాకిస్థాన్ మద్దతుదారులని మోదీ, బీజేపీలు విమర్శిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశించి సిందూర్ రాజకీయాలను ఉపయోగిస్తున్నారు. అలిపుర్దార్‌లో జరిగిన ర్యాలీలో నరేంద్ర మోదీ పశ్చిమబెంగాల్‌ను ఉద్దేశించి విషప్రచారం నిర్వహించారు. సంకుచిత అధికార ప్రయోజనాలకోసమే

మోదీ మమతను విమర్శిస్తున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకోసం ఆపరేషన్ సిందూర్‌ను మోదీ వినియోగించుకుంటున్నారని మమత తీవ్రంగా విమర్శించింది. హోం మంత్రి అమిత్ షా కూడా పాకిస్థాన్ నుంచి సరిహద్దులను దాటి రావడానికి మమత కారణమని దుయ్యబడుతున్నారు. ముర్షిదాబాద్‌లో దాడులకు మమత కారణమంటూ ప్రధాని ఆరోపిస్తున్నారు. మన దేశాన్ని కాపాడుకోవడం మనకర్తవ్యం అని మమత ఆపరేషన్ సిందూర్‌ను సమర్థించారు. అయితే ఓటు బ్యాంకు రాజకీయాలకోసం ఆపరేషన్ సిందూర్‌ను ఉపయోగించుకోవటం సరైందికాదని మమత విమర్శించారు. మొదట ఆపరేషన్ సిందూర్‌కు బీజేపీకి అనుకూలత ఉంటుందని భావించినప్పటికీ ఇప్పుడు బహిరంగంగానే దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు.

బంగ్లాదేశ్‌నుంచి అక్రమంగా సరిహద్దు దాటి మనదేశంలోకి రావడానికి పశ్చిమబెంగాల్ ప్రభుత్వమే కారణమంటూ అమిత్‌షా మాట్లాడు తున్నారు. అయితే సరిహద్దులను కాపాడే బాధ్యత కేంద్ర ప్రభుత్వాని దేనని పైగా, సరిహద్దు దళాలు (బిఎస్‌ఎఫ్) కేంద్రం నియంత్రణలోనే పనిచేస్తున్నాయని, ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వాన్ని విమర్శించడం తుచ్ఛమైన రాజకీయాలకు పాల్పడే బీజేపీ ప్రభుత్వ విధానమని మమత తీవ్రంగా విమర్శించారు. ఈ కారణంచేత అమిత్ షా తక్షణం రాజీనామా చేయాలని టెర్రరిస్టు దాడులను నిరోధించలేకపోవడం బీజేపీ ప్రభుత్వలోపమేనని ఆమె అన్నారు. కశ్మీర్‌ను ఇండియా ప్రభుత్వమే కాపాడాలని, పాకిస్థాన్ ప్రోత్సహించి టెర్రరిస్టు దాడులకు కారణమైందని నరేంద్ర మోదీ మూలంగా వాస్తవంగా అనేక సంఘటనలు జరుగుతున్నాయని మమత అన్నారు. రెండు దేశాలమధ్య సాయుధ సంఘర్షణ జరుగుతుండగా నరేంద్ర మోదీకి బదులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణ పెరిగిందని ప్రకటించడం మోదీకి అవమానకరం కాదా? అని మమత అన్నారు. అ విషయంలో మోదీ ట్రంప్‌కు అణగిమణగి ఉన్నారని అర్థమవుతోంది. ట్రంప్ మధ్యవర్తిత్వం వహించి కాల్పుల విరమణకు ఒప్పించానని ముందుగా ప్రపంచానికి తెలియజేశారు. అయినా మోదీ మౌనంగా ఉండటం వెనుక ఏదో రహస్యం ఉందని మమత అన్నారు. ద్వైపాక్షిక పరిష్కారంకోసం సిమ్లా ఒప్పందాన్ని కుదుర్చుకోడానికి మధ్యవర్తిత్వం జరిగిందనే విషయాన్ని తిరస్కరించారు.

ఇంతక్రితం సాయుధసంఘర్షణ సందర్భంగా వైమానిక దళానికి ఎంత నష్టం జరిగిందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీ ప్రశ్నించినప్పటికీ మోదీ ప్రభుత్వం మౌనమే వహించింది. అందుకు బదులుగా బీజేపీ రాహుల్‌ను పాకిస్థాన్ పోస్టర్ బాయ్ అని విమర్శించింది. కశ్మీర్ విషయాన్ని మోదీ అంతర్జాతీయం చేయడం ఎందుకని రాహుల్ ప్రశ్నించారు. ఆయనేకాదు, అనేకమంది ఇంకా ప్రశ్నిస్తూనే ఉన్నారు. దాడులు జరుపుతున్నా మని పాకిస్థాన్‌కు మోదీ ప్రభుత్వం ముందుగానే తెలియ జేయడం వ్యూహాత్మక తప్పిదమని రాహుల్ తదితరులు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారాలను మాట్లాడేందుకు లోక్‌సభ సమావేశాలను నిర్వహించాలని కోరినప్పటికీ మోదీ ప్రభుత్వం మౌనం వహించడమేంటని రాహుల్ ప్రశ్నించారు. ఇండియా రక్షణ దళాల అధిపతి అనిల్ చౌహాన్ సింగపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ, సైనికదళాలు కొన్ని లోపాలు కలిగిఉందని, అందువల్లనే మొదట్లో నష్టాలు చోటుచేసుకున్నాయని వాస్తవాలను వెల్లడించారు. ప్రతిపక్ష పార్టీలు, నాయకులు మోదీ ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను తక్షణం ఏర్పాటు చేయాలన్నారు. రాయ్‌టర్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇండియా యుద్ధవిమానాలు కొన్నింటిని పాకిస్థాన్ దెబ్బతీసిందని చౌహాన్ వెల్లడించడాన్ని మోదీ ప్రభుత్వం అంగీకరించలేదు. ఇండియా వ్యూహాత్మక ప్రచారాన్ని కొనసాగిస్తూ యుద్ధరంగంలో వచ్చిన సానుకూలతలను క్షీణింపచేసిందని విమర్శలు వచ్చాయి. మోదీ మాత్రం తమ లోపాలను కప్పిపుచ్చుకుని ఇండియా నిర్ణయాత్మకమైన విజయాన్ని సాధించిందని ప్రచారం చేస్తున్నారు. సాయుధ సంఘర్షణ అనంతరం జరిగిన సంఘటనలను నియంత్రించేందుకు మోదీ చేసిన ప్రయత్నం మరింత సంక్లిష్టమైంది.

ఈశాన్య భారతం... జల దిగ్బంధం

- ఎడ తెరిపిలేని వర్షాలు... పొంగుతున్న నదులు
- వరదలకు దెబ్బతిన్న ఇళ్లు, రహదారులు
- స్తంభించిన జనజీవనం
- 5.5 లక్షల మందిపై ప్రభావం
- కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 40కి చేరిన మృతులు

న్యూఢిల్లీ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈశాన్య రాష్ట్రాలు వరద గుప్పిట్లో చిక్కుకున్నాయి. అనేక నివాసప్రాంతాలు నీటి తటాకాలను తలపిస్తున్నాయి. జనజీవనం స్తంభించింది. అంతేగాక కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో మొత్తం మృతుల సంఖ్య 40కి చేరుకోగా... 6 లక్షల మందికి పైగా తాజా విపత్తుకు ప్రభావితమయ్యారు. 11 మరణాలతో అసోం అగ్రస్థానంలో ఉంది. అరుణాచల్ ప్రదేశ్‌లో 10 మంది, మేఘాలయలో ఆరుగురు, మిజోరంలో ఐదుగురు, సిక్కింలో నలుగురు, త్రిపురలో నలుగురు చొప్పున వరదల్లో మృతిచెందారు.

- నైరుతి రుతుపవనాల ముందస్తు ఆగమనంతో కురుస్తున్న జోరు వర్షాల నుంచి అసోం ఇంకా కోలుకోలేదు. అనేక ప్రాంతాలకు ఇంకా వర్షం ముప్పు ఉందని భారత వాతావరణ విభాగం-ఐఎండీ హెచ్చరించింది. 22 జిల్లాల్లో వరద పరిస్థితి విషమించడంతో 5.35 లక్షల మందికి పైగా ప్రభావితమయ్యారని, మృతుల సంఖ్య 11కి పెరిగిందని, మరో ఇద్దరు గల్లంతైనట్లు అధికారిక ప్రకటన పేర్కొంది. ప్రస్తుతం పదిహేను నదులు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. 22 జిల్లాల్లోని 1,254 గ్రామాలు నీటమునిగినట్లు అధికారులు తెలిపారు. శ్రీభూమి జిల్లాలో అత్యంత దారుణంగా పరిస్థితులు ఉన్నట్లు వివరించారు. 165 వరద సహాయక శిబిరాలు ఏర్పాటు చేసిన అసోం ప్రభుత్వం 31,212 మందిని తరలించింది. మరో 157 కేంద్రాల్లో బాధితులకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేస్తోంది. బ్రహ్మపుత్ర, బరక్, కోపిలి నదులు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. సుబన్‌సిరి, బుర్హిదిహింగ్, ధన్‌సిరి, రుక్ని, ధలేశ్వరి, కటాఖల్, ఖుషియారా నదులు ప్రమాదకర స్థాయిని తాకుతూ ప్రవహిస్తున్నాయని అధికారులు తెలిపారు. వరద ఉధృతికి పలు ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు, ఇళ్లు, విద్యుత్ సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నాయి. వరద బాధిత లఖింపూర్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ప్రజలకు పూర్తి సహాయక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. భారీ వర్షాల కారణంగా రోడ్డు, రైలు, ఫెర్రీ సేవలకు అంతరాయం కలగడంతో రవాణా కార్యకలాపాలు నిలిచిపోయాయి.
- మణిపూర్‌లో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పలు నదులు ఉప్పొంగడం, కరకట్టలు తెగిపోవడంతో 19 వేల మందికిపైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. కుండపోత వర్షాలకు 3,365 ఇళ్లు దెబ్బతినగా, 103 ప్రాంతాలు ప్రభావితమయ్యాయి, 19,811 మంది నిర్వాసితులయ్యారు. ఆశ్రయం, మద్దతును అందించడానికి, ముంపు ప్రాంతాల నుంచి తరలించి వారి కోసం 31 సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇవి ఎక్కువగా ఇంఫాల్ తూర్పు జిల్లాలో ఉన్నాయి. భారీ వర్షాల కారణంగా తీవ్ర నీట మునిగిన నేపథ్యంలో ఇంఫాల్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (జేఎన్ ఐఎంఎస్)లో చిక్కుకుపోయిన వైద్య విద్యార్థులు, సిబ్బందిని రక్షించేందుకు మణిపూర్ ఫైర్ సర్వీస్, అసోం రైఫిల్స్, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఇండియన్ ఆర్మీ సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టాయి. భారీ వర్షాలకు ఇంఫాల్ నది కరకట్ట నాలుగు చోట్ల తెగిపోవడంతో ఇంఫాల్ ఈస్ట్‌లో భారీగా వరదలు వచ్చాయి.
- అరుణాచల్ ప్రదేశ్‌లో వరదలు, కొండచరియలు విరిగిపడి మరణించిన వారి సంఖ్య 10కి చేరిందని, లోహిత్ జిల్లాలో మరో మరణం నమోదైందని అధికారులు తెలిపారు. 23 జిల్లాల్లోని 156 గ్రామాల్లో 938 మంది వరద ప్రభావానికి గురైనట్లు స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (ఎస్ఈఓసీ) నివేదించింది. గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ కేటీ పర్నాయక్ (రిటైర్డ్) మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముఖ్యంగా కొండచరియలు విరిగిపడి వరదలు వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. పశ్చిమ కమెంగ్, కమ్లే, దిగువ-ఎగువ సుబన్సిరి, పాపుమ్ పరే, దిబాంగ్ లోయ, లోయర్ దిబాంగ్ లోయ, లోహిత్, చాంగ్లాంగ్, క్రా దాదీ, కురుంగ్ కుమే, లాంగ్డింగ్ సహా అనేక జిల్లాల్లో ప్రధాన నదులు, వాటి ఉపనదులు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తుండటంతో వరదలు వచ్చాయి. చాలా చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి.
- త్రిపురలో వరద పరిస్థితి మెరుగుపడటం ప్రారంభమైందని వర్షాలు తగ్గుముఖం పట్టాయని, నదీ మట్టాలు ప్రమాద స్థాయి కంటే గణనీయంగా పడిపోయాయని అధికారులు తెలిపారు. కాగా పరిస్థితి మెరుగుపడినప్పటికీ, 10,000 మందికి పైగా ప్రజలు ఇప్పటికీ ప్రభుత్వం నిర్వహిస్తున్న సహాయ శిబిరాల్లో ఉన్నారు. ప్రభావిత జిల్లాల్లో రాష్ట్ర యంత్రాంగం 66 సహాయ శిబిరాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 2,926 కుటుంబాలు లేదా 10,813 మందికి ఆశ్రయం కల్పిస్తోంది. పశ్చిమ త్రిపుర జిల్లాలో అత్యధికంగా 50 శిబిరాల్లో 2,352 కుటుంబాలు నివసిస్తున్నాయి.
- సిక్కింలో మే 29 నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మంగన్ జిల్లా అంతటా అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఫిడాంగ్ సంగక్‌లాంగ్‌లోని వంతెనలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రహదారి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 130 మిల్లీ మీటర్లకు పైగా కురిసిన వర్షానికి లాచెన్, లాచుంగ్, గురుడోంగ్మార్, వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్, జీరో పాయింట్ వంటి ప్రధాన పర్యాటక ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. తీస్తా నది 35-40 అడుగుల మేర ఉప్పొంగి ప్రవహించడంతో ప్రాంతీయ రవాణా దెబ్బతినడంతో పాటు ముఖ్యమైన రోడ్లు, వంతెనలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తాజా రోడ్డు, వాతావరణ పరిస్థితులను పరిశీలించిన తర్వాతే సిక్కింకు రావాలని పర్యాటకులకు రాష్ట్ర పర్యాటక, పౌర విమానయాన శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వేర్వేరు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు వాయుసేన రంగంలోకి దిగింది. రెండు ఎంఐ-17 హెలికాప్టర్ల ద్వారా 34 మందిని పాంగ్‌యాంగ్ విమానాశ్రయానికి చేర్చింది. సిక్కింలోని మాంగన్ జిల్లా లాచెన్ పట్టణ సమీపంలోని చాటెన్‌లో సైనిక శిబిరంపై ఆదివారం సాయంత్రం కొండచరియలు విరిగిపడటంతో ముగ్గురు సైనికులు మృతి చెందగా, మరో తొమ్మిది మంది గల్లంతైన సంగతి విదితమే.

ప్రధాని ఫోన్...

ఈశాన్య రాష్ట్రాల్లో వరద పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి పెట్టారు. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ, సిక్కిం సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్, మణిపూర్ గవర్నర్ అజయ్‌భల్లాలకు ఫోన్ చేసి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

మిజోరంలో విద్యాసంస్థలు బంద్

మిజోరం వ్యాప్తంగా వర్షాలు, వరదలకు అనేక ప్రాంతాల్లో ఇంకా కొండచరియలు విరిగిపడుతూనే ఉన్నాయి. రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులు 190 ప్రాంతాల్లో దెబ్బతిన్నాయి. 190కిపైగా ఇళ్లు దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు మిజోరాం రాజధాని ఐజ్వాల్ ఎక్కువ ప్రభావితమైంది. మంగళవారం ఉదయం కూడా జోరు వాన కురిసి అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ నేపథ్యంలో ఐజ్వాల్‌లో వరుసగా నాలుగో రోజూ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. కొండచరియలు విరిగిపడి 212 రహదారులు స్తంభించాయి. మే 24న భారీ వర్షాలు ప్రారంభమైనప్పటి నుంచి కొండచరియలు విరిగిపడటం, ఇళ్లు కూలిపోవడం, వర్షాలకు సంబంధించిన ఇతర ఘటనల్లో ముగ్గురు మయన్మార్ శరణార్థులు సహా ఇప్పటివరకు కనీసం ఐదుగురు మరణించారు.

నష్టం కాదు... ఫలితం ముఖ్యం

సీడీఎస్ అనిల్ చౌహాన్

పూనె: ఆపరేషన్ సిందూర్‌లో జరిగిన నష్టం కంటే... ఎంత మేరకు లక్ష్యాన్ని సాధించామనేదే ముఖ్యమని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. మంగళవారం పూనెలోని సావిత్రి బాయ్ పూలే యూనివర్సిటీలో భవిష్యత్తులో యుద్ధాలు, యుద్ధం అనే అంశంపై ఆయన కీలక ప్రసంగం చేశారు. భారత్‌పై మరిన్ని ఉగ్రదాడులు జరగకుండా చేసేందుకుగాను పాకిస్థాన్‌లోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం చేశామన్నారు. పహల్గాం ఉగ్రదాడిని ఆయన అత్యంత క్రూరమైన చర్యగా అభివర్ణించారు. ఈ చర్యను అధునిక ప్రపంచం ఏ మాత్రం అంగీకరించదని ఆయన పేర్కొన్నారు. ఈ తరహా చర్యలకు పాల్పడుతున్న పాకిస్థాన్‌పై భారత ప్రజల్లో మరింత అసహనం వ్యక్తమయ్యే అవకాశాలున్నాయన్నారు. పహల్గాం దాడిలో ఉగ్రవాదులు మతం అడిగి... వారి కుటుంబ సభ్యుల ముందే కాల్పులు జరిపారని గుర్తు చేశారు. దేశంలో జరిగిన ఉగ్రవాదుల చర్యల కారణంగా భారత్‌లో దాదాపు 20 వేల మందికిపైగా మరణించారని ఆయన గుర్తు చేశారు. అయితే చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ఇటీవల సింగపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ నిర్వహణలో భారత్ కొన్ని యుద్ధ విమానాలు కోల్పోయిందని వెల్లడించారు. కానీ ఆ సంఖ్య ఎంత అనేది వెల్లడించలేదు. మరోవైపు ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌ను దెబ్బ తీశామంటూ కేంద్రం స్పష్టమైన ప్రకటన చేసింది. కానీ ఈ ఆపరేషన్‌లో యుద్ధ విమానాలు కోల్పోయిన విషయాన్ని ఎందుకు చెప్పలేదంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించింది. భారత్ యుద్ధ విమానాలు కోల్పోయిన సంగతి సింగపూర్ వెళ్లిన అనిల్ చౌహాన్ చెప్పడం ఎంత వరకు సమంజసమని కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నిలదీసింది.

ఐఎస్ఐ గూఢచారి అరెస్టు

చండీగఢ్: పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్న పాక్ గూఢచారిని పంజాబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. తార్న్ తరణ్ జిల్లాకు చెందిన గగన్‌దీప్ సింగ్ అనే వ్యక్తికి పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆర్మీ దళాల మోహరింపులు, వ్యూహాత్మక ప్రదేశాల వివరాలు సహా సున్నితమైన సమాచారాన్ని అతడు ఐఎస్ఐకి చేరవేసినట్లుగా గుర్తించామని పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. గగన్‌దీప్ సింగ్ గత ఐదేళ్లుగా ఖలిస్తానీ ఉగ్రవాది గోపాల్ సింగ్ చావ్లాతో సంప్రదింపులు జరుపుతున్నాడని, అతడి ద్వారా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్ (పీఐఓలు)తో పరిచయాలు చేసుకున్నాడని ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఆశ్రయం పొందుతున్న ఖలిస్తానీ ఉగ్రవాది గోపాల్ చావ్లా, ఐఎస్ఐ సహకారంతో భారత్‌లో గూఢచర్య రాకెట్ నడుపుతున్నాడని, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆర్మీ ప్రణాళికలు తెలుసుకోవడానికి వీరిని ఉపయోగించుకున్నాడని పోలీసులు తెలిపారు. లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్‌తోనూ అతడికి సంబంధాలు ఉన్నాయన్నారు. గగన్‌దీప్ ఫోన్ స్వాధీనం చేసుకొని పరిశీలించగా... దేశానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు, సైన్యానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌కు లీక్ చేసిన ఆధారాలు లభించాయన్నారు. అంతేకాకుండా అతడికి 20 మందికి పైగా ఐఎస్ఐ ఏజెంట్లతో పరిచయాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ చర్యల వల్ల జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు.

శర్మిష్ఠకు హైకోర్టు బెయిల్ తిరస్కృతి

కోల్‌కతా: న్యాయ విద్యార్థి శర్మిష్ఠ పనోలీకి కోల్‌కతా హైకోర్టులో ఊరట లభించలేదు. తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె చేసిన అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. ఆపరేషన్ సిందూర్‌పై సినీ ప్రముఖులు మౌనం వహించడంపై శర్మిష్ఠ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టింది. స్వేచ్ఛగా మాట్లాడడం అంటే ఇదేనా అని మండిపడింది. వాక్ స్వాతంత్ర్యం సంపూర్ణం కాదని, మతపరమైన వ్యాఖ్యలతో ఎవరి మనోభావాలను దెబ్బతీసేందుకు ఈ హక్కు వీలు కల్పించలేదని గుర్తుంచుకోవాలని హైకోర్టు హితవు పలికింది. 'ఆమెకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఒక వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యానించారు. వాక్ స్వాతంత్ర్యం ప్రతీ ఒక్కరికీ ఉంటుంది. కానీ, ఇతరులను బాధపెట్టేలా మాట్లాడమని దాని అర్థం కాదు. మన దేశం వైవిధ్యభరితమైనది. అనేక కులాల, మతాల ప్రజలు ఇక్కడ కలిసి జీవిస్తున్నారు. అలాంటప్పుడు మనం ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి' అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. శర్మిష్ఠకు మధ్యంతర బెయిల్ మంజూరుకు నిరాకరించిన కోర్టు... 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

'ఒకే దేశం... ఒకే భర్త' పథకం ప్రారంభించారా?

సిందూర్ ప్రచారాన్ని తప్పుపట్టిన పంజాబ్ సీఎం



చండీగఢ్: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో బీజేపీ నేతలు లూథియానాలో సిందూరాన్ని పంపిణీ చేయడాన్ని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ సింగ్ తప్పుపట్టారు. బీజేపీ ఇప్పుడేమైనా ఒకే దేశం, ఒకే భర్త పథకాన్ని ప్రారంభించిందా అని ఆయన ప్రశ్నించారు. మాన్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. లూథియానా పశ్చిమ అసెంబ్లీ స్థానానికి త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. అక్కడ బీజేపీ ప్రచారం నిర్వహిస్తోంది. ఈ నెల 19వ తేదీన ఎన్నిక జరగాల్సి ఉంది. ఒకవేళ బీజేపీ వాళ్లు సిందూరాన్ని పంపిణీ చేస్తే, మోదీ పంపిన సిందూరం పెట్టుకోవాలని భార్యను భర్త అడుగుతాడని, అంటే బీజేపీ ఏమైనా ఒక దేశం... ఒక భర్త పథకాన్ని ప్రారంభించిందా అని సీఎం మాన్ ప్రశ్నించారు. మాన్ వ్యాఖ్యలను బీజేపీ నేతలు తప్పుపట్టారు. ఆ వ్యాఖ్యలు సిగ్గుచేటు అని బీజేపీ నేత ప్రీత్‌పాల్ సింగ్ భలియావాల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆయన విమర్శిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి బీజేపీ సిందూరాన్ని పంచడం లేదని, ఉగ్రవాదులు మతం అడిగి మరీ హిందువులను చంపారని, అందుకే సిందూరం పేరు పెట్టారన్నారు. ఇండియన్ ఆర్మీని కించపరుస్తున్నారన్నారు. వీర నారీలను అవమానిస్తున్నారని తెలిపారు. త్యాగం, ప్రేమ, భక్తికి ఆ సిందూరం సంకేతంగా నిలుస్తుందన్నారు.

దిగొచ్చిన తమిళనాడు గవర్నర్

రెండు బిల్లులకు ఆమోదం

చెన్నై: సుప్రీంకోర్టు తీర్పుతో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి దిగివచ్చారు. తీర్పు వెల్లడించిన రెండు నెలల తర్వాత తమిళనాడు గవర్నర్ రవి మంగళవారం రెండు బిల్లులను ఆమోదించారు. గత నెల తమిళనాడు శాసనసభ ఈ బిల్లులను ఆమోదించింది. గవర్నర్ ఆమోదం సుప్రీంకోర్టు తీర్పు ఫలితమేనని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ ఆమోదం ఊహించనదేనని, తాము మళ్లీ కోర్టును ఆశ్రయిస్తామేమోనని గవర్నర్ భయపడుతున్నారని అన్నారు. ఈ రెండు బిల్లులు తమిళనాడులోని పట్టణ, స్థానిక సంస్థలకు వికలాంగుల నామినేషన్‌కు అవకాశం కల్పిస్తున్నాయి. ఈ బిల్లులు 12 వేలమందికి పైగా వికలాంగులను ప్రభావితం చేయడమే కాకుండా వారికి సాధికారత కల్పిస్తాయి. కాగా, గవర్నర్ 10 బిల్లులను అడ్డుకోవడం చట్టవిరుద్ధం, ఏకపక్షం అని ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొంది. బిల్లులను ఆమోదించడానికి కోర్టు తన ప్రత్యేక అధికారాలు వినియోగించింది. బిల్లులను అసెంబ్లీ రెండుసార్లు ఆమోదించిందని, గవర్నర్ వాటిని ఆమోదించి ఉండాల్సిందని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఆయన నిర్ణయాన్ని తోసిపుచ్చుతున్నట్లు వెల్లడించింది. 'అసెంబ్లీలో ఆమోదించిన 10 బిల్లులను గవర్నర్ సమ్మతి కోసం పంపించగా ఆయన తిరస్కరించారు. దీంతో అసెంబ్లీలో మళ్లీ ఆమోదించి పంపించారు. వాటిపై గవర్నర్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్రపతికి నివేదించామంటూ కాలయాపన చేస్తున్నారు. ఇలా చేయడం చట్టవిరుద్ధమే. అందుకే రెండోసారి పంపిన తేదీ నుంచే అవి గవర్నర్ సమ్మతి పొందినట్లు పరిగణిస్తున్నాం' అని ధర్మాసనం తీర్పు ప్రకటించింది.



6న చీనాబ్ రైల్వే బ్రిడ్జ్ ప్రారంభం

శ్రీనగర్: ప్రధాని మోదీ ఈ నెల ఆరో తేదీన జమ్మూకశ్మీర్‌లో పర్యటించనున్నారు. అదే రోజు ఆయన చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జ్‌ను ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 22వ తేదీన పహల్గాం ఉగ్రదాడి జరిగిన తర్వాత తొలిసారి ఆయన జమ్మూకశ్మీర్‌కు వెళ్తున్నారు. చీనాబ్ నదిపై రైల్వే బ్రిడ్జ్ ప్రారంభించే అంశాన్ని పీఎంవో సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ఉదంపూర్... శ్రీనగర్... బారాముల్లా రైల్వే లింక్ రూట్‌లో చీనాబ్ నదిపై బ్రిడ్జ్ నిర్మించారు. ప్రకృతి విపత్తులను తట్టుకునే రీతిలో దాన్ని దృఢంగా నిర్మించారు. నవ భారతానికి చెందిన శక్తికి, విజన్‌కు ఆ బ్రిడ్జ్ చిహ్నంగా నిలుస్తుందని మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. చీనాబ్ నదిపై సుమారు 358 మీటర్ల ఎత్తులో బ్రిడ్జ్ నిర్మించారు. ఇది పారిస్‌లోని ఈఫిల్ టవర్ కన్నా 35 మీటర్లు ఎత్తుగా ఉంటుంది.

ప్రభుత్వ ఉద్యోగులకు ఉగ్ర సంబంధాలు

ముగ్గురిపై జమ్మూకశ్మీర్ సర్కారు వేటు

శ్రీనగర్: ఉగ్రవాదులతో సంబంధాలు గల ప్రభుత్వ ఉద్యోగులపై జమ్మూకశ్మీర్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముగ్గురు ఉద్యోగులకు లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఓ పోలీస్ కానిస్టేబుల్ మాలిక్ ఇష్ఫాక్ నసీర్, స్కూల్ టీచర్ అజాజ్ అహ్మద్, ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ వసీం అహ్మద్‌ఖాన్ ఉన్నారు. జాతీయ భద్రతా ప్రయోజనాల రీత్యా వీరిని తొలగిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యవర్గం ఇప్పటివరకు 75 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించి... వారిని తొలగించింది. జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఉగ్రవాదులకు సహకరించే వారి కోసం వేట కొనసాగిస్తోంది. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉగ్రవాదులకు సానుభూతిపరులను కూడా గుర్తిస్తోంది. తాజాగా తొలగించిన ముగ్గురు ఉద్యోగులు ఉగ్రమూకకు సరకులు అందజేయడం, ఆయుధాల స్మగ్లింగ్, భద్రతా దళాలకు వ్యతిరేకంగా ముష్కరుల కార్యకలాపాలకు సాయం చేయడం వంటివి చేసినట్లు తేలింది. ఇక మాలిక్ ఇష్ఫాక్ 2007లో కానిస్టేబుల్‌గా బాధ్యతలు స్వీకరించాడు. అతడి సోదరుడు మాలిక్ ఆసిఫ్ పాక్‌లో శిక్షణ పొందిన లష్కరే ఉగ్రవాది. 2018లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో అతడిని మట్టుబెట్టారు. సోదరుడి మరణం తర్వాత ఇష్ఫాక్ ఉగ్ర కార్యకలాపాలు కొనసాగించాడు. ఉగ్రవాదులకు ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలను ఎక్కడ జారవిడవాలో పొజిషన్లను గుర్తించేవాడు. ఆ లొకేషన్ జీపీఎస్ కోఆర్డినేట్స్‌ను పాక్‌లోని హ్యాండ్లర్లకు పంపేవాడు. అక్కడికి చేరిన ఆయుధాలను గుర్తించి... జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులకు చేరవేసేవాడు. 2021లో తొలిసారి ఆయుధాలు, పేలుడు పదార్థాల చేరవేత కేసులో ఇతడికి లష్కరేతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు, అజాజ్ అహ్మద్ 2011లో విద్యాశాఖలో టీచర్‌గా ఉద్యోగంలో చేరాడు. అతడు హిజ్బుల్ ముజాహిదీన్ సంస్థకు ఆయుధాలు, ప్రచార సామగ్రిని స్మగ్లింగ్ చేసేవాడు. 2023లో పోలీసులు నిర్వహించిన సాధారణ తనిఖీల్లో అతడు, అతడి మిత్రుడు దొరికిపోయారు. అతడికి పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని హిజ్బుల్ ఆపరేటివ్ అబిద్ రంజాన్ షేక్ నుంచి ఆయుధాలు వచ్చినట్లు గుర్తించారు. గత కొన్నేళ్లుగా అతడు ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడు. హిజ్బుల్‌కు కశ్మీర్‌లోని పూంచ్‌లో నమ్మకమైన కార్యకర్తగా ఎదిగాడు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వసీమ్ అహ్మద్ ఖాన్ లష్కరే, హిజ్బుల్ సంస్థల కోసం పనిచేస్తున్నాడు. జమ్మూకశ్మీర్‌లో సంచలనం సృష్టించిన జర్నలిస్ట్ సుజాత్ బుఖారీ, ఆయన అంగరక్షకుడి హత్య కుట్రలో ఇతడి హస్తం ఉంది. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను ఘటనా స్థలం నుంచి తప్పించేందుకు ఇతడే సాయం చేసినట్లు గుర్తించారు. 2018లో ఆగస్టులో శ్రీనగర్‌లోని బట్‌మాలూ వద్ద ఉగ్రదాడిపై విచారణ సమయంలో ఇతడిని తొలిసారి అరెస్ట్ చేశారు.

ప్రభుత్వ చర్యలు సహేతుకమే

మద్రాస్ హైకోర్టు

చెన్నై: ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు గోప్యత హక్కు సంపూర్ణంగా పరిగణించడం కుదరదని పేర్కొంది. సమాజానికి కలిగే హానిని అడ్డుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని వ్యాఖ్యానించింది. ఇటీవల ఆన్‌లైన్ గేమ్‌లపై తమిళనాడు ప్రభుత్వం పలు ఆంక్షలు విధించడాన్ని సవాలు చేస్తూ గేమింగ్ కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ సుబ్రమణ్యం, జస్టిస్ రాజశేఖర్‌తో కూడిన ధర్మాసనం దీనిపై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు సహేతుకమైనవే అని పేర్కొంది. వినియోగదారుడి గోప్యత హక్కును సంపూర్ణంగా పరిగణించలేమని, ఈ విషయంలో ప్రజా ప్రయోజనాలను కూడా దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంటుందని అభిప్రాయం వ్యక్తంచేసింది. ఆన్‌లైన్ గేమ్‌లు సమాజానికి హాని కలిగించే విధంగా ఉన్నప్పుడు వాటి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చని తెలిపింది. పలు ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో 18 ఏళ్లలోపు వారు అర్ధరాత్రి నుంచి ఉదయం 5 గంటల వరకు రియల్-మనీ గేమ్‌లు ఆడకుండా... గేమింగ్‌పై తమిళనాడు ప్రభుత్వం ఇటీవల 'బ్లాంక్ అవర్' నిషేధాన్ని తీసుకువచ్చింది. ఇటువంటి గేమ్స్ ఆడడానికి వినియోగదారులు తమ ఆధార్‌ను అనుసంధానించి, తమ వయసును ధ్రువీకరించుకోవాలనే నిబంధనలు పెట్టింది. ఎక్కువగా 18 ఏళ్ల లోపు పిల్లలు ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతుంటారని, అవి వారికి వ్యసనంగా మారకుండా ఉండడానికే ఈ చర్యలు తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. దీనివల్ల వారి ఆరోగ్యంపైనా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నిబంధనలను గేమింగ్ కంపెనీలు న్యాయస్థానంలో సవాలు చేశాయి.

అగ్నివీరులకు పోలీస్ ఉద్యోగాల్లో

20 శాతం రిజర్వేషన్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అగ్నివీరులకు పోలీస్ ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో అగ్నిపథ్ పథకంలో భాగంగా నాలుగు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి కానిస్టేబుల్, కానిస్టేబుల్ పీఏసీ, మౌంటెడ్ పోలీస్, ఫైర్ మ్యాన్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వనుంది. 2026లో ఫస్ట్ బ్యాచ్ నియామకాలు జరగనున్నాయి. జనరల్,ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు. వీరికి మూడేళ్ల వరకు వయో సడలింపు ఉంటుంది. భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం 2022లో అగ్నిపథ్ పథకాన్ని ప్రారంభించి అగ్నివీర్ సైన్యం, నౌకాదళం, వైమానిక దళంలో నియమకాలు చేపట్టారు. సైనికుడిగా వారి పదవీకాలం నాలుగు సంవత్సరాలుగా నిర్ణయించారు.

ఒకటో తరగతి నుంచే సైనిక శిక్షణ

ముంబై: మహారాష్ట్రలో ఇకపై ఒకటో తరగతి నుంచే విద్యార్థులకు బేసిక్ మిలిటరీ శిక్షణనివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, శారీరక వ్యాయామం వంటివి పెంపొందించడానికి బేసిక్ మిలిటరీ శిక్షణ ఇస్తామని ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే పేర్కొన్నారు. దీనిద్వారా అత్యతసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే విషయంపై వారికి అవగాహన ఉంటుందన్నారు. దీనికోసం విద్యార్థులకు మాజీ సైనికులతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మాజీ సైనికులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. దీని ద్వారా విద్యార్థుల్లో దేశం పట్ల ప్రేమ పెరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారని విద్యాశాఖ మంత్రి తెలిపారు. దీన్ని అమలుచేయడానికి క్రీడా ఉపాధ్యాయులు, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ), స్కౌట్స్, గైడ్స్‌తో పాటు 2.5 లక్షల మంది విశ్రాంత సైనికుల సహాయం తీసుకుంటామని దాదా భూసే వివరించారు. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, అనంతరం భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈ ప్రతిపాదనను తీసుకువచ్చినట్లు తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

కాలుష్య నియంత్రణ మండలి పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రతి సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న పర్యావరణంపైన ప్రజలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నది. అందులో భాగంగా ఈ ఏడాది మేడ్చల్- మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ ద్వారా అవగాహన పోస్టర్‌ను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వారి ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) డి.విజయేందర్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి హరిప్రియ, ఏ.ఓ రామ్మోహన్, సహాయక పర్యావరణ శాస్త్రవేత్త జి.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు : కార్పొరేటర్

విశాలాంధ్ర, మల్కాజిగిరి : గౌతమ్‌నగర్ రైల్వే గేటు వద్ద ఆర్‌యుబి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ తెలిపారు. మంగళవారం గౌతమ్ నగర్ గేటు వద్ద ఆర్‌యుబీ నిర్మాణం కోసం ఎలక్ట్రికల్ ఆధునీకరణ నిధుల కోసం అంచనా వ్యయం సిద్ధం చేయాలని ఎలక్ట్రికల్ ఎస్సీ ప్రతిమను ఉప్పల్‌లో కలిసి వినతి పత్రం అందజేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఎస్సీ ప్రతిమ విద్యుత్ ఆధునీకరణకు అంచనా వ్యయం సిద్ధం చేస్తానని తెలిపారు. అనంతరం రైల్వే టెక్నీషియన్ షేక్ అన్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. నాయకులు మేకల రాము యాదవ్, నర్సింగ్, కిట్టు, కావాలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ

విశాలాంధ్ర, హైదరాబాద్ : భూమి హద్దులు, రాళ్ళు, చైన్ సిస్టం తదితర అంశాలపై సర్వేయర్లకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సర్వేధికారి వి.శ్రీరామ్ అన్నారు. మంగళవారం గోషా మహల్ స్టేడియంలో జరిగిన లైసెన్స్ సర్వేయర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో సర్వే శిక్షణ పొందుతున్న యువకులకు భూమి కొలతల పద్ధతులపై వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపెట్టిన లైసెన్స్ సర్వేయర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాంను గత వారం 26న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. ఈ ట్రైనింగ్‌లో భాగంగా, క్షేత్ర స్థాయిలో భూముల కొలతలు ఎలా చేయాలో, భూమి హద్దులు, రాళ్ళు, ఎలా ఉంటాయో, చైన్ సిస్టం ద్వారా భూమిని కొలతలు చేయువిధము గురించి శిక్షణ పొందుతున్న యువకులకు పలుసూచనలు ఇస్తూ, 'గొలుసు' ద్వారా భూమిని కొలతలు చేయు పద్ధతులను క్షేత్ర స్థాయిలో చూపించారు. తెలంగాణ పద్ధతులలో వుండిన 'నక్షా' హద్దురాళ్ళను, మోఖాపై ఎలా ఉంటాయో వివరించారు. ఈ కొలతలు చేయు పద్ధతులను బ్యాచుల వారిగా విభజించి వారికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమములో దేపు ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్, సర్వేయర్లు, విజయ్ కుమార్, రంగయ్యలు పాల్గొని యువకులకు శిక్షణ ఇచ్చారు.

శానిటేషన్ డ్రైవ్ ప్రారంభం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : గ్రేటర్ వ్యాప్తంగా చేపట్టిన ప్రీ మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్ మల్కాజిగిరి సర్కిల్‌లో చేపట్టారు. మంగళవారం ప్రీ మాన్సూన్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం నేరేడ్‌మెట్ డివిజన్‌లో చేపట్టారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా రోడ్లకు ఇరువైపులా ఇసుక మట్టి రాకుండా భూగర్భ డ్రైనేజీ నాలాలో మట్టి చేరకుండా, చెత్తాచెదారం తొలగించుట, పబ్లిక్ ప్లేసెస్ వద్ద పార్కుల వద్ద పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాన్ని చేపట్టారు. సర్కిల్ ఉప కమిషనర్ జి.రాజు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్లపైన భవన నిర్మాణ వ్యర్థ శిధిలాలను వేసినట్లయితే రూ.25 వేలు జరిమానా విధించబడుతుందని, రోడ్లపైన, కాలనీలలో ఓపెన్ ప్లాట్లలో మట్టి కుప్పలు వేసినట్లయితే వర్షాకాలం సందర్భంగా ఆ మట్టి డ్రైనేజీలోకి పోవుట ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉటుందన్నారు. అందుకు భవన నిర్మాణ శిధిలాలు తొలగించుటకు జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో టోల్ ఫ్రీ నెంబర్ 1800 120 1159 వారికి తెలియపరచినట్లయితే మీ భవన నిర్మాణ వ్యర్థలను తొలగిస్తారని, దీనికి కనీస చార్జీలు విధిస్తారని ఆయన తెలిపారు. వ్యర్థాల ద్వారా టైల్స్, ఫ్లేవర్ బ్రిక్స్ లాంటివి తయ్యారు చేయుటకు ఉపాయోగిస్తారని ఆయన తెలిపారు. శానిటేషన్ సూపర్‌వైసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రజలకు వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండాలన్నదే గ్రేటర్ లక్ష్యమన్నారు. మున్సిపల్ కార్పొరేటషన్ సూచనలు ప్రజలు పాటించి మెరుగైన సౌకర్యాలు సదుపాయాలు పొందాలని ఆయన తెలిపారు. నేటి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ద్వారా డిఫెన్స్ కావాలని నేరేడ్‌మెట్‌లో చేపట్టిన కార్యక్రమంలో సుమారు 50 మంది కార్మికులు, ముగ్గురు ఎస్ఎఫ్ఏ, జవాన్‌లు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఏలు నరేందర్, బాలమణి, రాజేశ్వరి, జవాన్‌లు జాన్సుందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి : మంత్రి

విశాలాంధ్ర, హైదరాబాద్ : మారుతున్న కాలానికి, పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థానానికి ఎదిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం బేగంపేట్ ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో బీసీ గురుకులాలు, హాస్టల్స్‌లో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. 593 మార్కులు తెచ్చుకున్న దుర్గాభవాని, 590 మార్కులు తెచ్చుకున్న శివాని, 580కి పైగా మార్కులు తెచ్చుకున్న 31 మంది, 570 పైన మార్కులు తెచ్చుకున్న 216 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వారి ప్రాంతానికి రాష్ట్రానికి పేరు తెచ్చారని అభినందించారు. బీసీ గురుకుల పాఠశాలలు, హాస్టల్‌లో లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారని మంచి బోధన అందిస్తున్న అధ్యాపకవర్గానికి అభినందనలు తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో 17 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే వందల్లోనే 570కి పైగా మార్కులు వచ్చాయని అన్నారు. మరింత మంది విద్యార్థులకు మార్కులు వచ్చేలా మీ కృషి పెరగాలన్నారు. ప్రోత్సాహం మీ సమస్యలుపై పరిష్కారం ప్రభుత్వం ఎప్పటికపుడు పూర్తి చేస్తుందన్నారు. మీ దగ్గర నుండి మంచి ఫలితాలు రావాలని, విద్యార్థులు పాస్ మాత్రమే కాకుండా మంచి ర్యాంకులు వచ్చేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావలసిన బెనిఫిట్స్ సంస్థ తరుపున ప్రభుత్వం నుండి ఎప్పటికప్పుడు ఇస్తున్నామని తెలిపారు. ఈ అకాడమీ నుండి 140 స్కూల్‌లలో 100 శాతం ఉత్తీర్ణత శాతం ఉందని ,మిగిలిన స్కూల్‌లో ఎందుకు తక్కువ వచ్చిందని రివ్యూ చేయాలన్నారు.మీరంతా పోటీ ప్రపంచంలో నెగ్గేలా విధానపరమైన మార్పులను అవగతం చేసుకోవాలి, ప్రభుత్వం పిల్లలకు ప్రోత్సాహం ఇచ్చి వాళ్ళకి మంచి పౌష్టిక ఆహారం అందించడానికి 40 శాతం మెస్ చార్జీలు పెంచాం. 200 శాతం కాస్మొటిక్ చార్జీలు ప్రభుత్వం పెంచిందన్నారు. మీ దగ్గర నుండి రైసింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలి. రేపటి తెలం గాణ భవిష్యత్తుకి మీరు మార్గదర్శకులుగా కావాలి, మన పిల్లలు దేశ అంతర్జాతీయ స్థాయిలో ఎదిగే స్థాయికి ఎదగాలని,స్టడీస్, ఆటలు, ఇతర నైపుణ్యాల్లో మంచి ప్రతిభ కనబరచాలని భవిషత్ లో మనం ఏం కావాలని అనుకుంటున్నామో లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆదిశగా ముందుకు పోవాలి విద్యా కే పరిమితం కాకుండా సామాజికంగా అన్ని రంగాల్లో ముందుడాలి గురుకులాల్లో ట్రెయిన్డ్ టీచర్స్ మంచి పరీక్షలు రాసి ఉద్యోగంలో వచ్చిన వారు ఉన్నారు. ఏ గురుకులాల్లో కూడా ఖాళీ స్థానాలు ఉండకూడదు.. అన్ని స్కూల్ లు 100 సీట్లు నిండాలని,అన్ని గురుకులాలు పోటీ పడి మాకు అందులోనే సీటు రావాలని విధంగా ఎదగాలి. చదువు కుటుంబాన్ని భవిష్యత్తును మారుస్తుందని, పిల్లల ఉజ్వల భవిష్యత్తు నిర్మాణం కావాలంటే వారి చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 593 మార్కులు తెచ్చుకున్న దుర్గాభవాని, 590 మార్కులు తెచ్చుకున్న శివానిలకు ఇతర విద్యార్థులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదం డ్రులకు అధ్యాపకులకు మంత్రి శాలువా, మెమెంటో, సర్టిఫికెట్‌లతో మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల సెక్రటరీ సైదులు, ఎమ్బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మల్లయ్య భట్టు, సిఈఓ అలోక్ కుమార్, మద్దిలేటి, విశ్వాం ప్రసాద్ లాల్, డాక్టర్ జి.తిరుపతి, వసతి గృహాల అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ జాగృతి మహాధర్నా

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాళేశ్వరం కమిషన్ బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం.కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులకు నిరసగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించడం జరుగుతుంది. బుధవారం కాళేశ్వరం కమిషన్ నోటీసులపై ఇందిరా పార్క్ దగ్గర తెలంగాణ జాగృతి మహాధర్నా చేపట్టాలని జాగృతి అధ్యక్షురాలు కవిత ఇప్పటికే పిలుపు నిచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మహాధర్నా చేపట్టనున్నారు. గోదావరి నీళ్లను ఒడిసి పట్టి నెర్రెలు బారిన తెలంగాణ నేలను సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా నోటీసులు ఇవ్వడంపై ఈ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు కవిత తెలిపారు. తెలంగాణ జాగృతి తలపెట్టిన మహాధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని, కేసీఆర్ అభిమానులు, జాగృతి శ్రేణులకు అమె పిలుపునిచ్చారు. ప్రాణహిత - చేవెళ్లను కాళేశ్వరం ప్రాజెక్టుగా ఎందుకు రీడిజైన్ చేయాల్సి వచ్చింది. కాళేశ్వరం అందుబాటులోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి కలిగిన ప్రయోజనాలు.. కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పడావు పెట్టడంతో ఏటా యాసంగి సీజన్ లో రైతాంగానికి జరుగుతోన్న నష్టం.. కాళేశ్వరం కమిషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తోన్న క్షుద్ర రాజకీయాలపై ధర్నాలో వక్తలు మాట్లాడనున్నట్లు సమాచారం.

'పునాస' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సాహిత్య అకాడమీ చేస్తున్న కార్యక్రమాలలో 'పునాస' పత్రికను ప్రచురించడం గొప్ప విషయం అనీ, అందులో తెలంగాణ ప్రముఖులైన కొందరి శతజయంతి సందర్భంగా ప్రత్యేక సంచికలు తీసుకురావడం చాలా బాగుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన ఆచార్య బిరుదురాజు రామరాజు ప్రత్యేక సంచిక 'పునాస'ను ఆవిష్కరించారు. రామరాజు లాంటి గొప్ప పండితుడు, పరిశోధకుడు తెలంగాణలో జన్మించడం ఈ నేల చేసుకున్న అదృష్టం అన్నారు. గత సంవత్సరము దాశరథి కృష్ణమాచార్యపైన ఓ ప్రత్యేక సంచికను ముద్రించినట్లుగానే ఇప్పుడు బిరుదురాజు రామరాజుపైన ఈ ప్రత్యేక సంచికను ప్రచురించినందుకు, ఇలాంటి సాహిత్య పరమైన అనేక కార్యక్రమాలు చేయడంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి కృషి ఎంతో ఉందని ఈ సందర్భంగా అయను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, కవి యాకుబ్, దినకర్, మరికొందరు కవి మిత్రులతో పాటు సాహిత్య అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదోడి లో గల జిహెచ్ఎంసీ వార్డ్ కార్యాలయంలో శేరిలింగంపల్లి మండల్ తహసీల్దార్ , డిప్యూటీ కలెక్టర్ వెంకా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పీఏసీ చైర్మెన్ అరేకపూడి గాంధీ, హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్, శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం వంటి వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామ గ్రామనా ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నారని ప్రతిఒక్కరూ క్షేత్రస్థాయిలో వారికి ఉన్నటువంటి సమస్యను సంబంధిత అధికారులకు తెలిపినట్లైతే సమస్యను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారన్నారు. ప్రతి రైతుకు న్యాయం జరిగే విధంగా భూ భారతి చట్టం రూపొందించారన్నారు. భవిష్యత్తులో ఏ రాష్ట్రంలో రెవెన్యూ చట్టం తయారు చేయాలన్న ఆదర్శంగా ఉండే విధంగా భూ భారతి చట్టాన్ని ప్రజా ప్రభుత్వం తయారు చేసిందని, దేశానికి ఆదర్శంగా భూ భారతి చట్టం నిలుస్తుందని అన్నారు. రాష్ట్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టాన్ని రాజకీయాలకతీతంగా అందరూ వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ చంద్ర రెడ్డి, రెవెన్యూ డిపార్ట్మెంట్ స్టాఫ్, సీనియర్నాయకులు హనుమంత్ నాయక్, తిరుపతి, శేఖర్, సుమన్, ప్రసాద్,రాజు, శ్రీను,గోవింద్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : భూ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులందరు తమ తమ గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో ఆర్జీలను రెవెన్యూ అధికారులకు అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి రైతులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా నేటి నుండి నిర్వహించే రెవెన్యూ సదస్సులలో భాగంగా మంగళవారం ఘట్‌కేసర్ మండలంలోని ఎదులాబాద్, మార్గాతిగూడ, శామీర్‌పేట్ మండలంలోని పోతాయిపల్లి గ్రామాలలోని వార్డ్ కార్యాలయంలో భూ భారతి రెవెన్యూ సదస్సును అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు ఏవిధంగా ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారని అక్కడి తహాశీల్దార్‌ను, రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆర్జీలను నిర్దేశిత కోడ్‌లలో నమోదు చేయాలని, రైతులకు సంబందిత డాక్యూమెంట్లను జత చేయాలని తెలియజేయాలన్నారు. ఆర్జీదారులతో సౌమ్యంగా వ్యవహరించాలని, చొరవతీసుకొని వారికి అవసరమైన సలహాలు, సూచనలను అందించాలన్నారు. సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సమస్యలను క్షుణంగా పరిశీలించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆయన సూచించారు. ఈ సదస్సుల ద్వారా రెవెన్యూ రికార్డ్‌లను సక్రమంగా నిర్వహించుటకు అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కారంలో ఎలాంటి అలస్యం చేయకుండా వెను వెంటనే పరిష్కరించి రైతులకు ప్రభుత్వంపై భరోసా కల్పించి, వారి ఆత్‌విశ్వాసం పెంపొందించాలన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించాలన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి అయినట్లు దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకోని, ప్రభుత్వ భూముల పరిరక్షణకై పాటుపడాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ అధికారులకు సష్టం చేశారు. ఆర్జీలు సమర్పించిన ప్రతి దరఖాస్తుదానికి రశీదులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్, శామీర్‌పేట్ తహాశీల్దార్లు రజిని, యాదగిరి రెడ్డి, డిప్యూటి తహాశీల్దార్ భాస్కర్, ఆర్ఐలు కావ్య, సాయిరామ్, సిబ్బంది అధిత్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ పోరాటాల ఫలితమే అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంపు

విశాలాంధ్ర, హైదరాబాద్ : రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ జి.నెం.8ని విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ కుమారి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ లక్ష నుండి 2 లక్షలకు, హెల్పర్స్‌కు 50 వేల నుండి లక్షకు పెంచుతూ, 60 సంవత్సరాలు దాటిన వారికి అనారోగ్యం ఇతర కారణాల వల్ల వాలంటరీ రిటైర్మెంట్ తీసుకునే అవకాశం, ఆసరా పెన్షన్ సౌకర్యం కల్పిస్తూ మే 30న జి.ఓ.నెం.8ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇది తెలంగాణ రాష్ట్రంలో ఎఐటియుసి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాల ఫలితమేనని నందూరి కరుణ కుమారి అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, గ్రాట్యూటీ చెల్లించాలని, పెన్షన్, బీమా పథకం, ఇయస్ఐ, పిఎఫ్ తదితర అనేక డిమాండ్లపై రాష్ట్ర వ్యాపితంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మినీ టీచర్లు ఎఐటియుసి ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ జి.ఓ.లో 2024 జులై 1 నుంచి వర్తింపచేస్తామని ఇచ్చిన హామీలను ఈ జిఓలో పొందుపరచలేదని, దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు అన్యాయం జరుగుతుందన్నారు. ఆసరా పెన్షన్ కాకుండా ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు 24 రోజుల సమ్మె కాలంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, సమ్మెకాలపు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 5 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రా లకు పంపించే విధంగా ప్రభుత్వ చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కూరమైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయవలసిందే అని, కొత్త కార్మిక చట్టాలు కార్మికుల ప్రాథమిక హక్కులను కాల రాస్తున్నవని ఐఎన్‌టియుసీ జాతీయ, రాష్ట్ర నేతలు ఆరోపించారు. కార్మికుల హక్కులను నిర్మూలించడానికి నిరంకుశ మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఎదుర్కోవడానికి దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తామని వెల్లడించారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శులు బాబర్ సలీమ్ పాషా, బి.వెంకటేశ్వరరెడ్డి, జాతీయ కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వై. నాగన్నగౌడ్, అదిల్ షరీఫ్, వి. భాస్కర్‌రెడ్డి, ఉమా నాగేంద్రమణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్ మోహన్‌రెడ్డి, విజయ్ కుమార్ యాదవ్, సోలొమన్ రాజు, సురేష్, నరసింహారెడ్డి తదితరులు మాట్లాడారు. బాబర్ సలీమ్ పాషా మాట్లాడుతూ కొంతమంది నకిలీ కాంగ్రెస్ నేతలు ఐఎన్‌టియుసి ముసుగు వేసుకొని కార్మిక నాయకులుగా చెలామణి అవుతున్నారని, కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని, ఐఎన్‌టియుసి పేరును దుర్వినియోగం చేస్తున్నారన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్త నాలుగు కోడ్‌లు తీసుకవచ్చి కార్మికుల సామాజిక రక్షణను దెబ్బతీసిందని మండిపడ్డారు. ఆర్.డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కొందరు దుర్మార్గులు ఐఎన్‌టియుసి జండా, గుర్తును దుర్వినియోగం చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, తగిన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అలాగే కార్మిక వర్గంతో తగిన బుద్ధి చెప్పిస్తామని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పై కేసు నమోదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత రెడ్యానాయక్‌పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. రెడ్యానాయక్‌తో సహా 17 మందిపై కేసులు పెట్టారు. సోమవారం డోర్నకల్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఘర్షణకు దిగారు. ఈ ఘటనలోనే పోలీసులు బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే కారణంతో డోర్నకల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. సోమవారం డోర్నకల్ పట్టణంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా ర్యాలీ నిర్వహించారు. దీంతో డోర్నకల్‌లో ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే రెండు పార్టీల్లోని నేతలనూ నియంత్రించేందుకు పోలీసులు ఇబ్బంది పడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల ఘర్షణతో డోర్నకల్ నియోజకవర్గం మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. పోలీసుల సూచనలు అతిక్రమించడంతో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమైందని డోర్నకల్ పోలీసులు తెలిపారు. విచారణ అనంతరం మరికొంతమందిపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. పోలీసు కేసులతో డోర్నకల్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రతిఒక్కరిని గుర్తుపెట్టుకుంటానని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన తర్వాత అందరి సంగతి తెలుస్తానని రెడ్యానాయక్ కాంగ్రెస్ నేతలను హెచ్చరించారు. రాజకీయ కక్షల్లో భాగంగానే తమ పార్టీ నేతలపై పోలీసులు కేసు పెట్టారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. తమ నేతలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. అయితే ఇలాంటి పరిణామాలు ఇంకా కొనసాగితే డోర్నకల్ రాజకీయాలు మరింత సంక్లిష్టంగా మారే ప్రమాదం ఉందని పలువురు అంటున్నారు.

జలమండలి ఉద్యోగులు పదవీ విరమణ

విశాలాంధ్ర, హైదరాబాద్ : జలమండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న 13 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. వీరందరిని ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

మృతి బాధాకరం : శ్రీనివాస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : వేములవాడ రాజన్న ఆలయంలో ఇటీవల కోడెలు మృతి చెందిన విషయం తెలిసిందే.. ఈ సంఘటన తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది. భక్తులు ఇచ్చిన కోడెలు మృతిచెందడంపై అనేక అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే ఈ ఘటనపై వెంటనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కోడెల రక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కోడెలు మృతిచెందిన ఘటనపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. మంగళవారం సీఎల్పీ మీడియా పాయింట్‌లో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయంలో కోడెల మృతిపై సమీక్ష చేశామన్నారు. వర్షాకాలం వ్యాధుల వల్ల కోడెలు చనిపోవడం బాధాకరమని తెలిపారు. కొందరు భక్తులు పాలు కూడా మరువని కోడెలను తీసుకువస్తున్నారని చెప్పారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని విస్తరణ చేస్తున్నామన్నారు. పాత ఆలయం, పాత మండపాలు యధావిధిగా ఉంటాయని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందని ఎమ్మెల్సీ కవిత లేఖలో పేర్కొందని ఆది శ్రీనివాస్ తెలిపారు. పొత్తు పెట్టుకోకుండా ఉండటానికి బీఆర్ఎస్ ఉండాలి కదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కేడర్‌ను మభ్య పెట్టేందుకే మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కలిసి కాంగ్రెస్‌ని దొంగదెబ్బ తీయాలని చూస్తున్నారని ఆరోపించారు. కవిత చెప్పిన దెయ్యాలు ఎవరో హరీష్‌రావు సమాధానం చెప్పాలని అన్నారు. పార్టీ ఇంటర్నల్ విషయాలు బయటకి చెప్పిన కవితపై చర్యలు తీసుకుంటారా అని నిలదీశారు. మాజీ సీఎం కేసీఆర్‌కి అధికారం లేకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కూడా చేయరా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నల వర్షం కురిపించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పేర్కొన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు, యువకులు, వివిధ కాలనీల సభ్యులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీ పూర్ రాజుని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి వివరించి వాటిని పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారాకి అతి త్వరలోనే తగు మార్గం చూపుతామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం పలు ప్రాంతాల్లో నిర్వహించబోయే శు భకార్యక్రమాల వేడుకల్లో ముఖ్య అతిథులుగా హాజరు కాగలరని కోరుతూ పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

ల్యాండ్ ఫూలింగ్‌పై మంత్రి శ్రీధర్ బాబుకు వినతి

విశాలాంధ్ర, మేడిపల్లి: రాష్ట్ర ఐటీ, రాష్ట్ర శాసన సభ వ్యవహారాల శాఖ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు దుద్దిల శ్రీధర్ బాబుని మంగళవారం మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మాలారెడ్డితో కలసి బోడుప్పల్ సర్వే నెంబర్స్ 63/2 నుండి 63/25 బోడుప్పల్ దళితుల Ac 336 ను ల్యాండ్ ఫులింగ్ ఆగిపోయినా విషయాన్ని మంత్రికి తెలియచేశారు. మంత్రి వెంటనే స్పందించి హెచ్.ఎం.డీ.ఏ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కి వెంటనే ల్యాండ్ ఫూలింగ్ చేసి దళితులకు ఎకరాకు 600 గజాల చొప్పున ఇవ్వాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. కోర్ట్ కేసులు తీసివేయాలి అని సంబంధిత అధికారుకకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. దళితుల పక్షాన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా ఎమ్మెల్యే మల్లా రెడ్డికి ధన్యవాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి, అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షులు మీసాల కృష్ణా, కె. నర్సిహ చిన్నిగాళ్ల కుమార్, అంబేద్కర్ సంగం ప్రధాన కార్యదర్శి చంటి శ్రీనివాస్, అంబేద్కర్ సంఘము ఉప అధ్యక్షులు ఉప్పరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ ఇంపాక్ట్ పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రఖ్యాత టెడ్ ఎక్స్ స్పీకర్ నాయకత్వ కోచ్ కురువ వెంకటరమణ మూర్తి జూన్ 5న హైదరాబాద్‌లో తన ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త పుస్తకం ఇన్‌స్పైర్. ఇంపాక్ట్‌ను ఆవిష్కరించనున్నారు. ఇగ్నైట్ లీడర్‌షిప్ ఈజ్ ఎ స్టోరీ, నాట్ ఎ టైటిల్ ఈ పుస్తకం 21వ శతాబ్దానికి నాయకత్వంపై ఒక నమూనా-మార్పు దృష్టిని అందిస్తుంది. ఇది సోపానక్రమంలో కాదు, మానవ కథలో పాతుకుపోయింది. ఓఐయు స్టోరీటెల్లింగ్ ద్వారా ప్రచురించబడిన ఈ పుస్తకం, మూర్తి యాజమాన్య లీడర్‌షిప్ స్టోరీటెల్లింగ్ సిస్టమ్‌ను పరిచయం చేస్తుంది. ఇది నాలుగు సిగ్నేచర్ ఫ్రేమ్‌వర్క్‌లలో ఆధారపడి ఉంటుంది. మొదటిసారి స్థాపకుల నుండి ఫార్చ్యూన్ 500 నాయకుల వరకు ఎవరైనా శబ్దం నుండి కాకుండా కథనం నుండి నాయకత్వం వహించడానికి సాధికారత కల్పిస్తాయి. మూర్తి ఇటీవల మే 30న ఢిల్లీలో ఒక శక్తివంతమైన టెడ్ ఎక్స్ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ప్రపంచం బిరుదులను అనుసరించదు. ఇది సత్యాన్ని అనుసరిస్తుంది... అత్యంత శక్తివంతమైన నిజం మీ కథ - జీవించబడిరది... అరువు తెచ్చుకోబడలేదు" అని వివరించారు.

తన్నీరు హరీష్ కాదు.. అబద్దాల హరీష్.. : అన్వేష్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వానాకాలం సీజన్ సమయంలో అడ్డగోలు ఆరోపణలతో ప్రభుత్వంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శలు చేయడం సరికాదని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. రైతులను అయోమయానికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన పేరు తన్నీరు హరీష్ రావుకాదని అబద్దాల హరీశ్‌రావు అని ఎద్దేవా చేశారు. తెలంగాణ రైతులకు జిలుగు, జనుము అందించడంలో ప్రభుత్వంపై హరీశ్‌రావు చేసిన ఆరోపణలు అర్థరహితమన్నారు. ప్రభుత్వం రైతుల కోసం ముందస్తుగానే పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చిందని సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ వానకాలం 2025 సీజన్ కి తెలంగాణ రాష్ట్రంలో అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పచ్చిరొట్ట విత్తనాలను 88,000 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు గుర్తుచేశారు. తెలంగాణ వ్యాప్తంగా జీలుగ - 82,058 క్వింటాళ్లు, జనుము - 5,836 క్వింటాళ్లు, పిల్లిపెసర - 106 క్వింటాళ్లు, జిల్లాల వారీగా అవసరం మేరకు అందుబాటులో వున్నాయని వివరించారు. అందుబాటులో ఉంచిన పచ్చిరొట్టల నుండి ఇప్పటివరకు రైతులు 60165 క్వింటాళ్లు ఉపయోగించుకున్నారని చెప్పారు. అలాగే ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఇంకా పచ్చిరొట్ట విత్తనాలు 27835 క్వింటాళ్లు నిల్వ వున్నాయన్నారు. అందులో జీలుగు 24381 క్వింటాళ్లు, జనుము 3352 క్వింటాళ్లు, పిల్లిపెసర 102 క్వింటాళ్లు ఉన్నట్లు తెలిపారు. ఇంకా రైతుల అవసరం మేరకు పచ్చిరొట్ట విధానాలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా వున్నదని, అనవసరపు ఆరోపణలు చేయకుండా వాస్తవాలను హరీష్ రావ్ తెలుసుకోవాలన్నారు.

పార్కు పనుల పరిశీలన

విశాలాంధ్ర, హైదరాబాద్ : వాకర్స్ సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన పనులను వినూత్నంగా చేపట్టి పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కేబీఆర్ పార్కులో చేపట్టిన పనులను పరిశీలించారు. లైసెన్స్ తీసుకున్న పెట్ డాగ్స్‌ను మాత్రమే పార్కులోకి తీసుకురావాలని కమిషనర్ ఆదేశించారు. కేబీఆర్ చుట్టూ హెచ్ సిటీ ద్వారా చేపట్టే ఫ్లైఓవర్లు, అండర్ పాసులు కోర్టు ఆదేశాల మేరకు నిర్మిస్తున్నారా అంటూ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను వివరణ కోరగా, సెన్సిటివ్ జోన్ పరిధిలోనే పనులు చేపట్టినట్లు ప్రాజెక్టు ఇంజనీర్లు కమీషనర్‌కు వివరించారు. కమిషనర్ వెంట అడిషనల్ కమిషనర్ సుభద్ర దేవి, డిసి సమ్మయ్య, ప్రాజెక్టు, ఎస్.ఈ శ్రీ లక్ష్మీ, ఈ.ఈ నాయక్, డిప్యూటీ ఈ.ఈ హరీష్, సర్కిల్ ఈఈ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి సజావుగా సాగాలి : సీఎండీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : రానున్న వర్షాకాలంలో ఓపెన్ కాస్ట్ గనులలో బొగ్గు ఉత్పత్తి ఏమాత్రం కుంటుబడకుండా తగు జాగ్రత్త చర్యలను ఇప్పటినుంచే చేపట్టాలని, వర్షపు నీటిని తోడి బయటకు పోయడానికి తగినన్ని పంపులు సంసిద్ధంగా ఉంచుకోవాలని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండి ఎన్.బలరామ్ అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లను కోరారు. కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో ఆయన మంగళవారం సింగరేణి డైరెక్టర్లు, అన్ని ఏరియాలో జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ జనరల్ మేనేజర్లతో ఉత్పత్తిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సుదీర్ఘంగా సాగిన ఈ సమీక్షలో ఆయన ఏరియాల వారీగా ఉత్పత్తిని సమీక్షించారు. ఈ ఏడాదికి నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలంటే వర్షాకాలంలో కూడా నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా సాధించాలని కోరారు. వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనకు రోజుకు కనీసం 2.15 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.45 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరపాలని ఆదేశించారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలకు ఏరియాల వారీగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నాణ్యత ప్రమాణాలు బాగా పెంచాలని కోరారు. నాణ్యతలేని బొగ్గును వినియోగదారులు స్వీకరించడం లేదని కాబట్టి కిందిస్థాయి నుంచి పై అధికారుల వరకు నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉద్యోగులు యంత్రాలతో షిఫ్ట్ లో పూర్తి పనిగంటలు పనిచేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండే వారిని అవసరమైతే తొలగించాలని కూడా ఆయన ఆదేశించారు. గైర్హాజరు శాతాన్ని గణనీయంగా తగ్గించాలని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఓవర్ బర్డెన్ తొలగింపు పూర్తి అయితేనే బొగ్గు ఉత్పత్తి సజావుగా సాగుతుంది కాబట్టి ఆయన ఓవర్ బర్డెన్ కాంట్రాక్టర్లతో కూడా ఈ సందర్భంగా మాట్లాడారు. తగినన్ని యంత్రాలను పనిలో పెట్టి లక్ష్యాల మేర రోజువారీగా ఓవర్ బర్డెన్ తొలగించాలని సూచించారు. భూగర్భగనుల్లో నష్టాలను తగ్గించడం కోసం నిపుణుల బృందంతో త్వరలో పరిశీలన జరపనున్నట్లు తెలిపారు. శాంతిఖని, అడ్రియాల లాంగ్ వాల్ గనిలో ఈ బృందం ముందుగా పరిశీలన జరుపుతుందన్నారు. నాణ్యత పెంపుదల చర్యలో భాగంగా సత్తుపల్లి వద్ద ఒక కోల్ వాషెరీ ఏర్పాటుకు గల అవకాశాలను కూడా పరిశీలించాలని కోరారు. కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో డైరెక్టర్ ఈ అండ్ ఎం డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ మరియు పర్సనల్ కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ యస్.డి.ఎం.సుభాని, జనరల్ మేనేజర్ సి.పి.పి. ఎ.మనోహర్, ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

పరిజ్ఞానం పెరిగినా క్యాన్సర్ మరణాలు తగ్గడంలేదు :ఈటల

విశాలాంధ్ర, మల్కాజిగిరి : అల్వాల్, కుషాయిగూడ పి.హెచ్.సిలకు క్యాన్సర్ పరీక్షా పరికరాలు మహతి ఫౌండేషన్ సహకారంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అందించిందది. మంగళవారం అల్వాల్‌లో నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... ఆరోగ్య శాఖతో తనుకు చాలా అనుబంధం ఉందని, దీంట్లో ఎన్ని బాధలు ఉంటాయో తాను కళ్ళారా చూశానన్నారు. ఈ శాఖ ఎంత బలపడితే, ఎంత గొప్పగా పని చేస్తే ప్రజలకి పేదరికం నుంచి బయటపడే ఆస్కారం ఉంటుందన్నారు. వైద్యానికి అయ్యే ఖర్చు అనుకోకుండా వచ్చే ఖర్చని, తల్లి ప్రేమకు ధనిక, పేద తేడా ఉండదని, ఎంత టెక్నాలజీ పెరిగిన క్యాన్సర్ మరణాలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. నవరత్నాలలో మీ కంపెనీ ఉన్నందుకు గర్వపడుతున్నానని, ప్రజల కోసం ముందుకు వచ్చి డబ్బులు ఇస్తున్నందుకు సంతోషమన్నారు. గరీబోళ్ల అడ్డా అంటే మల్కాజిగిరి అని ఎవరు పొట్ట చేత పట్టుకొని వచ్చిన మొదట ఉండేది మల్కాజిగిరిలోనేనని అందుకే దీన్ని మినీ ఇండియా అంటారన్నారు. హైదరాబాద్ అనగానే హైటెక్ సిటీ చూసి మనం మురిసిపోకూడదని, దాని పక్కనే దుఃఖాలతో నిండిన బస్తీలు ఉంటాయని, వాళ్లకి మనం అండగా ఉండాలన్నారు. కొంతమంది తాగి ఆరోగ్యాన్ని చెడగొట్టుకోవచ్చు కానీ పేద కుటుంబాలు అప్పుల పాలు కావడానికి ఒక ప్రధానమైన కారణం వైద్యమని ఆయన తెలిపారు. ఈ జిల్లా మొత్తంలో ఏ హాస్పిటల్లో ఏ సౌకర్యాలు కావాలో నాకు ఇవ్వండి తప్పకుండా మీకు ఇప్పించే ప్రయత్నం చేస్తానన్నారు. కొత్తగా మంత్రి అయిన నాడు ఎంఎన్‌జే క్యాన్సర్ ఇన్స్టిట్యూట్లో , నిమ్స్‌లో పెట్ స్కాన్ లేదని, నేను 25 కోట్లతో రెండు పెట్ స్కాన్లు తీసుకొచ్చి పెట్టానని, మీలాంటి ఒక సంస్థను రిక్వెస్ట్ చేసి 17 కోట్లతో కేంద్ర సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. వైద్యం నారాయణనో హరి, డాక్టర్ల జీతాలు ఏంటి, మీ సమస్యలు ఏంటి, మీ కష్టాలు ఏంటో నాకు తెలుసునన్నారు. డాక్టర్లకు జీతాలు అతితక్కువ ఉంటున్నాయని, డాక్టర్స్‌కి కడుపునిండా జీతం ఇచ్చి పని చేయించుకోండని, ఎన్నో వేల కోట్లు దేనికో ఖర్చు పెడుతున్నాము కానీ ఈ శాఖకు ఖర్చు పెడితే నష్టం లేదన్నారు. ఆశావర్కర్లకి జీతాలు సరిగాలేవు. మీకు కూడా మంచి రోజులు వస్తాయన్నారు. తనకు వేరే వ్యాపకం లేదని, సమస్యలు తన దృష్టికి తీసుకొని రండి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తానని, ఎంత పని చేసినా మీ రుణం తీర్చుకోలేనిది అని ఈటల రాజేందర్ అన్నారు. ఈ కారిక్రమంలో ఆల్వాల్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, ఐఓసిఎల్, సిజిఎం, ఏఆర్వి బద్రీనాథ్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఉమా గౌరీ, నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ మెంబెర్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ రమేష్, శేఖర్ రెడ్డి, జిల్లా బీజేపీ జనరల్ సెక్రెటరీ మాణిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు జన్మదిన వేడుక

విశాలాంధ్ర - అమనగల్లు: బీఆర్ఎస్ పార్టీ అగ్ర నాయకుడు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పుట్టినరోజు వేడుకలను కడ్తాల్ మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ శ్రీశైలం రహదారి పక్కన కడ్తాల్ పాల బూత్ వద్ద బి ఆర్ఎస్ శ్రేణులు బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా,రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి, మాజీ వైస్ ఆనంద్, ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు బి ఆర్ఎస్ కార్యకర్తలకు కేక్ ను పంచిపెట్టి అనంతరం కడ్తాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. హరీష్ రావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్ గుప్తా, చంద్రమౌళి, రమేష్, సాయిలు, వినోద్, శారదా పాండు, రమేష్, బాలకృష్ణ, యాదయ్య, గోపాల్, లాయక్ అలీ, కొప్పు కృష్ణ, సిద్ధి గారి సురేష్, రాయచోటి సురేష్, అంజి, సోషల్ మీడియా కన్వీనర్ సాయి, రవి, మూడ రవి, గోపాల్, మహేష్, ఉద్యమకారుడు లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఉద్యోగ ప్రయోజనాలను పెంచడంపై హర్షం

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ఉద్యోగ ప్రయోజనాలను పెంచడంపై ఐ.ఎన్.టి.యు.సి అనుబంధ తెలంగాణ రాష్ట్ర ఇందిరా ప్రియదర్శిని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. హైదరాబాద్, నారాయణగూడ చౌరాస్తాలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.8 తీసుకొచ్చి అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ఉద్యోగ ప్రయోజనాలను పెంచడంపై ఆనందం వ్యక్తం చేస్తూ యూనియన్ నేతలు సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం చేసారు. ఈ సందర్భంగా ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్న గౌడ్ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ఏ ప్రయోజనాలు లేక తక్కువ జీతాలతో అనేక సమస్యలను ఎదురుకుంటున్నారని గుర్తించి సీఎం రేవంత్ రెడ్డి అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ లక్ష నుండి 2 లక్షలకు, హెల్పర్స్‌కు 50 వేల నుండి లక్షకు పెంచుతూ, 60 సంవత్సరాలు దాటిన వారికి అనారోగ్యం ఇతర కారణాల వల్ల వాలంటరీ రిటైర్మెంట్ తీసుకునే అవకాశం, మరియు ఆసరా పెన్షన్ సౌకర్యం కల్పిస్తూ నిర్ణయం తీసుకొని జీవో నెం.8 విడుదల చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం లో ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.విజయ్ కుమార్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కొత్త సీతారాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రణీత్ కుమార్, యూనియన్ అధ్యక్షురాలు, గండు అన్నపూర్ణ, నేతలు ఒద్దిరాజు శ్రీదేవి, శివరాణి, యాదమ్మ, ఖమర్ తహెరా పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్ ఏర్పాటును అడ్డుకున్న జర్నలిస్టులు

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం చందానగర్‌లో కేటాయించిన భూమిలోకి అక్రమంగా ప్రవేశించిన కబ్జాదారులు. స్థలం చుట్టూ రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగించారు. స్థలం మధ్యలో నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం విద్యుత్ శాఖ అధికారులు స్తంభాల నిర్మాణ పనులు చేపట్టాగా, సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి జర్నలిస్టులు పనులను అడ్డుకొని విషయాన్ని మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లారు. ఫెన్సింగ్ కూల్చివేతపై ఎమ్మెల్యే గాంధీ, చందానగర్ డిప్యూటీ కమిషనర్, చందానగర్ కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం చందానగర్‌లోని సర్వే నెంబర్ 174 లో 1 ఎకరా స్థలాన్ని గతంలోనే కేటాయించిన విషయం తెలిసిందే. రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించి, పొజిషన్ హ్యాండ్ ఓవర్ చేసిన ఈ స్థలం చుట్టూ జర్నలిస్టులు ఖడీలు ఏర్పాటు చేసి రక్షణ కోసం ఫెన్సింగ్ వేశారు. సోమవారం కొంతమంది కబ్జాదారులు ఫెన్సింగ్ కూల్చివేసి జర్నలిస్టుల ఇళ్ల స్థలంలోకి అక్రమంగా ప్రవేశించారు. దీంతోపాటు ఈ స్థలానికి పక్కనే ఉన్న ప్రైవేట్ స్థలంలో ఉన్న విద్యుత్ లైన్ ను మార్చి, జర్నలిస్టుల ఇళ్ల స్థలం మధ్యలో నుంచి స్తంభాలను ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టులు విద్యుత్ శాఖ అధికారుల పనులను అడ్డుకొని మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారుల తీరుపై జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క స్థలంలో ఉన్న విద్యుత్ లైన్ ను మార్చి తమ స్థలంలో స్తంభాలు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని ఏడీఈని ప్రశ్నించారు. దీంతో తప్పు తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు నాటిన స్తంభాలను తొలగించడంతో పాటు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ల నాయకులు, శేరిలింగం పల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి జర్నలిస్టులు పాల్గొన్నారు.

అద్భుతమైన పనితీరు కనబరిచిన ఇఫ్కో

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: ప్రపంచ నంబర్ 1 సహకార సంస్థ, ఇఫ్కో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ పన్నుల కు ముందు(పీబీటీ) రూ. 3,811 కోట్ల లాభాన్ని నమోదు చేసింది, దీనితో పాటు నానో ఎరువుల అమ్మకాలు 47% పెరిగినట్లు నివేదించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-2024)లో అమ్ముడైన 248.95 లక్షల బాటిళ్లతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం (2024-2025) 365.09 లక్షల నానో-ఎరువుల బాటిళ్లు అమ్ముడయ్యాయి. ఇఫ్కో 24-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 41,244 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేసింది. ఇఫ్కో చైర్మన్ శ్రీ దిలీప్ సంఘాని మీడియాతో మాట్లాడుతూ, ఇఫ్కో యొక్క అద్భుతమైన వృద్ధి గణాంకాలు "సహకార సే సమృద్ధి" కలను సాకారం చేసుకోవడం దేశంలోని మొత్తం సహకార రంగానికి గర్వకారణమని అన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

విశాలాంధ్ర,షాద్ నగర్,రూరల్: రైతుల సమస్యలు పరిష్కరిం చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి రెవెన్యూ చట్టం 2025 తీసుకువచ్చిందని, ఇందులో భాగంగానే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతు భూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండల మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి అన్నారు. కేశంపేట మండలం బోదునంపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల పాల్గొన్నారు. విశాల మాట్లాడుతూ.... అధికారులు పూర్తి చేసిన విరాసత్ ధ్రువపత్రాన్ని లబ్ధిదారునికి అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి స్పష్టమైన చట్టాన్ని తీసుకువచ్చిందని ఈ సందర్భంగా ఆమె వివరించారు. చాలాకాలంగా రైతులు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూముల సమస్యలు ఉదాహరణకు పట్టాదారు పాసుపుస్తకం లో పేర్లు తప్పుగా నమోదు కావడం, భూ విస్తీర్ణంలో తప్పుగా నమోదు కావడం లాంటి సమస్యలతో పాటు మరెన్నో పరిష్కరించేందుకు నూతన చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో భూమి సంబంధిత సమస్యల ఆర్జీలను తీసుకుని అధికారులు అక్కడే పరిశీలించి పరిష్కరిస్తారని వివరించారు. రెవిన్యూ సదస్సులను రైతులు భూ యజమానులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అజాం అలీ, ఆర్ఐ నివేదిత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్, కేశంపేట్ మండల కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, గిరి యాదవ్, సురేష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నర్సింలు, సుందరయ్య, పర్వతాలు, పాండు, నగేష్, లింగారెడ్డి, అఖిల్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోండి

విశాలాంధ్ర రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ సర్కిల్ వార్డ్ ఆఫీస్ లో మంగళవారం భూ భారతి చట్టం పై రెవిన్యూ భూ సమస్యల పరిష్కారం కోసం ఉప్పర్ పల్లి బుద్వెల్ రైతుల కోసం రెవెన్యూ సదస్సు తహసీల్దార్ రాములు డిప్యూటీ తహసీల్దార్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలోలో నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదు రాలేదు అని అధికారులు తెలిపారు. ఈ సదస్సు రేపు శివరాంపల్లి జాగీర్ పైగా గ్రామాలకు సంబంధించిన రెవిన్యూ సదస్సులు రాజేంద్రనగర్ వార్డ్ ఆఫీస్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఇంద్ర సేనరెడ్డి, ఆర్ఐ సునీత సంబరాజు పృథ్వి, పరమేష్ ,రవళి, ఆనంద్ సురేందర్ షేక్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్కే విల్లాస్ నూతన అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర,షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లోని సీఎస్కే విల్లాస్ నూతన కార్యవర్గం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించడం జరిగింది. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి పాల్గొని నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా అప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జెనరల్ సెక్రటరీగా సోమశేఖర్, కోశాధికారిగా సాధత్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి స్థానిక మాజీ కౌన్సెలర్ శ్రావణి, యూసుఫ్ ఖామస్, అబ్దుల్ రబ్ జామి, జమ్రుత్ ఖాన్, ముంతాజ్ బేగం, శివరాం, హీరా గ్రూప్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు జన్మదినోత్సవం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : ప్రజల కోసం నిత్యం పనిచేసే వ్యక్తి హరీష్ రావు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు ఏం. నగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హరీష్‌రావును విమర్శించే నైతిక హక్కు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు లేదు. హరీష్‌రావు ఏడు సార్లు ఎం ల్ ఏ గా గెలిచారు. మీరు ఇప్పటికి ప్రజాప్రతిని కాలేదు. కాంగ్రెస్ పార్టీ మీకు టికెట్ ఇస్తే డిపాజిట్ రాలేదు. లాటరీ పద్ధతిలో పిసిసి అధ్యక్షుడైన మహేష్ గౌడ్ తెలంగాణ లోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడయినా గెలిచి చూపించండి అప్పుడు నేను రాజకీయాలు వదిలేస్తా. మహేష్ కుమార్ గౌడ్ తన స్థాయిని మరిచి విమర్శలు చేయడం సరికాదు.అవగాహన రాహిత్యంతో కాళేశ్వరం విషయంలో మాట్లాడడం సిగ్గుచేటు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద పారే ఎకరాలకు కరెంట్ బిల్ ఎక్కువ వస్తుంది, అని నీవే అంటావ్, మళ్లి ఒక్క ఎకరానికి నీరు పారలే అంటావ్. చరిత్ర చూసుకో మీ కాంగ్రెస్ నాయకులే కాళేశ్వరం గొప్పతనం గురించి ఒప్పుకున్నారు. రాష్ట్రాలు విదేశాలనుండి వచ్చినా ప్రతివారు కాళేశ్వరం గొప్పతనాన్ని పొగిడారు. ఎన్ని ఎకరాలకు కాళేశ్వరం నీరు పారుతుందో ఇరిగేషన్ ఆఫీస్ నుండి రికార్డ్ లు తెచ్చుకొని చూడు. కాళేశ్వరం తెలంగాణ రైతుల పాలిత జీవనది అన్నారు.

సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధులుగా పని చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధికి వారదులుగా పనిచేయాలని దఅఆర్ఎస్ పార్టీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గం 126 -జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్య నగర్ సి బ్లాక్ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గం సభ్యులు బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ అంజయ్య నగర్ సి బ్లాక్ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజా సంక్షేమం విషయంలో సంక్షేమ సంఘం సభ్యులు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మధ్య వారధిగా ఉండాలని, మీరు గెలిపించిన మీ నాయకుడిగా కాలనీ అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే నూతన కార్యవర్గం సభ్యులని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు ఎత్తరి మారయ్య, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కె.బాబు, నాగరాజు, వెంకటయ్య, లాలయ్య, రాజ శేఖర్, రమేష్, సోమేష్, అంజయ్య నగర్ సీ బ్లాక్ నూతన అధ్యక్షులు గురవయ్య, ఉపాధ్యక్షులు పాండు,ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్, కోశాధికారి అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణ ఉద్యమకారులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వ్యతిరేకిస్తూ అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తామని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ప్రఫుల్ రామ్‌రెడ్డి, అధ్యక్షులు సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి బత్తుల సమ్మయ్య తెలిపారు. తెలంగాణ ఆవిర్భవ దినోత్సవం జూన్ 2న సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో ఉద్యమకారుల ప్రస్తావనం లేకపోవడం శోచనీయమన్నారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల చొప్పున స్థలం ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా ఆలోచించి ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ నాయకులు కోతి మాధవి రెడ్డి, క్రిస్టోఫర్, రమేష్ సాగర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వాహనాలలోనే చెత్తను వేయాలి

తుర్కయంజాల్ (విశాలాంధ్ర): తడి పొడి చెత్తను వేరు చేయడం, వాటిని మున్సిపల్ వాహనానికి అందించి చెత్తను మున్సిపల్ వాహనాల లోనే వేయాలని మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీ లలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 100 రోజుల కార్యక్రమంకి సంబంధించి తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలోని అన్ని వార్డుల్లో మంగళవారం బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా చూడడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పలు దుకాణ సముదాయాల వారిని తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, నోడల్ అధికారులు మున్సిపల్ డి ఈ, ఏఈఈ, ఆర్ఓ, ఎస్ఐ, వార్డ్ అధికారులు, బిల్ కలెక్టర్ లు, జవాన్ లు ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది మరియు మెప్మా తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి : రవికుమార్

విశాలాంధ్ర రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ మంగళవారం రానున్న వర్ష కాలంలో నాలా రోడ్ల పైన నీళ్లు ఉండే ప్రాంతాలలో త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులకు ఉందని ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అనంతరం ఫోర్ట్ వ్యూ కాలనీ చింతల్ మెట్ వీరనగర్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డిఈ బాద్రు సత్యనారాయణ, ఏ ఈ వేణుగోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

విభజన హామీల సాధనకు కేంద్రంపై ఒత్తిడి

అన్ని పక్షాలు కలిసి పోరాడాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఇచ్చిన హామీలను సాధించుకునేందుకు అధికార ప్రతిపక్ష పార్టీలతో పాటు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావుల వర్గం ఐక్యంగా కేంద్రంపై మరింత ఒత్తిడి పెంచేందుకు కృషి చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. జై ఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం -ఆంధ్రప్రదేశ్ అధ్వర్యంలో స్థానిక రామన్నపేటలోని జనచైతన్య వేదిక సమావేశ హాలులో 'అమలు కాని విభజన హామీలు-యువత వలసలు-అప్పుల ఊబిలో ఆంధ్రప్రదేశ్' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జై ఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం కార్యదర్శి అవధానుల హరి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్.తులసీ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావులు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీలు గత 11 సంవత్సరాలలో 10 శాతం మాత్రమే అమలయ్యాయని, నిర్మాణాత్మక ప్రజా ప్రతిపక్షం ద్వారానే కేంద్రం మెడలు వంచి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టాన్ని నూరు శాతం అమలు చేసుకోగలమని వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా, వెనుకబడిన 7 జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదు...జాతీయ ప్రాజెక్టు పోలవరం ఎత్తు తగ్గించడం ద్వారా రాష్ట్రానికి అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. విభజన చట్టంలోని సెక్షన్ 94 ప్రకారం కొత్త రాజధాని నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని... విభజన చట్టంలోని షెడ్యూల్ 9.10లో గుర్తించిన 197 సంస్థలను ఉమ్మడి ఆస్తులుగా భావించి 52 శాతం ఆంధ్రప్రదేశ్‌కు 48 శాతం తెలంగాణకు పంచుకోవాల్సి ఉండగా... ఆవిధంగా జరగలేదన్నారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సహకారంతో కడపలో భారీ ఉక్కు కర్మాగారం నిర్మించాల్సి ఉండగా నేటికీ ఆ దిశగా అడుగులు పడలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం 5 కోట్ల ఆంధ్రులకు అన్యాయం చేసిందన్నారు. విభజన హామీల అమలులో కేంద్రంపై వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు ఎలాంటి ఒత్తిడి చేయకపోగా, రాష్ట్ర ప్రయోజనాలను కాలరాస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని బలపరచడం దారుణమన్నారు. విశాఖలో కొత్త రైల్వేజోన్, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లకు ఆమోదం రాలేదని, జాతీయ విద్యా సంస్థలను ప్రారంభించినా తగిన నిధులు, మౌలిక వసతులు కల్పించలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ నిర్మాణాత్మక ప్రతిపక్షం ఏర్పడవలసిన సమయం ఆసన్నమైందని, కార్పొరేట్ రాజకీయాలకు భిన్నంగా ప్రజల మేలు కోరే రాజకీయాలు రావాలని కోరారు. వైసీపీ పాలనలో రూ.పది లక్షల కోట్లకు పైగా అప్పులు ఉండగా... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే లక్షా యాభై ఆరు వేల కోట్లు అదనంగా అప్పులు చేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పోలవరం-బనకచర్ల భారీ నీటిపారుదల ప్రాజెక్టును 82 వేల కోట్ల రూపాయలతో నిర్మించతలపెట్టడం అర్థరహితమన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు ఐక్యమై నిర్దిష్ట ప్రణాళికతో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీల అమలుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రౌండ్ టేబుల్ సమావేశంలో నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్, ప్రోగ్రెసివ్ ఫోరం అధ్యక్షులు పీవీ మల్లికార్జునరావు, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ, ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రమణ్యం, ప్రొఫెసర్ ఎన్. వేణు గోపాలరావు, ప్రొఫెసర్ విజయ్‌కుమార్, జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం అధ్యక్షుడు మేడా శ్రీనివాస్, డాక్టర్ టీ సేవ కుమార్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఐక్యత, భిన్నత్వంలో ఏకత్వం

ఇదే జాతీయభాష: ఎంపీ కనిమొళి

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ వివరాలు, ఉగ్రవాదంపై భారత్ పోరును వివరించేందుకు విదేశాల్లో అఖిలపక్ష ఎంపీల బృందాల పర్యటనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా డీఎంకే ఎంపీ కనిమొళి సారథ్యంలోని ప్రతినిధుల బృందం స్పెయిన్‌లో పర్యటిస్తోంది. భారతదేశ అధికార భాషపై మాడ్రిడ్‌లో ఎన్ఆర్ఐలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కనిమొళి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారతదేశంలో అధికార భాషపై అడిగిన ఒక ప్రశ్నకు ఎంపీ కనిమొళి సమాధానమిస్తూ... ఐక్యత, భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ జాతీయ భాష అని చెప్పారు. ఈ సందేశాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు తమ ప్రతినిధుల బృందం వచ్చిందన్నారు. ఐక్యత, భిన్నత్వంలో ఏకత్వం చాలా ప్రాధాన్యతతో కూడుకున్న అంశమని కనిమొళి చెబుతున్నప్పుడు హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. భిన్నత్వంలో ఏకత్వం అనేది రాజ్యాంగంలో పొందుపరిచారని, ఏ ఒక్క భాషను జాతీయ భాషగా ప్రకటించ లేదని, అయితే రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ కింద అధికారిక భాషలుగా 22 భాషలను గుర్తించారని చెప్పారు. ఉగ్రవాదంపై మాట్లాడుతూ ఉగ్రవాదంపై పోరుకు కట్టుబడి ఉన్నామని, ఆ పని చేస్తున్నామని, ఇంకా చేయాల్సింది ఉందని చెప్పారు. భారత్ సురక్షిత దేశమని, కశ్మీర్ సురక్షితంగా ఉండేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇందుకు భిన్నంగా ఎవరు ఏమి చేయాలనుకున్నా వారి ఆటలు సాగనీయమని అన్నారు. కనిమొళి ప్రతినిధుల బృందంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ కుమార్ రాయ్, బీజేపీ ఎంపీ బ్రిజేశ్ చౌతా, ఆప్ ఎంపీ అశోక్ మిత్తల్, ఆర్జేడీ ఎంపీ ప్రేమ్ చంద్ గుప్తా, మాజీ దౌత్యవేత్త మంజీవ్ సింగ్ పురి ఉన్నారు.

ప్రపంచ రికార్డు సృష్టించేలా యోగా డే

21న విశాఖలో 5 లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు

7న అవగాహనా ర్యాలీలు

14న లక్ష ప్రాంతాల్లో యోగా ప్రాక్టీస్

సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖలో ఈ నెల 21న నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా డే కార్యక్రమాన్ని పూర్తి స్థాయి సన్నద్ధతతో, ప్రజల భాగస్వామ్యంతో గిన్నీస్ వరల్డ్ రికార్డు సృష్టించేలా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం యోగా డే కార్యక్రమంపై సీఎం సమీక్షించారు. మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్, వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయస్వామి, సత్యకుమార్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన రిజిస్ట్రేషన్లు, జిల్లాల్లో జరుగుతున్న యోగా సాధన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం సంతృప్తికరంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ నెల 21న విశాఖలో ఐదు లక్షలమంది పాల్గొనేందుకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా జరగాలని సీఎం నిర్దేశించారు. ప్రధాని మోదీ రాక సందర్భంగా ట్రాఫిక్ పరంగా ఆంక్షలు ఉంటాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం అన్నారు. ట్రాఫిక్ సహా ఏ ఇబ్బందీ ఉండకూడదు...అందరూ నిర్దేశించిన ప్రాంతానికి చేరుకునేలా చూడాలని, యోగా డే కంటే ముందు రెండు సార్లు రాష్ట్ర స్థాయిలో భారీగా ప్రీ ఈవెంట్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 7వ తేదీన ప్రతి గ్రామంలో, ప్రతి ప్రాంతంలో యోగా డే అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తారు. 14న రాష్ట్రంలో లక్ష ప్రాంతాల్లో యోగా ప్రాక్టీస్ చేస్తారు. ప్రతి విద్యా సంస్థతో పాటు అవకాశం ఉన్న అన్ని సంస్థలు, ప్రాంతాల్లో అదే రోజు యోగా నిర్వహించి యోగా డేకు ప్రజలను సిద్ధం చేస్తారు. తద్వారా యోగా డే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనేలా చేయాలని మార్గనిర్దేశనం చేశారు. యోగా మంత్‌లో భాగంగా ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాలను, యోగా డే నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రోజుకో థీమ్‌తో వివిధ వర్గాల ప్రజలతో జిల్లాల్లో నిర్వహిస్తోన్న కార్యక్రమాలకు వస్తున్న స్పందనను అధికారులు వివరించగా సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. 21వ తేదీన విశాఖలో వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా చేసేందుకు జర్మన్ హ్యాంగర్లతో మరో వేదిక సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఏర్పాట్లపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు వివరిస్తూ...ప్రతి గ్రామం నుంచి యోగాలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. రెండు కోట్ల మందికి రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా...ఇప్పటి వరకు 1.77 కోట్ల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. మొత్తం 2,600 మంది మాస్టర్ ట్రైనర్లు సిద్ధం చేయాలని లక్ష్యం పెట్టుకోగా....5,353 మందిని గుర్తించామని సీఎం చంద్రబాబుకు వివరించారు.

'ట్రంప్ ఆదేశిస్తారు... మోదీ ఆచరిస్తారు'

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు లొంగిపోవడం అలవాటు: రాహుల్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశిస్తే... మన ప్రధాని నరేంద్ర మోదీ ఆచరిస్తారంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ట్రంప్ ఆపమంటే మోదీ ఆపేస్తారని, నరేంద్రుడు లొంగిపోయారని విమర్శలు గుప్పించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌తో కాల్పుల విరమణకు ఒప్పందం జరిగినట్లు ట్రంప్ ప్రకటించడాన్ని కాంగ్రెస్ ఎంపీ దుయ్యబట్టారు. 'ట్రంప్ అక్కడ నుంచి ఓ సైగ చేశారు. ఫోన్ తీసి 'మోదీజీ మీరు ఏం చేస్తున్నారు? నరేంద్ర... సరెండర్' అన్నారు. ఇంకేముంది మన ప్రధాని మోదీ లొంగిపోయారు' అని మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ సభలో రాహుల్ వ్యంగాస్త్రాలు సంధించారు. కొద్దిపాటి ఒత్తిడి ఎదురైతే లొంగిపోతారని, లొంగిపోవడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు అలవాటని వ్యాఖ్యానించారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్ వర్గీయుల సంగతి నాకు బాగా తెలుసు. కాస్త ఒత్తిడికి గురిచేస్తే చాలా భయపడిపోతారు. పారిపోతారు' అని విమర్శించారు. 1971 యుద్ధమప్పుడు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్రను రాహుల్ ప్రశంసించారు. అమెరికా నుంచి బెదిరింపులు ఎదురైనప్పటికీ పాకిస్థాన్‌కు భారత్ చుక్కలు చూపిందన్నారు. '1971 యుద్ధమప్పుడు వచ్చినది ఫోన్ కాల్ కాదు...సెవెన్త్ ఫ్లీట్' అని మీకు గుర్తు ఉండేవుంటుంది. ఆయుధాలు వచ్చాయి. యుద్ధ విమానం వచ్చింది. చేయాల్సినదంతా చేస్తామని ఇందిరా గాంధీ చెప్పారు. ఇది వీరి వ్యక్తిత్వాల్లో తేడా. వీళ్ల(బీజేపీ-ఆర్ఎస్ఎస్)కు స్వాతంత్ర్యం సమయం నుంచే లొంగిపోతూ లేఖలు రాయడం అలవాటు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు లొంగిపోవడం తెలియదని వక్కాణించారు. గాంధీ, నెహ్రూ, పటేల్ ఎవరికీ తలొగ్గలేదని... అగ్రరాజ్యాలను ఎదిరించారని... వారు పోరాటయోధులని శ్లాఘించారు. లొంగిపోవడం తెలియని నాయకుల వారసులుగా కాంగ్రెస్ పార్టీని విజయపథంలో ముందుకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. 2028 అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపేందుకు ఆయన భోపాల్‌లో పర్యటించారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అంతకుముందు రాహుల్‌కు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జీతూ పట్వారీ, మాజీ సీఎం కమల్‌నాథ్ నుంచి ఘనస్వాగతం లభించింది. ఈ పర్యటనలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీతో రాహుల్ సమావేశమయ్యారు. సీనియర్ నేతలతో కీలకాంశాలపై చర్చించారు.

ప్రీమియం ప్రజలది... ప్రయోజనం అదానీకి

అదానీ పోర్ట్స్ బాండ్‌ను ఎల్ఐసీ కొనుగోలు చేయడంపై రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఇటీవల అదానీ పోర్ట్స్&స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ (ఏపీఎస్ఈజెడ్)లో పెట్టుబడి పెట్టడంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఇది ప్రైవేట్ ప్రయోజనాలకు ప్రయోజనం చేకూర్చడానికి ప్రభుత్వ నిధులను ఉపయోగిస్తున్నారనే దానికి మరొక ఉదాహరణగా అభివర్ణించారు. ఈ మేరకు బ్లూమ్‌బెర్గ్ నివేదికను ఉటంకిస్తూ 'ఎక్స్' వేదికగా రాహుల్ ఇలా అన్నారు: 'డబ్బు, పాలసీ, ప్రీమియం మీవి - భద్రత, సౌలభ్యం ప్రయోజనం అదానీకి' అంటూ ఎద్దేవా చేశారు. భారత్‌లోని అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ యుటిలిటీ 'ఏపీఎస్ఈజెడ్' ద్వారా రూ.50 బిలియన్ల (సుమారు 585 మిలియన్ డాలర్లు) బాండ్ అమ్మకంలో ఎల్ఐసీ ఏకైక కొనుగోలుదారని నివేదిక పేర్కొంది. మే 30న ఏపీఎస్ఈజెడ్...15 ఏళ్ల నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ (ఎన్‌సీడీ) ఇష్యూ ద్వారా రూ.5,000 కోట్లు సేకరించినట్లు నిర్ధారించింది. ఇది ఇప్పటివరకు అతిపెద్ద దేశీయ బాండ్. 7.75 శాతం పోటీ వార్షిక కూపన్ రేటుతో పెంచబడిన ఈ ఆఫర్‌కు ఎల్ఐసీ పూర్తిగా సభ్యత్వాన్ని పొందిందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఉద్ధవ్‌కు రాజకీయ శత్రువు రౌత్: గిరీశ్ మహాజన్

ముంబై: ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన శివసేన ఎంపీ సంజయ్ రౌత్‌పై బీజేపీ సీనియర్ నాయకుడు, మహారాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి గిరీశ్ మహాజన్ తీవ్ర విమర్శలు చేశారు. సంజయ్ రౌత్ ఒక బ్రోకర్ అని, ఆయన ఉండగా ఉద్ధవ్ ఠాక్రేకు వేరే రాజకీయ శత్రువులు అక్కర్లేదని వ్యాఖ్యానించారు. సంజయ్ రౌత్ శివసేన పార్టీని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ కోసం ఎంతో కష్టపడిన నాయకులను, ఏళ్లుగా పనిచేస్తున్న కార్యకర్తలను సంజయ్ రౌత్ దూరం చేస్తున్నారని గిరీశ్ మహాజన్ విమర్శించారు. 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత శివసేనను బీజేపీకి దూరం చేసి శరద్‌పవార్‌తో, కాంగ్రెస్‌తో కలిసేలా చేసింది సంజయ్ రౌతేనని ఆయన ఆరోపించారు. అప్పుడే శివసేన పతనం మొదలైందన్నారు. అయితే ఎన్డీఏ కూటమి అధికారం కోల్పోతే బీజేపీని ఎడారిగా మార్చే నాయకుల్లో మంత్రి గిరీశ్ మహారాజ్ ముందుంటారని ఇటీవల సంజయ్ రౌత్ ఆరోపించారు.

ప్రశ్నిస్తే అణచివేస్తారా?

జగన్ ఆగ్రహం

తెనాలిలో హింస బాధితులకు పరామర్శ

విశాలాంధ్ర-తెనాలి: ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారని, రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ దుర్వినియోగం అవుతుందని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. పోలీస్ వ్యవస్థ వికృత రూపానికి తెనాలి ఘటనే సాక్ష్యమన్నారు. కేవలం కానిస్టేబుల్‌ను ప్రశ్నించడమే బాధితులు చేసిన తప్పు అంటూ అసహనం వ్యక్తంచేశారు. అరెస్ట్ చేసిన వాళ్లను సకాలంలో కోర్టు ముందు ప్రవేశపెట్టక పోవడం చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. నడి రోడ్డుపై యువకులను కొట్టే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని నిలదీశారు.

జగన్ మంగళశారం తెనాలి, ఐతా నగర్‌లో హింసకు గురైన జాన్ విక్టర్, దోమా రాకేశ్, షేక్ బాబూలాల్ కుటుంబాలను పరామర్శించారు. అధైర్య పడొద్దని... తమ పార్టీ సహాయ సహకారాలు అందిస్తుందని వారికి భరోసానిచ్చారు. పోలీసుల తీరును జగన్ ఆక్షేపించారు. కొట్టొద్దని వేడుకున్నా పోలీసులు వదల్లేదని, యువకులను కింద పడేసి కొట్టారని, ఎంత మాత్రం మర్యాద ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. విక్టర్ జేబులో కత్తి పోలీసులే పెట్టారని,. ఈ వ్యవహారంలో తెనాలి టూటౌన్ సీఐ, మరో పీఎస్ సీఐ కూడా ఉన్నారని. ఇద్దరూ వీఆర్వో సమక్షంలో పంచనామా రాసుకున్నారని జగన్ అన్నారు. ఈ ఘటన తర్వాతే ముగ్గురిపై రౌడీషీట్ తెరిచారని, దీనినిబట్టి పోలీసులు ఎంత దుర్మార్గంగా వ్యవహరించారనేది అర్థమవుతోందని ఆయనన్నారు. జగన్ వెంట వైసీపీ నేతలు అంబటి రాంబాబు, అన్నాబత్తుని శివకుమార్ తదితరులు ఉన్నారు.

వ్యాపారవేత్తలుగా కుల వృత్తిదారులు

ఆదరణ-3 కింద అధునాతన పరికరాలు: మంత్రి సవిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కుల వృత్తుదారులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగా మూడో విడత ఆదరణ పథకం కింద అధునాతన పరికరాలు అందివ్వనున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వివిధ జిల్లాల ఈడీలతో మంత్రి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు అందిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ గురించి జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత టైలరింగ్ శిక్షణతో కుట్టు మిషన్లు అందజేస్తోందని మంత్రి అన్నారు. కుట్టు శిక్షణకు హాజరవుతున్న మహిళలను పథకంపై సంతృప్తి వ్యక్తం చేస్తుండటంపై ఆనందం వ్యక్తం చేశారు. మూడో విడత ఆదరణ పథకం కింద కుల వృత్తుదారులకు సంప్రదాయ పరికరాలకు బదులు అధునాతన పరికరాలు అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కుల వృత్తుదారులను వ్యాపారులుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ఆదరణ-3 అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రాంతాల వారీగా లబ్ధిదారులు ఎటువంటి పరికరాలు ఆశిస్తున్నారో వివరాలు సేకరించాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

రిమాండ్ పొడిగింపునకు హడావుడెందుకు?

లిక్కర్ స్కాం నిందితుల కోసం వచ్చిన వారిపై కోర్టు ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుల రిమాండ్‌ను విజయవాడ కోర్టు మళ్లీ పొడిగించింది. ఈ కేసులో రాజ్ కసిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చాణక్య, దిలీప్, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పకు రిమాండ్ గడువు ముగియడంతో సిట్ అధికారులు మంగళవారం వారిని కోర్టులో హాజరుపర్చారు. దీంతో ఏడుగురు నిందితులకు ఈనెల 17 వరకు రిమాండ్ పొడిగిస్తూ విజయవాడ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నిందితుల కోసం వారి కుటుంబ సభ్యులు, వైసీపీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిందితులను కోర్టులో హాజరుపరచగానే వీరంతా లోపలకు తోసుకుంటూ ప్రవేశించారు. ఈ క్రమంలో న్యాయమూర్తి ఘాటుగా స్పందించారు. రిమాండ్ పొడిగింపునకు ఇంతమంది అవసరమా అంటూ డిఫెన్స్ న్యాయవాదులను ప్రశ్నించారు. సాఫీగా రిమాండ్ పొడిగింపు జరిగే దాని కోసం ఇంత హడావిడి ఎందుకంటూ నిలదీశారు. ఇలాగే జరిగితే ఇప్పటివరకు తెరిచి ఉన్న తలుపులు మూసుకుపోతాయంటూ సీబీఐ కోర్టు న్యాయాధికారి వ్యాఖ్యానించారు. అనంతరం ఏడుగురు నిందితులను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

టీడీపీ మాజీ మంత్రి నా ఆస్తి కబ్జా చేశాడు

ఎన్నారై నేత మురళీమోహన్ ఆవేదన

విశాలాంధ్ర-హైదరాబాద్: ఏపీ టీడీపీ మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఆయన అనుచరులు తన ఆస్తిని కబ్జా చేశారని ఎన్ఆర్ఐ టీడీపీ సెల్ సభ్యుడు రావి మురళీమోహన్ ఆరోపించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏపీలోని చిలకలూరిపేటలో తనకు సాయికార్తీక్ సిటీ సెంటర్ పేరుతో షాపింగ్ కాంప్లెక్స్ ఉందని తెలిపారు. ఆ కాంప్లెక్స్‌లో రెండు థియేటర్లు, ఫంక్షన్ హాళ్లు, రెండు అంతస్తుల వాణిజ్య సము దాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటి విలువ సుమారు రూ.69 కోట్ల ఉంటుందని చెప్పారు. ఉద్యోగరీత్యా తాను 20 సంవత్సరాలుగా అమెరికాలోని ఫ్లోరిడాలో నివాసం ఉంటున్నానని మురళీమోహన్ తెలిపారు. పది నెలల క్రితం మాజీ మంత్రి, టీడీపీ నేత పత్తిపాటి పుల్లారావు, అతని అనుచరులు తన షాపింగ్ కాంప్లెక్స్ మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారని తెలిపారు. తన తండ్రి కందిమల్ల అంజిబాబు అనే వ్యక్తి వద్ద రూ.97 లక్షల రుణం తీసుకున్నాడని ఆరోపిస్తూ తన ఆస్తులు కబ్జాదారులు ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. నిజంగానే రుణం తీసుకుంటే తాను మొత్తం చెల్లిస్తానని చెప్పారు. రుణం పేరుతో తన ఆస్తిని కబ్జా చేస్తున్నారని, వారికి మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు సహకారం ఉందన్నారు. ఈ విషయంపై అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు పెట్టడం లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. తన ఆస్తులను కబ్జా చేసిన వ్యక్తులందరూ టీడీపీ వారే కావడంతో సరైన చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. తనకు టీడీపీతో 37 సంవత్సరాల అనుబంధం లేదని, ఆ పార్టీ ఎన్ఆర్ఐ సెల్‌కు తాను సభ్యుడిగా ఉన్నానని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

85 శాతం ఉద్యోగాలు స్థానికులకే

లదాఖ్ ప్రజలకు కేంద్రం ఎర

న్యూఢిల్లీ: కేంద్ర పాలిత ప్రాంతం లదాఖ్‌లో నివసిస్తున్న ప్రజల భాష, సంస్కృతి, రాజ్యాంగ పరిరక్షణ కోసం కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వారి స్థానికత, రిజర్వేషన్ల అంశంపై అధికారిక ప్రకటన చేసింది. 85 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని నిర్ణయించింది. 15 ఏళ్లకు మించి ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారు, కనీసం ఏడేళ్లపాటు అక్కడ చదువుకొని 10 లేదా 12వ తరగతి పరీక్షలకు హాజరైనవారిని స్థానికులుగా గుర్తించాలని నిర్ణయించింది. అంతేకాకుండా లదాఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో మూడులో ఒక వంతు సీట్లు మహిళలకే కేటాయించనున్నారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్-370ని 2019లో రద్దు చేసిన తర్వాత జమ్మూకశ్మీర్‌ను రెండు భాగాలుగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. జమ్మూ కశ్మీర్, లదాఖ్‌లు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో తమ భాష, సంస్కృతి, హక్కుల పరిరక్షణ కోసం స్థానికంగా నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో స్థానికుల ప్రయోజనాల పేరుతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. లదాఖ్ ప్రజల స్థానికత నిర్ధారణకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ జనవరి 2023లో ఏర్పాటైంది. వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఈ బృందం వారి సమస్యలు తెలుసుకొని ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేసింది.

'సిందూర్' నష్టం ఎక్కువే!

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ క్రమంలో భారీ నష్టాలు జరిగాయని అధికారులు అంటున్నారు. భారత వైమానిక దళం జరిపిన దాడుల్లో పాకిస్థాన్‌కు చెందిన ఆరు పీఏఎఫ్ యుద్ధ విమానాలు, 2 ఏ డబ్ల్యూఏసీఎస్, ఒక సీ-130 విమానం, 30 క్షిపణులు, అనేక డ్రోన్లు ధ్వంసమయ్యాయని ఆపరేషన్‌లో పాల్గొన్న వర్గాలు తెలిపాయి. ఈ లక్ష్యాలన్నింటినీ సుదర్శన్ వైమానిక క్రూయిజ్ క్షిపణి, ఉపరితలం నుంచి గగనతల క్షిపణుల సహాయంతో ఛేదించారు. సుదర్శన్ క్షిపణి 300 కి.మీ దూరం నుంచి కచ్చితమైన దాడి నిర్వహించింది. పాకిస్థాన్ భోలారి వైమానిక స్థావరంపై దాడిలో స్వీడిష్ ఏఈడబ్ల్యూఈ విమానం (ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్) కూడా ధ్వంసమైంది. వైమానిక స్థావరంలో అనేక యుద్ధ విమానాలు ఉన్నాయి. శిథిలాలను పాకిస్థాన్ తొలగించింది. పాకిస్థాన్‌పై భారత్ కేవలం వైమానిక ప్రయోగ క్రూయిజ్ క్షిపణులను మాత్రమే ఉపయోగించింది. 'వింగ్ లూంగ్' సిరీస్‌కు చెందిన అనేక మీడియం-ఎలిట్యూడ్ లాంగ్-ఎండ్యూరెన్స్ చైనీస్ డ్రోన్‌లు రాఫెల్, ఎస్-30 దాడులలో ధ్వంసమయ్యాయి. భారత్ చేతిలో ఓటమి అనంతరం పాక్ కాల్పుల విరమణ కోసం అభ్యర్థించింది. ఆ తర్వాత భారతదేశం కాల్పుల విరమణకు అంగీకరించింది. అయితే, భవిష్యత్తులో ఏదైనా దుర్మార్గపు చర్యకు పాల్పడితే మరిన్ని చర్యలు తీసుకుంటామని భారతదేశం పాకిస్థాన్‌ను హెచ్చరించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.